శనివారం
6•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 11
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD






### నేడు పదో తరగతి అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జూన్‌లో నిర్వహించిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శనివారం (ఈ నెల 6న) విడుదల చేస్తున్నట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు బీ సుధాకర్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# జీఎస్డీపీలో తెలంగాణదే అగ్రస్థానం

- మన పథకాలు దేశానికే ఆదర్శం
- టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సమర్థ నాయకత్వంలో.. తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతున్నదని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చెప్పారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను భారత ప్రభుత్వం విడుదలచేసిన ఎకనమిక్ సర్వే ఈ విషయాన్ని నిరూపిస్తున్నదని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఏర్పడిన ఐదేండ్లలోనే 14.9 శాతం వృద్ధిరేటుతో గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎస్డీపీ) విషయంలో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని తెలియజేస్తూ.. హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆంగ్ల పత్రికల్లో వచ్చిన కథనాలను కూడా ఆయన ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు.

**నాడు రైతుబంధు.. నేడు మిషన్ భగీరథ**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కేటీఆర్ మరో ట్వీట్‌లో తెలిపారు. సీఎం కేసీఆర్ దేశానికి దిక్సూచి అని పేర్కొన్నారు. రైతుబంధు పథకాన్ని స్ఫూర్తిగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం గత ఏడాది పీఎం కిసాన్ యోజనను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో మిషన్ భగీరథను ఆదర్శంగా తీసుకుని 'హర్ ఘర్ జల్' పథకాన్ని ప్రకటించిందని చెప్పారు.



# కేంద్ర సగటు కంటే రాష్ట్రమే ఉత్తమం

- జీఎస్డీపీపై మాజీ ఎంపీ కవిత ట్వీట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 14.9 శాతం వృద్ధిరేటుతో గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎస్డీపీ) విషయంలో దేశంలోనే తెలంగాణ మొదటిస్థానంలో ఉన్నదని నిజామాబాద్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర సగటు కంటే కూడా తెలంగాణ జీడీపీ అధికంగా ఉన్నదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదలచేసిన ఎకనమిక్ సర్వేపై శుక్రవారం ఆమె ట్విట్టర్ వేదికగా స్పందించారు. తెలంగాణ ఆర్థికవృద్ధి రేటు 14.9 శాతం ఉండగా, జాతీయ సగటు 11 శాతం ఉన్నదని తెలిపారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ముందుచూపుతో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై ఇండియా ఎకనమిక్ సర్వే ప్రశంసలు కురిపించిందని పేర్కొన్నారు. 25 ప్రభుత్వ శాఖలు ఈ డాటాను ఉపయోగించుకుంటాయని తెలిపారు.







శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి

## ఖరారైన ఇంజినీరింగ్, ఫార్మసీ ఫీజులు

- నేటినుంచి ఎంసెట్ వెబ్‌ఆప్షన్ల ఎంపిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 2019-20 విద్యాసంవత్సరానికిగాను ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ట్యూషన్ ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ జీవో జారీచేసింది. కోర్టుకెళ్లిన 80 ప్రైవేట్ కాలేజీల్లో వచ్చే మూడేండ్లకు ఫీజులు ఖరారు చేశారు. అదనంగా మరో 23 కాలేజీల్లో కూడా ఫీజులు నిర్ణయించారు. మిగిలిన 88 కాలేజీల్లో 15-20 శాతం చొప్పున ఫీజులను తాత్కాలికంగా పెంచారు. ప్రస్తుత ఫీజు రూ.50 వేలలోపు ఉన్నవారికి 20 శాతం, రూ.50 వేలపైన ఉన్నవారికి 15 శాతం చొప్పున ఫీజులు పెంచారు.

**గరిష్ఠంగా రూ.1.34లక్షల ఫీజు**

ప్రైవేటు కాలేజీల్లో గరిష్ఠంగా రూ.1.34 లక్షల వరకు ఫీజులు పెంచుతూ తెలంగాణ అడ్మిషన్ ఫీ రెగ్యులేటరీ కమిటీ నిర్ణయం తీసుకున్నది. ఫార్మసీ కాలేజీల్లో గత ఏడాది ఫీజులనే తాత్కాలికంగా ఖరారుచేశారు. శనివారం నుంచి ఎంసెట్ వెబ్‌ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానున్నదని కన్వీనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు.

## మీడియా అకాడమీ కార్యదర్శిగా విజయ్‌గోపాల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శిగా విజయ్‌గోపాల్ శుక్రవారం అకాడమీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణను మర్యాదపూర్వకంగా కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు. విజయగోపాల్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి ఉద్దేశించిన ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరచడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన విజయ్‌గోపాల్

# ప్రతీ మొక్క బతుకాలి

- పోడు సమస్యకు త్వరలో పరిష్కారం
- వీడియో కాన్ఫరెన్స్‌లో అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాటిన మొక్కలను బతికించడంపై శ్రద్ధపెడితేనే తెలంగాణకు హరితహారం కల నెరవేరుతుందని అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. అన్ని వర్గాలను హరితహారంలో భాగస్వాములుగా చేసేలా అధికార యంత్రాంగం పనిచేయాలని సూచించారు. ఐదో విడుత హరితహారం ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్లు, వివిధశాఖల ఉన్నతాధికారులు, అటవీ అధికారులతో నిర్మల్ నుంచి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి సంయుక్తంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నర్సరీల్లో మొక్కల లభ్యత, చేపట్టాల్సిన ప్లాంటేషన్‌పై శాఖలు, జిల్లాలవారీగా సమీక్షించారు. అలాగే గత నాలుగు విడుతల్లో నాటిన మొక్కల్లో బతికిన శాతంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీ హక్కు పట్టాలు, పోడు భూముల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. దీంతో అడవుల లోపలా, బయట హరితహారం ద్వారా పచ్చదనం పెంచడానికి వీలు చిక్కుతుందని తెలిపారు. సీఎస్ ఎస్కే జోషి మాట్లాడుతూ.. మొక్కలు నాటుతున్న ప్రదేశాలను తప్పని సరిగా జియో ట్యాగింగ్ చేయాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో నాటిన మొక్కల బాధ్యత తీసుకోవాలని, వారంలో ఒకరోజు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటన చేయాలన్నారు. రెవెన్యూ రికార్డులతో అటవీ రికార్డులను పరిశీలించి అటవీ భూములను నోటిఫై చేసే ప్రక్రియను ఈ నెలాఖరుకల్లా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.



శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరుపుతున్న అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో సచివాలయం నుంచి సమీక్షలో పాల్గొన్న సీఎస్ ఎస్కే జోషి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హా, ముఖ్య కార్యదర్శులు అర్వింద్‌కుమార్, వికాస్‌రాజ్, సోమేశ్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ నీతూప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు కూడా ఉన్నారు.

**మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కండి**

అనంతరం జలశక్తి అభియాన్, స్వచ్ఛభారత్ మిషన్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణ సన్నద్ధత, 2021 జనాభా లెక్కల నిర్వహణ తదితర అంశాలపై ఆయాశాఖల కార్యదర్శులు సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ కోరారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను పరిశీలించి సమీక్షించిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉన్నదని చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు భువనగిరి, తూప్రాన్, రామాయంపేట, మెదక్ మున్సిపాలిటీల్లో సన్నద్ధతను పరిశీలిస్తారన్నారు. జలశక్తి అభియాన్ కార్యక్రమం కింద మన రాష్ట్రంలో 23 జిల్లాల్లో 114 బ్లాకుల్లో 51 వేల పనులను గుర్తించి చేపడుతున్నామని, 75 శాతం పనులు పూర్తయ్యాయని పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద మిగిలిపోయిన టాయిలెట్ల నిర్మాణాలను ఈ నెల 31లోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ కమీషనర్ నీతూప్రసాద్ కలెక్టర్లకు సూచించారు.

**హరితహారానికి నోడల్ అధికారులు**

హరితహారంలో జవాబుదారీతనం పెంచేందుకు మండలానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధశాఖల సిబ్బందిని ఇందుకోసం ప్రతిపాదించారు. వ్యవసాయశాఖ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు, హార్టికల్చర్, అటవీ అధికారులు.. ఇలా ఒక్కో ప్రాంతానికి ఒక్కొక్కరిని హరితహారం నోడల్ ఆఫీసర్లుగా నియమించి పర్యవేక్షించనున్నారు.

### 15 నాటికి పోస్టుల వర్గీకరణ పూర్తిచేయండి

- రాష్ట్రపతి ఉత్తర్వులపై సమీక్షలో సీఎస్ జోషి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా వివిధ శాఖలు తమ క్యాడర్‌స్ట్రెంత్, పోస్టుల వర్గీకరణను ఈ నెల 15వ తేదీనాటికి పూర్తిచేయాలని సీఎస్ ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వివిధశాఖల కార్యదర్శులతో రాష్ట్రపతి ఉత్తర్వులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ.. శాఖాధిపతుల నుంచి వచ్చిన ప్రతిపాదనలను సెక్రటరీలు ఈ నెల 15 కల్లా జీఏడీకి పంపాలని ఆదేశించారు. పోస్టులను జిల్లా, జోనల్, మల్టీజోనల్, రాష్ట్రస్థాయి పోస్టులుగా వర్గీకరించిన అనంతరం నూతన సర్వీస్‌రూల్స్ కోసం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్ మిశ్రా, రాజేశ్వర్‌తివారి, సోమేశ్‌కుమార్, అధర్‌సిన్హా, శాంతికుమారి, ముఖ్యకార్యదర్శులు అర్వింద్‌కుమార్, జయేశ్‌రంజన్, కే రామకృష్ణారావు, శివశంకర్, వికాస్‌రాజ్, శశాంక్‌గోయల్, సబ్యసాచిఘోష్, పీసీసీఎఫ్ పీకే ఝా, కార్యదర్శులు జనార్దన్‌రెడ్డి, బీ వెంకటేశం, బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కా, అశోక్, నిరంజన్‌రావు, కమిషనర్లు నీతూప్రసాద్, దానకిశోర్, అనిల్ కుమార్, రాహుల్‌బొజ్జా, మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కస్టమ్స్, సీజీఎస్టీ చీఫ్ కమిషనర్‌గా శేషగిరిరావు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ జోన్ కస్టమ్స్, సెంట్రల్ జీఎస్టీ చీఫ్ కమిషనర్‌గా వాసా శేషగిరిరావు నియమితులయ్యారు. ఇప్పటివరకు చీఫ్ కమిషనర్‌గా ఉన్న బ్యాంకీ బెహరీ పదవీ విరమణ చెందడంతో ఆయన స్థానంలో శేషగిరిరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ.. పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలందించడం తన ప్రథమ కర్తవ్యమని తెలిపారు. రాబడిని పెంచడంతోపాటు ఉద్యోగులు, అధికారుల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని చెప్పారు.

### న్యాక్ గుర్తింపుపై 8, 9 తేదీల్లో జాతీయ సదస్సు

- ప్రారంభించనున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉన్నత విద్యారంగాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు 'అక్రెడిటేషన్, క్వాలిటీ, ఇంప్రూవ్‌మెంట్ అండ్ ర్యాంకింగ్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ఈ నెల 8, 9 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఈ సదస్సును మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభిస్తారని, నీతిఆయోగ్ సభ్యుడు డాక్టర్ విజయ్‌కుమార్ సారస్వత్, న్యాక్ సీనియర్ సలహాదారు ప్రొఫెసర్ లతా పిళ్ళైతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు సదస్సుకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. న్యాక్ గుర్తింపు పొందిన కాలేజీల నుంచి ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు, అనుభవాలు పంచుకొంటారని తెలిపారు.

### ఎన్నికల విధుల్లో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు పరిహారం

- ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రధానాధికారి ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎన్నికల విధుల్లో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఎన్నికల కమిషన్ పరిహారాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం జిల్లాలో సాగునీటిశాఖలో పనిచేస్తున్న నాగరాజు ఎన్నికల విధుల్లో చనిపోగా.. ఆయన భార్య కృష్ణకుమారికి రూ.10 లక్షల పరిహారం విడుదల చేశారు. కామారెడ్డి జిల్లాకు చెందిన వీఆర్‌ఏ మ్యాడం రాజు భార్య లలితకు, వికారాబాద్ జిల్లాకు చెందిన జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు భార్య సవితకు, మోత్కూరుకు చెందిన డ్రైవర్ లింగయ్య భార్య లింగమ్మకు, నల్లగొండ జిల్లాకు చెందిన బనావత్ సోమ్లానాయక్ భార్య లక్ష్మీబాయికి రూ.10 లక్షల చొప్పున విడుదల చేశారు.

# షిర్డీలో వెలమ సత్రానికి స్థలం కేటాయించండి

**మహారాష్ట్ర సీఎం, గవర్నర్‌కు ఆలిండియా వెలమ అసోసియేషన్ వినతి**

**హైదరాబాద్/ కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** షిర్డీలో వెలమ సత్రానికి (చౌట్రి) నిర్మించేందుకు ఎకరం స్థలం కేటాయించాలని, నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కోరుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావుకు ఆలిండియా వెలమ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ టీ భానుప్రసాద్‌రావు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శుక్రవారం ముంబైలో వినతిపత్రం అందజేశారు. తమ వినతికి వారు సానుకూలంగా స్పందించినట్టు భానుప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ చట్టం పరిధిలో 40 ఏండ్ల కిందట ఆలిండియా వెలమ అసోసియేషన్ రిజిస్టర్ అయిందని, ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలోని 10 వేల మందికి సభ్యత్వం ఉన్నదని తెలిపారు. సభ్యులద్వారానే విరాళాలు అందుతాయని, సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. పేద కుటుంబాల బాలబాలికలు చదువుకునేందుకు వేర్వేరుగా వసతిగృహాలు ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రముఖ దేవాలయ ప్రాంతాల్లో అతిథిగృహాలను నిర్మించినట్లు మహారాష్ట్ర సీఎం, గవర్నర్‌కు వివరించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీఎం, గవర్నర్‌ను ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు.





షిర్డీలో వెలమ సత్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని శుక్రవారం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావును కలిసి వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత వెలమ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ టీ భానుప్రసాదరావు, ఇతర ప్రతినిధులు



తెలంగాణ బీసీ కమిషన్ బహిరంగ విచారణకు హాజరై వినతిపత్రం అందజేస్తున్న సంచార జాతులకు సంబంధించిన కుల సంఘాల ప్రతినిధులు

## బీసీ కమిషన్‌కు వినతుల వెల్లువ

- 11 వరకు విజ్ఞప్తులు, అభ్యంతరాల స్వీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తమను బీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ బీసీ కమిషన్‌కు వినతులు వెల్లువెత్తాయి. 30 సంచార జాతులకు చెందిన ప్రతినిధులు తమను బీసీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి నివేదించగా.. రాష్ట్ర బీసీ కమిషన్ ఆధ్వర్యంలో జూన్ 29 నుంచి శుక్రవారం వరకు బహిరంగ విచారణ చేపట్టారు. 20 సంచార జాతులకు సంబంధించిన కుల సంఘాల ప్రతినిధులు విచారణకు హాజరై బీసీ కమిషన్‌కు 100కు పైగా విజ్ఞప్తులు, అఫిడవిట్లను సమర్పించారు. శుక్రవారం బీసీ కమిషన్ కార్యాలయంలో కాకిపడగల, పటంవారు, కుల్లకడిగి, గుర్రపువారు జాతులకు సంబంధించిన ప్రతినిధులు కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్, సభ్య కార్యదర్శి అనితారాజేంద్రకు వినతిపత్రాలు అందజేశారు. బహిరంగ విచారణకు హాజరు కానివారు ఈ నెల 11వ తేదీ వరకు విజ్ఞప్తులు అందజేయాలని కమిషన్ సూచించింది.

**ధర్మగంట**



నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల తాసిల్ కార్యాలయంలో రైతు ఆకుల ముత్తాగౌడ్‌కు కొత్త పాస్‌పుస్తకం ఆన్‌లైన్ పత్రాన్ని అందజేస్తున్న ఇంచార్జి తాసిల్దార్ వెంకట్రావు

## అందిన పాస్‌బుక్ ఆన్‌లైన్ పత్రం

- 'కొత్త పాస్‌పుస్తకం కోసం 43 సార్లు దరఖాస్తు!' కథనానికి స్పందన
- త్వరలో ముద్రించిన బుక్ ఇస్తామన్న నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల తాసిల్దార్
- ధర్మగంటకు కృతజ్ఞతలు తెలిపిన నిజామాబాద్ జిల్లా తాళ్లరాంపూర్ రైతు

**ఏర్గట్ల:** ఈ నెల 4న 'నమస్తే తెలంగాణ'లో 'కొత్తపాస్ పుస్తకం కోసం 43 సార్లు దరఖాస్తు!' శీర్షికతో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్‌కు చెందిన బాధిత రైతు ఆకుల ముత్తాగౌడ్ భూసమస్యపై పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఇంచార్జి తాసిల్దార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. ముత్తాగౌడ్‌కు వారసత్వం నుంచి వచ్చిన సుమారు ఐదెకరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం తాసిల్దార్ రైతు ఆకుల ముత్తాగౌడ్‌ను తాసిల్ కార్యాలయానికి తీసుకెళ్లారు. ముత్తాగౌడ్ దరఖాస్తు ఎందుకు పెండింగ్‌లో ఉందో విచారణ చేపట్టారు. వెంటనే బాధిత రైతుతో ఈ-కేవైసీ ద్వారా ఆన్‌లైన్ చేయించారు. అనంతరం బాధితుడికి కొత్త పట్టాదారు పాస్ పుస్తకం పత్రాన్ని ఇంచార్జి తాసిల్దార్ అందచేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి తాసిల్దార్ వెంకట్రావు మాట్లాడుతూ.. ముత్తాగౌడ్‌కు భూరికార్డుల ప్రక్షాళన తర్వాత కొత్త పాస్‌పుస్తకం రాలేదన్నారు. 'నమస్తే తెలంగాణ' పత్రికలో వచ్చిన కథనం ద్వారా ఈ విషయం తెలిసిందన్నారు. కొత్త పాస్‌పుస్తకం పత్రాన్ని అందజేశామని, త్వరలో ముద్రించిన కొత్త పాస్‌పుస్తకం వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా బాధిత రైతు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

# పహాణీల కోసం రైతుల ఆందోళన

- కొత్త పాస్‌పుస్తకం ఉన్నా పహాణీలు ఇవ్వని అధికారులు
- జహీరాబాద్‌లో తాసిల్దార్ ఎదుట పట్టాదారుల నిరసన

**జహీరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆన్‌లైన్ పహాణీలో తమ భూమికి సంబంధించి వివరాలు ఒక ఏడాదికి మాత్రమే వస్తుండటంతో, మూడేండ్ల వివరాలతో పహాణీ ఇవ్వాలని తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడంలేదని శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ తాసిల్‌లో గోవింద్‌పూర్‌కు చెందిన పలువురు రైతులు ఆందోళనకు దిగారు. గోవింద్‌పూర్ శివారులో మహ్మద్ జైనొద్దీన్‌కు సర్వే నంబర్ 225/11అలో 4.27 ఎకరాలు, మహ్మద్ మోహినొద్దీన్‌కు సర్వే నంబర్ 225/11అ లో 5.28 ఎకరాలు, మహ్మద్ నహిమొద్దీన్‌కు సర్వే నంబర్ 225/11అ లో ఎకరం వారసత్వంగా వచ్చిన పట్టా భూమి ఉన్నది. ఈ భూమికి సంబంధించి 2016 నుంచి పహాణీ కావాలని రెవెన్యూ అధికారులకు ఈ ముగ్గురు రైతులు దరఖాస్తు చేసుకొన్నారు. ఎన్నిసార్లు అడిగినా అధికారులు స్పందించకపోవడంతో బాధితులు ఆందోళనకు దిగారు. దీంతో దిగివచ్చిన అధికారులు బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పహాణీ కోసం గోవింద్‌పూర్‌కు చెందిన రైతులు దరఖాస్తు చేసుకొన్నారని తెలిపారు. పహాణీలు మ్యానువల్‌లో ఇవ్వరాదని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, రైతులు మీ- సేవ కేంద్రంలో తీసుకోవాలన్నారు. అయినప్పటికీ వారి దరఖాస్తులను పరిశీలించి అందజేస్తామని చెప్పారు.



జహీరాబాద్ తాసిల్దార్ సుబ్రహ్మణ్యం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

# బండపల్లి వీఆర్వో సస్పెన్షన్

- అవినీతికి పాల్పడినట్టు నిర్ధారణ
- ఉత్తర్వులు జారీచేసిన సూర్యాపేట కలెక్టర్

**తిరుమలగిరి నమస్తే తెలంగాణ:** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం బండపల్లి వీఆర్వో ప్రకాశ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. అవినీతి ఆరోపణలులో రావడంతో సస్పెండ్‌చేస్తూ శుక్రవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. బండ్లపల్లి వీఆర్వో ప్రకాశ్ రూ.40 వేలు లంచం తీసుకొని మూడేండ్లుగా పట్టాచేయకుండా తిప్పించుకొంటున్నారని, తాసిల్ ఆఫీసుకు వస్తే సిబ్బందితో బయటకు గెంటివేయించారని బాధిత రైతు జాన్ మహ్మద్ సోషల్‌మీడియాలో పెట్టిన వీడియో వైరల్ కావడంతో శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరుమలగిరి ఇంచార్జి తాసిల్దార్ హరీశ్చంద్రప్రసాద్ గ్రామంలో విచారణ చేపట్టారు. 30 మంది నుంచి వీఆర్వో ప్రకాశ్ సుమారు రూ.20 లక్షలు వసూలుచేసినట్టు ఫిర్యాదుచేశారు. నివేదికను కలెక్టర్‌కు పంపగా, వెంటనే స్పందించిన ఆయన వీఆర్వోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. తిరుమలగిరి తాసిల్ ఆఫీసులో వారం వ్యవధిలోనే రైతుల నుంచి లంచం తీసుకొంటూ ఇద్దరు వీఆర్వోలు సస్పెండ్ అవడం కలకలం రేపుతున్నది.



సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం బండ్లపల్లిలో వీఆర్వో ప్రకాశ్ అవినీతిపై విచారణ చేస్తున్న నాయబ్ తాసిల్దార్ హరీశ్చంద్రప్రసాద్

### పాల్దా వీఆర్వోపై విచారణకు ఆదేశం

- 'పైసలిస్తేనే పనైతది!' కథనానికి స్పందించిన నిజామాబాద్ జేసీ

**నిజామాబాద్ రూరల్:** నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ రూరల్ మండలం పాల్దా వీఆర్వోపై రైతులు చేసిన ఆరోపణలపై విచారణ జరిపించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'పైసలిస్తేనే పనైతది!' శీర్షికతో ప్రచురితమైన కథనంపై జేసీ స్పందించారు. నిజామాబాద్ రూరల్ తాసిల్దార్ జ్వాలాగిరిరావును జేసీ తన చాంబర్‌కు పిలిపించుకొని చర్చించారు. రైతు భూసమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీఆర్వోపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పాల్దా గ్రామంలో నెలకొన్న రైతుల భూసమస్యల పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు తాసిల్దార్ జ్వాలా గిరిరావు తెలిపారు.

శనివారం
6•7•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
సంప్రదించండి
040-30915112
www.shriramcity.in



## మంట మొదలైంది!

**2** పెట్రోల్, డీజిల్‌పై రెండేసి రూపాయల అదనపు సుంకాలు

- లీటరు పెట్రోల్‌పై రూ.2.50.. డీజిల్‌పై రూ.2.30 పెంపు!
- అర్ధరాత్రి నుంచే అమల్లోకి

4

## బంగారంపై కస్టమ్స్ సుంకం



10% నుంచి 12.50 శాతానికి పెంపు

- ఒకేరోజు రూ.590 పెరిగిన ధర
- హైదరాబాద్‌లో రూ.350 ప్రియం

8



- రూ.5లక్షల వరకు ఆదాయానికి పన్ను పూర్తిగా మినహాయింపు
- వ్యక్తిగత ఆదాయం పన్ను పరిమితి యథాతథం
- పాన్‌కార్డు లేకున్నా ఆధార్ కార్డుతో ఐటీ రిటర్నుల దాఖలుకు అవకాశం
- వార్షికాదాయం 5 కోట్లు దాటినవారికి సర్‌చార్జ్ పెంపు

7

# రోల్‌గోల్డ్ బడ్జెట్!

## భారీ లక్ష్యాలతో నిర్మలమ్మ తొలి పద్దు



### రూ.27.86 లక్షల కోట్ల బడ్జెట్

**ఆదాయం వసూళ్లు రూ.14,35,233 కోట్లు**

**మూలధన వసూళ్లు రూ.7,06,740 కోట్లు**

**ఆదాయం లోటు రూ.4,43,600 కోట్లు**

- మౌలిక సదుపాయాలకు రూ.100 లక్షల కోట్లు
- 1.25 లక్షల కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి
- 2024నాటికి ప్రతి ఇంటికీ రక్షిత నీరు
- 2030నాటికి రైల్వే మౌలికవసతులకు రూ.50 లక్షల కోట్లు అవసరం

రెండు కోట్ల నుంచి ఐదు కోట్లు, ఐదు కోట్ల పైబడిన ఆదాయం ఉన్న కుబేరులకు 3%, 7% చొప్పున అదనపు పన్ను

### స్టాక్ మార్కెట్లు ధమాల్

**395 పాయింట్లు నష్టపోయిన సూచీ**

**రూ.2.22 లక్షల కోట్ల సంపద ఆవిరి**

8

రూ. 1, 2, 5, 10, 20 కొత్త నాణేలు రేపు విడుదల



### ఇది భవిష్యత్ ఆధారిత బడ్జెట్

**ఈ బడ్జెట్ పేదలకు అధికారాన్ని ఇచ్చి, యువతకు ఉత్తమ భవిష్యత్ అందించేలా ఉన్నది. సిటిజన్ ఫ్రెండ్లీ, డెవలప్‌మెంట్ ఫ్రెండ్లీ బడ్జెట్ ఇది. అన్నివర్గాలకు అధికారం ద్వారా దేశం.. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకొనే కలను నెరవేర్చుకుంటుంది.**

**- ప్రధాని నరేంద్రమోదీ**




### టార్గెట్ 2022

- దేశంలోని ప్రతి కుటుంబానికి విద్యుత్ సౌకర్యం
- ప్రతి ఒక్కరికి పీఎం ఆవాస్ యోజన ద్వారా లబ్ధి
- రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు చర్యలు

**న్యూఢిల్లీ, జూలై 5:**

ఐదేండ్లలో ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా దేశాన్ని తీర్చిదిద్దటం.. అందుకు కుబేరులపై పన్నుల విధింపు, పెద్దఎత్తున పెట్టుబడుల ఉపసంహరణ, బంగారం సహా 75 రకాల వస్తువుల సుంకాల పెంపుదలతోపాటు వివిధమార్గాల్లో భారీగా ఆదాయవనరుల సమీకరణ! రానున్న ఐదేండ్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల కల్పన! ఉత్పత్తిరంగానికి మరింత ఊపునిచ్చేలా మెగా మాన్యుఫాక్చరింగ్ సైట్ల అభివృద్ధి! కార్పొరేట్ ట్యాక్స్ తగ్గించి, పరిధి పెంపు! దేశ ఆర్థికవ్యవస్థకు అత్యంత కీలకమైన వ్యవసాయరంగ ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేయడం.. ఆ క్రమంలో ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు పల్లెలు, పేదలు, రైతులు లక్ష్యంగా పెట్టుకోవటం! మొత్తంగా నవభారత్ నిర్మాణం! ఇదీ దేశ మొట్టమొదటి పూర్తిస్థాయి మహిళా ఆర్థికమంత్రిగా నిర్మలాసీతారామన్ శుక్రవారం పార్లమెంటుకు సమర్పించిన 2019-20 వార్షికపద్దు! భారీ లక్ష్యాలతో ప్రతిపాదించిన బడ్జెట్‌లో సాధారణ ప్రజలకు తక్షణం ఊరటనిచ్చే అంశాలు

మిగతా 5వ పేజీలో

### మిషన్ భగీరథ స్ఫూర్తిగా..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబీమా పథకాన్ని అనుసరిస్తూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకం తెచ్చిన కేంద్ర ప్రభుత్వం.. తాజా బడ్జెట్‌లో తెలంగాణ అమలుచేస్తున్న మరో ప్రతిష్ఠాత్మక కార్యక్రమం మిషన్ భగీరథను కూడా స్ఫూర్తిగా తీసుకున్నది. జల్ జీవన్ మిషన్ ద్వారా 2024 నాటికి గ్రామీణ భారతంలో ప్రతి ఇంటికీ నల్లా నీరు అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అందుకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖకు రూ.28వేల కోట్లు కేటాయించారు.

### మధ్యతరగతి గృహరుణాలకు కొంత ఊరట



- వడ్డీరాయితీ రూ.2లక్షల నుంచి రూ. 3.50లక్షలకు పెంపు
- రూ.45లక్షలలోపు విలువైన గృహాల రుణాలపై రూ.3.50లక్షలు వడ్డీరాయితీ



### విద్యుత్ వాహనాలపై జీఎస్టీ 12% నుంచి 5శాతానికి తగ్గింపు

### స్టార్టప్‌లకు ఊతం



4

# అన్నారం బరాజ్‌కు గోదావరి



గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం బరాజ్‌లోకి చేరుతున్న గోదావరి నీరు

### కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి 13.2 కిలోమీటర్లు ప్రవహించిన జలాలు

### కాళేశ్వరం పుష్కరఘాట్ నుంచి మేడిగడ్డ బరాజ్‌కు 9,600 క్యూసెక్కుల నీరు

**కాళేశ్వరం(జయశంకర్ భూపాలపల్లి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపుహౌస్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా గోదావరి జలాలు శుక్రవారం ఉదయం అన్నారం బరాజ్‌కు చేరాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధానమైన కన్నెపల్లి పంపుహౌస్ నుంచి గోదావరి నీరు రివర్సింగ్ మొదలయింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గత నెల 21న కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించారు. పంప్‌హౌస్‌లోని 6వ మోటర్ వెట్‌రన్ నిర్వహించగా.. ఇంజినీర్లు మరో రెండు, మూడుసార్లు వెట్‌రన్ చేశారు. గురువారం సాయంత్రం తాజాగా ఇంజినీరింగ్ అధికారులు ఒకటో మోటర్‌ను ఆన్‌చేసి 40 నిమిషాలపాటు నడిపారు. దీంతో జలాలు గ్రావిటీ కెనాల్ వెంట 13.2 కిలోమీటర్లు ప్రవహించి కెనాల్ ఎండ్ అండర్ టన్నెల్ వద్ద నుంచి అన్నారం బరాజ్‌లో కలిశాయి. రెండ్రోజుల్లో మరో మోటర్‌ను కూడా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద శుక్రవారం సాయంత్రం వరకు 9,600 క్యూసెక్కుల గోదావరి జలాలు కన్నెపల్లి నుంచి మేడిగడ్డ బరాజ్‌కు వెళుతున్నాయి.

# తెలంగాణకు అన్యాయం

### కొత్త రాష్ట్రంపై వీడని కేంద్రం వివక్ష.. సంక్షేమ పథకాలకు నిధులు ఇవ్వకుండా మొండిచేయి

### సంపద పెంచుకున్న తెలంగాణకు ఆర్థిక 'శిక్ష'.. కాళేశ్వరానికి జాతీయహోదా ఊసెత్తని బడ్జెట్

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం తన వివక్షను, నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. నిధుల కేటాయింపులో ఎప్పటికప్పుడు మొండిచేయి చూపుతూనే ఉన్నది. తాజాగా 2019-20 కేంద్ర బడ్జెట్‌లోను రాష్ట్రానికి అన్యాయం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ వినతులు బుట్టదాఖలయ్యాయి. సొంత రాబడులను పెంచుకుని సంపదను సృష్టించుకుంటున్న తెలంగాణకు కేంద్రప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనూ పైసా కూడా విదిలించలేదు. హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ, గిరిజన విశ్వవిద్యాలయానికి కొసరు నిధులు మాత్రమే ఇచ్చి చేతులు దులిపేసుకున్నది. కేంద్రానికి పన్నులరూపంలో ఎక్కువ ఆదాయం ఇస్తూ.. తక్కువ నిధులను తీసుకుంటున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటివరుసలో ఉన్నది. రాష్ట్రం నుంచి భారీమొత్తంలో పన్నుల వాటా వెళుతున్నా కేంద్రం నుంచి మాత్రం ఎలాంటి సాయం అందడం లేదు. ఈసారి కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రానికి రూ.19,719 కోట్లు మాత్రమే రానున్నాయి. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రూ.10వేల కోట్ల నుంచి రూ.11వేల కోట్ల నిధులు రాష్ట్ర ఖజానాకు సమకూరుతాయని అంచనా వేశారు. వాస్తవానికి ఫిబ్రవరిలో కేంద్రం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో అంచనాల కంటే రూ.864 కోట్లు తగ్గాయి. మధ్యంతర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్ర పన్నుల వాటాలో రూ.20,581 కోట్లు సమకూరుతాయని అంచనా వేశారు. కానీ ప్రస్తుతం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో అది కొంత తగ్గిందని రాష్ట్రప్రభుత్వ ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి తెలిపారు. 2018-19 బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్ర పన్నులలో వాటాగా రూ.18,561 కోట్లు వచ్చాయని, ఈసారి రూ.1,158 కోట్లు ఎక్కువగా నిధులు రానున్నాయని చెప్పారు. అయితే, ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పేర్కొన్న దానికంటే రూ.864 కోట్లు తగ్గడం గమనార్హమన్నారు. దేశవ్యాప్తంగా జీఎస్టీ రాబడి తగ్గినందున నిధుల వాటాను సవరించి ఉండవచ్చని జీఆర్ రెడ్డి పేర్కొన్నారు. ఇక కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి రూ.9 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్ల వరకు రాబడి రావచ్చని అధికారులు అంచనావేశారు. కేంద్రప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌లో మొత్తం

మిగతా 5వ పేజీలో



శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని దిందా వాగు దాటుతున్న గ్రామస్థులు

## పలు జిల్లాల్లో ఓ మోస్తరు వాన

నల్లగొండలో గాలివాన బీభత్సం

ఖమ్మం, వికారాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వర్షం

సూర్యాపేట జిల్లాలో చిరుజల్లులు

వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

చురుకుగా కదలనున్న రుతుపవనాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

9

ధర్మగంట నమస్తే ఎఫెక్ట్ DHARMA GANTA

### పాల్దా వీఆర్వోపై విచారణకు ఆదేశం

- 'పైసలిస్తేనే పనైతది!' కథనానికి స్పందించిన నిజామాబాద్ జేసీ

### అందిన పాస్‌బుక్ ఆన్‌లైన్ పత్రం

- 'కొత్త పాస్‌పుస్తకం కోసం 43 సార్లు దరఖాస్తు!' కథనానికి స్పందన
- ముద్రించిన బుక్ త్వరలో ఇస్తామన్న నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల తాసిల్దార్
- ధర్మగంటకు కృతజ్ఞతలు తెలిపిన నిజామాబాద్ జిల్లా తాళ్లరాంపూర్ రైతు

2




### ముమ్మరంగా సభ్యత్వాలు

టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదుకు కదులుతున్న ఊరూవాడా

ఉత్సాహంగా పాల్గొంటున్న గులాబీ శ్రేణులు

9

### కొలువుదీరిన కొత్త జెడ్పీలు

చైర్‌పర్సన్లతోపాటు సభ్యుల ప్రమాణం

పండుగ వాతావరణంలో బాధ్యతల స్వీకరణ

పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు






## 12.50 % సుంకం

- బంగారంపై కస్టమ్స్ సుంకం 10శాతం నుంచి 12.50 శాతానికి పెంపు
- పెట్రోల్, డీజిల్‌పై ఒక రూపాయి అదనపు సుంకం
- డిజిటల్ చెల్లింపులపై ఖాతాదారులు, వ్యాపారుల వద్ద చార్జీలు రద్దు

## 3.50 లక్షలు రాయితీ

- మధ్యతరగతి గృహ రుణాలపై కొంత ఊరట
- వడ్డీరాయితీ రూ.2లక్షల నుంచి రూ. 3.50లక్షలకు పెంపు
- రూ.45లక్షలలోపు విలువైన గృహాల రుణాలపై రూ.3.50లక్షలు వడ్డీరాయితీ

- భారత్ పాస్‌పోర్టు ఉన్న ఎన్నారైలకు ఆధార్‌కార్డు
- స్వదేశానికి వచ్చాక 180 రోజుల వ్యవధి నిబంధన తొలగింపు





శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందు బడ్జెట్ ప్రతులతో రాష్ట్రపతిభవన్‌కు వెళ్లి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్



# స్టార్టప్‌లకు ఊరట

### ఏంజెల్ ట్యాక్స్ కష్టాలను తొలిగించేందుకు చర్యలు

### ఆదాయపన్ను విభాగం తనిఖీల నుంచి మినహాయింపు

**న్యూఢిల్లీ, జూలై 5:** వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం స్టార్టప్‌లకు ఊరట కల్పించింది. ఏంజెల్ ట్యాక్స్ విషయంలో స్టార్టప్‌లకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలిగించేందుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పలు చర్యలను ప్రతిపాదించారు. ఆదాయ పన్ను తనిఖీల నుంచి స్టార్టప్‌లకు మినహాయింపు ఇస్తున్నట్టు ఆమె ప్రకటించారు. దేశంలో స్టార్టప్‌లు బలంగా వేళ్లూనుకుంటున్నాయని, వాటి అభివృద్ధిని ప్రోత్సహించాల్సిన అవసరమున్నదని తన తొలి బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. పెట్టుబడిదారులను, వారి పెట్టుబడుల మూలాలను గుర్తించడంలో ఎదురవుతున్న సమస్యను పరిష్కరించేందుకు ఈ-వెరిఫికేషన్ వ్యవస్థను ప్రవేశపెడతామని, దీంతో స్టార్టప్‌లు సమీకరించే నిధులపై ఆదాయపన్ను విభాగం ఎలాంటి తనిఖీలు జరుపాల్సిన అవసరం ఉండదని తెలిపారు. స్టార్టప్‌ల పెండింగ్ అసెస్‌మెంట్లతోపాటు వాటి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) పాలనాపరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందన్నారు. 'పర్యవేక్షణాధికారి నుంచి అనుమతి పొందకుండా




మదింపు అధికారి ఎటువంటి విచారణ లేదా తనిఖీలు నిర్వహించేందుకు వీలుండదని నేను స్పష్టంచేస్తున్నా. దీంతో విచక్షణాధికారాల రూపంలో స్టార్టప్‌లకు ఎదురవుతున్న ఇబ్బంది తొలిగిపోతుంది' అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. స్టార్టప్‌లలో పెట్టుబడులుపెట్టే క్యాటగిరీ-2 ఏఐఎఫ్‌లకు (ఆల్టర్నేట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌కు) ఏంజెల్ ట్యాక్స్ నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వనున్నట్టు ఆమె ప్రకటించారు.

**స్టార్టప్‌ల కోసం ప్రత్యేక టీవీ చానల్**

స్టార్టప్‌ల కోసం ప్రత్యేక టెలివిజన్ చానల్‌ను ఏర్పాటు చేయాలని నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. స్టార్టప్‌ల అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్న సమస్యలపై చర్చించేందుకు ఈ చానల్ ఓ వేదికగా ఉపయోగపడుతుందన్నారు.

# పెట్రో ధరలకు రెక్కలు

- బడ్జెట్‌లో సెస్సు భారం
- లీటర్ పెట్రోల్ రూ.2.50, డీజిల్ రూ.2.30 ప్రియం
- అర్ధరాత్రి నుంచి అమల్లోకి

**న్యూఢిల్లీ, జూలై 5:** బడ్జెట్ సెగ తగిలి పెట్రో ధరలు భగ్గుమన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లీటర్ పెట్రోల్, డీజిల్‌లపై రూ.2 చొప్పున సుంకం, సెస్సు ప్రతిపాదించారు. రూపాయి ఎక్సైజ్ సుంకంతోపాటు మరో రూపాయి రోడ్డు, మౌలిక రంగాల సెస్సును పెంచుతున్నట్లు ప్రకటించారు. దీంతో చమురు మార్కెటింగ్ సంస్థలు పెట్రో ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. లీటర్ పెట్రోల్ ధర రూ.2.50పైగా, డీజిల్ ధర రూ.2.30పైగా పెరుగగా, ఈ ధరలు అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చాయి. కాగా, తాజా నిర్ణయం నేపథ్యంలో ఖజానాకు రూ.28,000 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతున్నది. ఇక టన్ను ముడి చమురుపై కస్టమ్స్ లేదా దిగుమతి




సుంకాన్ని రూ.1 విధిస్తున్నట్లు మంత్రి చెప్పారు. దేశంలోకి 220 మిలియన్ టన్నులకుపైగా ముడి చమురు దిగుమతి అవుతున్నది. దీంతో కేంద్రానికి అదనంగా మరో రూ.22 కోట్ల ఆదాయం దక్కుతున్నది. ప్రస్తుతం ముడి చమురుపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి లెవీనిగానీ, కస్టమ్స్ సుంకాన్నిగానీ వేయడం లేదు. టన్నుకు రూ.50 చొప్పున జాతీయ విపత్తు అగంతుక సుంకాన్ని (ఎన్‌సీసీడీ) మాత్రమే వేస్తున్నది. శుక్రవారం హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.74.88గా, డీజిల్ ధర రూ.70.06గా ఉన్నది.

**బంకుల్లో నో స్టాక్ బోర్డులు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీతారామన్ ఇలా బడ్జెట్‌లో ప్రకటించారో.. లేదో.. అలా పెట్రోల్, డీజిల్ రెండింటిపై ధరల భారం పడింది. మరోవైపు వాహనదారులు సైతం బంకుల ముందు బారులు తీరారు. దీంతో రద్దీని తట్టుకోలేక బంకుల యాజమాన్యాలు నో స్టాక్ బోర్డులను పెట్టేశాయి. అయితే అర్ధరాత్రి తర్వాత విక్రయాలు జరిపేందుకే ఇలా చేశారన్న విమర్శలు కస్టమర్ల నుంచి వ్యక్తమయ్యాయి.

**ముహూర్తం**

సూర్యోదయం: 5.51 గంటలకు

సూర్యాస్తమయం: 6.51 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, చతుర్థి మధ్యాహ్నం 1.11 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: మఖ రాత్రి 10.11 వరకు, తదుపరి పుబ్బ, అమృతఘడియలు: రాత్రి 8.00 నుంచి 9.36 వరకు, రాహుకాలం: ఉదయం 9.06 నుంచి 10.43 వరకు, దుర్ముహూర్తం: తె.జా. 5.51 నుంచి ఉదయం 7.35 వరకు, వర్జ్యం: ఉదయం 11.15 నుంచి మధ్యాహ్నం 12.51 వరకు.

**లోకం పోకడ**



సిగరెట్ ధరలు పెంచారు సరే.. బంగారం ధరలు కూడా పెంచితే ఎలా? సాటి మహిళగా మా బాధలు అర్థం చేసుకున్నది ఇదేనా?

# మౌలికం.. ఎంతో కీలకం


### ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో ఏడాదికి 20 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం

### ఆర్థికవ్యవస్థకు కనెక్టివిటీనే ప్రాణాధారం

**రూ.80,250 కోట్లతో 1.25 లక్షల కి.మీ గ్రామీణ రోడ్ల అభివృద్ధి**

**నేషనల్ హైవేస్ గ్రిడ్ ఏర్పాటు**

**న్యూఢిల్లీ, జూలై 5:** దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనలో భాగంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిజిటల్ ఎకానమీ, ఉద్యోగాల కల్పనను పెంపొందించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు కీలక చర్యలను ప్రకటించారు. మౌలిక రంగంలో ఏడాదికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని చెప్పారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్సింగ్‌కు ఆర్థిక వనరులు పెంపొందించేందుకుగానూ క్రెడిట్ గ్యారెంటీ ఎన్‌హ్యాన్స్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఆర్థికవ్యవస్థకు 'కనెక్టివిటీ' ప్రాణాధారమని అభివర్ణించారు. ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద రూ.80,250 కోట్లతో 1,25,000 కి.మీ మేర గ్రామీణ రోడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే నేషనల్ హైవేస్ గ్రిడ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్.. రోడ్డు, జల, మెట్రో, రైలు మార్గాల్లో మౌలిక వసతులు పెంపొందించేందుకు చేపట్టబోయే చర్యల గురించి వివరించారు. 'ఇన్‌ఫ్రా, డిజిటల్ ఎకానమీలో భారీగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉన్నది. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ద్వారా ఉద్యోగాలను సృష్టించాలి' అని ఆమె పేర్కొన్నారు. పీఎంజీఎస్‌వై, ఇండస్ట్రియల్ కారిడార్స్, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్స్, భారత్‌మాల, సాగరమాల, జల్ మార్గ్ వికాస్, ఉడాన్ వంటి పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల రవాణా మార్గాలను మెరుగుపరుస్తున్నదని చెప్పారు. రవాణా వ్యయాన్ని తగ్గించి, దేశీయంగా వస్తు రవాణాకు సంబంధించి పోటీతత్వం పెంచేందుకు ఈ పథకాలు దోహదపడతాయన్నారు.





## నేషనల్ హైవేస్ ప్రోగ్రామ్ పునర్వ్యవస్థీకరణ

నేషనల్ హైవేస్ ప్రోగ్రామ్‌ను పునర్వ్యవస్థీకరించి నేషనల్ హైవేస్ గ్రిడ్‌ను ఏర్పాటు చేస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. గ్రామాలను, గ్రామీణ మార్కెట్లను అనుసంధానించే రోడ్లను అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం పీఎంజీఎస్‌వై-3 కింద వచ్చే ఐదేండ్లలో రూ.80,250 కోట్లతో 1.25 లక్షల గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. గంగా నదిపై సరకు రవాణాను వచ్చే నాలుగేండ్లలో నాలుగురెట్లు పెంచనున్నట్లు వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫేమ్ 11 పథకం కోసం ఇప్పటికే రూ.10 వేల కోట్లను కేటాయించినట్లు చెప్పారు. దేశీయంగా అభివృద్ధి చేసిన పేమెంట్ ఎకోసిస్టమ్ ద్వారా దేశవ్యాప్తంగా మెట్రో, టోల్ ట్యాక్స్ సహా వివిధ రకాల రవాణా చార్జీలను చెల్లించేందుకు వీలవుతుందని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 2019-20 ఆర్థిక సంవత్సరానికి గానూ వడ్డీ రాయితీ కోసం రూ.350 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. నేషనల్ గ్యాస్ గ్రిడ్, వాటర్ గ్రిడ్, ప్రాంతీయ ఎయిర్‌పోర్టులకు సంబంధించి బ్లూప్రింట్ ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

## అభివృద్ధిలో దూసుకుపోయేలా బడ్జెట్: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, జూలై 5:** 'కేంద్ర బడ్జెట్ భవిష్యత్ ఆధారిత బడ్జెట్. ఇది పేదలకు అధికారాన్ని ఇచ్చి, యువతకు ఉత్తమ భవిష్యత్ అందించేలా ఉన్నది. సిటిజన్ ఫ్రెండ్లీ, డెవలప్‌మెంట్ ఫ్రెండ్లీ బడ్జెట్ ఇది. బడ్జెట్.. ఆశలను విస్తరించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా ఉన్నది. వెనుకబడిన వారికి అధికారం అందించేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. ఇది 'గ్రీన్ బడ్జెట్'. పర్యావరణం, పచ్చిక మైదానాలు, స్వచ్ఛశక్తి, రవాణా అవసరాలపై ప్రత్యేక దృష్టిసారించింది. వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మకమైన సంస్కరణలను చేపట్టాం. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ఇది మార్గనిర్దేశం చేయనున్నది. ఈ బడ్జెట్ నవభారత నిర్మాణానికి డాక్యుమెంట్‌లాంటిది. దేశంలోని పేదలను బలోపేతం చేసేలా, యువతకు ఉత్తమ భవిష్యత్ అందించేలా బడ్జెట్ రూపొందించాం. ఇది దేశాభివృద్ధిని వేగవంతం చేస్తుంది. మధ్యతరగతి వారికి మరిన్ని ప్రయోజనాలు చేకూరుస్తుంది. బడ్జెట్ పన్ను ప్రక్రియను సరళీకృతం చేసి, దేశంలో మౌలిక సదుపాయాలను ఆధునీకరించేందుకు సాయపడుతుంది. పరిశ్రమలతోపాటు పారిశ్రామికవేత్తల బలోపేతానికి ఈ బడ్జెట్ దోహదం చేస్తుంది. దేశ ప్రగతిలో మహిళల పాత్రను మరింత పెంచేలా బడ్జెట్ ఉన్నది. భారత్ 21వ శతాబ్దంలో అభివృద్ధిలో దూసుకుపోయేలా బడ్జెట్‌ను రూపొందించాం. సమాజంలోని నిరుపేదలు, రైతులు, దళితులు, అణగారినవర్గాలు.. ఇలా అన్నివర్గాలు అభివృద్ధి చెందేలా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. అన్నివర్గాలకు అధికారం ద్వారా దేశం.. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకొనే కలను నెరవేర్చుకుంటుంది.

# ఇతోధికంగా వ్యవ 'సాయం'!

రూ.1.39 లక్షల కోట్లు కేటాయించిన కేంద్రం



**న్యూఢిల్లీ, జూలై 5:** దేశాభివృద్ధిలో ఎంతో కీలకమైన వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం నిధులను భారీగా కేటాయించింది. 2019-20 ఆర్థిక బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.1.39 లక్షల కోట్లు ప్రతిపాదించింది. గత బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.77,752 కోట్లు కేటాయించగా.. ఈ సారి ఏకంగా దాదాపు రెట్టింపు స్థాయిలో 78 శాతం అదనంగా నిధులను కేటాయించింది. రూ.1.39 లక్షల కోట్ల బడ్జెట్‌లో దాదాపు సగం అంటే రూ.75,000 కోట్లను ప్రతిష్ఠాత్మక ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (మన రాష్ట్రంలోని రైతుబంధు పథకం లాంటిది) పథకానికి కేటాయించింది. ఈ పథకం కింద ఏడాదికి దేశంలోని దాదాపు 12.6 కోట్ల చిన్న, సన్నకారు రైతులకు రూ.2,000 చొప్పున మూడు విడుతలుగా మొత్తం రూ.6,000 కేంద్ర ప్రభుత్వం అందజేయనున్నది. అలాగే గత బడ్జెట్‌లో ప్రతిష్ఠాత్మక ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి రూ.12,975.70 కోట్లు కేటాయించగా.. ఈ సారి మాత్రం రూ.14,000 కోట్లను ప్రతిపాదించింది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా దాదాపు 5.61 కోట్ల మంది రైతులు లబ్ధిపొందనున్నారు. ఇక స్వల్పకాలిక పంట రుణంపై వడ్డీ ఉపసంహరణ పథకానికి రూ.18,000 కోట్లను కేటాయించింది. మద్దతు ధర లభించక ధరలు పడిపోయినప్పుడు రైతులను ఆదుకోవడానికి ఉద్దేశించిన మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీం, మద్దతు ధర పథకానికి (ఎంఐఎస్-పీఎస్ఎస్) రూ.3,000 కోట్లను ప్రతిపాదించింది. ప్రధానమంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ్ యోజన పథకానికి రూ.1500 కోట్లు కేటాయించింది. అలాగే ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన పథకానికి రూ.3,500 కోట్లను కేంద్రం కేటాయించింది.

# ఆరోగ్యానికి ప్రాధాన్యం

### జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌కు రూ.1349 కోట్లు

### 2022 నాటికి 1.5 లక్షల ఉపకేంద్రాల, పీహెచ్‌సీల రూపాంతరం

### జిల్లా దవాఖానలు, రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాల ఆధునీకరణకు రూ.800 కోట్లు

### రాష్ట్రాల్లో పారామెడికల్ సైన్స్ శిక్షణ సంస్థలు ఏర్పాటుచేయాలని నిర్ణయం

**ఆయుష్మాన్‌భారత్‌కు రూ.6400 కోట్లు కేటాయింపు**

**జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్‌కు రూ.249 కోట్లు**

**ఎయిమ్స్‌లకు గతం కంటే పెరిగిన కేటాయింపులు**

**న్యూఢిల్లీ:** గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో కంటే ఈసారి ఆరోగ్యరంగానికి కేంద్ర ప్రభుత్వం ఎక్కువ కేటాయింపులు జరిపింది. ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 62,398 కోట్లు ఆరోగ్యరంగానికి, ఆయుష్మాన్‌భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ- పీఎంజేఏవై)కు రూ.6,400 కోట్ల కేటాయింపులు జరిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆరోగ్య వ్యయం గతేడాదితో పోలిస్తే సుమారు 19 శాతం అధికం. గత ఏడాది ఆరోగ్యరంగానికి రూ. 52,800 కోట్లు కేటాయించారు. ఆయుష్మాన్‌భారత్-ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద దేశవ్యాప్తంగా 10.74 కోట్లకు పైగా బలహీనవర్గాల కుటుంబాలకు (దాదాపు 50 కోట్ల మంది లబ్ధిదారులు) ద్వితీయ, తృతీయ సంరక్షణ దవాఖానల్లో చికిత్స పొందేందుకు ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఆరోగ్య సంరక్షణను అందించాలని కేంద్రం నిర్ణయించింది. ఆయుష్మాన్‌భారత్ ఆరోగ్య, సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకుగాను జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ కింద రూ. 249.96 కోట్లు, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కింద రూ. 1,349.97 కోట్లు కేటాయించారు. ఈ కార్యక్రమం కింద 2022 నాటికి దాదాపు 1.5 లక్షల ఉపకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు.. ఆరోగ్య సంరక్షణ కేంద్రాలుగా రూపాంతరం చెందుతాయి. గత సంవత్సరం బడ్జెట్‌లో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)కు రూ.30,129.61 కోట్లు కేటాయించగా, ఆ మొత్తాన్ని ప్రస్తుత బడ్జెట్‌లో రూ.32,995 కోట్లకు పెంచారు. ఎన్‌హెచ్‌ఎం కింద ఉన్న రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్‌ఎస్‌బీవై) కి గత బడ్జెట్లో రూ.1,844 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.156 కోట్లకు తగ్గించింది. జాతీయ ఎయిడ్స్, ఎస్టీడీ నియంత్రణ కార్యక్రమానికి గతం కంటే రూ.400 కోట్లు పెంచి ఆ మొత్తాన్ని రూ.2,500 కోట్లకు తీసుకొచ్చారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ కోసం గతంలో కంటే ఎక్కువ కేటాయింపులు జరిపారు. గత బడ్జెట్‌లో రూ.3,018 కోట్లు ఉండగా.. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.3,599.65 కోట్లు ఇచ్చారు. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమానికి నిధులు గతం కన్నా రూ.10 కోట్లు తగ్గి రూ.40 కోట్లకు చేరుకొంది. క్యాన్సర్ డయాబెటిక్, కార్డియో వాస్క్యులార్ డిసీజ్, స్ట్రోక్ నివారణ, నియంత్రణ కోసం జరిగిన కేటాయింపుల్లో తగ్గుదల కనిపించింది. గత ఏడాది రూ. 295 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ. 175 కోట్లుగా ఉన్నది. తృతీయ సంరక్షణ కార్యక్రమాల కోసం మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో రూ.200 కోట్లు తగ్గాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.750 కోట్లు ఉండగా.. ప్రస్తుతం అవి రూ. 550 కోట్లకు పడిపోయాయి. నర్సింగ్ సేవలను విస్తృతపరిచి బలోపేతం చేసేందుకు రూ.64 కోట్లు, ఫార్మసీ పాఠశాలలు, కాలేజీలను నవీకరించేందుకు రూ.5 కోట్లు, జిల్లా దవాఖానలు, రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలను ఆధునీకరించేందుకు రూ.800 కోట్లు కేటాయించారు. జిల్లా దవాఖానలను కొత్త వైద్య కళాశాలలుగా మార్చడానికి రూ.2 వేల కోట్లు, ప్రభుత్వ వైద్య కళాశాలలు (అండర్ గ్రాడ్యుయేషన్), కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సంస్థలను బలోపేతం చేసేందుకు రూ.1,361 కోట్లు, రాష్ట్రాల్లో పారామెడికల్ సైన్సెస్ స్టేట్ ఇన్‌స్టిట్యూషన్స్, పారామెడికల్ కళాశాల ఏర్పాటుకు రూ.20 కోట్లు కేటాయించారు.

| అంశం | గత కేటాయింపులు (కోట్లలో..) | ప్రస్తుత కేటాయింపులు (కోట్లలో..) |
|---|---|---|
| మొత్తం ఆరోగ్యరంగం | 52,800 | 62,398 |
| జాతీయ ఆరోగ్య మిషన్ | 32,995 | 30,129 |
| రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన | 1,844 | 156 |
| ఎయిడ్స్, ఎస్టీడీ కంట్రోల్ | 2,100 | 2,500 |
| ఎయిమ్స్ | 3,018 | 3,599 |
| జాతీయ మానసిక ఆరోగ్యం | 50 | 40 |
| తృతీయ సంరక్షణ కార్యక్రమాలు | 750 | 550 |





# గ్రామీణ పథకాలకు దన్ను

### రూ.1.17 లక్షల కోట్లు కేటాయించిన కేంద్రం

### గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆవాస్ యోజనకు నిధులు తగ్గింపు

**న్యూఢిల్లీ:** పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు. దేశాభివృద్ధిలో గ్రామాల పాత్ర అత్యంత కీలకం. అందుకే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో గ్రామీణ పథకాలకు రూ.1.17లక్షల కోట్ల నిధులను కేటాయించింది. గతంతో (రూ.1.12 లక్షల కోట్లు) పోల్చితే ఈసారి కేటాయింపులు 4.4 శాతం పెరిగాయి. ప్రధానంగా జాతీయ జీవనోపాధి మిషన్, పీఎం గ్రామసడక్ యోజన, శ్యామ ప్రసాద్ ముఖర్జీ అర్బన్ మిషన్‌లాంటి పథకాలకు నిధులను పెంచింది. జాతీయ జీవనోపాధి మిషన్‌కు గత బడ్జెట్‌లో రూ.5,783 కోట్లు ఇవ్వగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.9,024 కోట్లను కేటాయించింది. ఈ సారి బడ్జెట్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాలకు కేంద్రం నిధులు తగ్గించింది. గతంలో ఉపాధి హామీకి రూ.61,084 కోట్లు ఇవ్వగా ఇప్పుడు రూ.60వేల కోట్లకేటాయించింది.






## ఆధార్‌తో ఐటీ రిటర్నులు

- పాన్‌కార్డు లేకున్నా ఆధార్ కార్డుతో ఐటీ రిటర్నుల దాఖలుకు అవకాశం. వార్షిక ఆదాయం రూ.5కోట్లు దాటినవారికి సర్చార్జీ పెంపు.
- రూ.5లక్షల వరకు ఆదాయానికి పన్ను పూర్తిగా మినహాయింపు. వ్యక్తిగత ఆదాయం పన్ను పరిమితి యథాతథం.

## ఓడీఎఫ్ భారత్

- స్వచ్ఛభారత్ అభియాన్ ద్వారా 9.6కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం. అక్టోబర్ 2నాటికి ఓడీఎఫ్ భారత్‌గా తీర్చిదిద్దాలని ప్రధాని సంకల్పం.
- మహాత్మగాంధీ 150వ జయంతి సందర్భంగా దేశం ఇచ్చే కానుక.

- విద్యుత్ వాహనాలపై జీఎస్టీ 12శాతం నుంచి 5శాతానికి తగ్గింపు
- వచ్చే ఐదేండ్లలో మౌలిక సదుపాయాల రంగానికి రూ.100లక్షల కోట్లు






పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని పాట్నాలో టీవీలో చూస్తున్న పౌరులు





కేంద్ర బడ్జెట్‌పై ఢిల్లీలో శుక్రవారం తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్న టీఆర్ఎస్ ఎంపీలు

# ప్రజల ఆకాంక్షలకు విరుద్ధం

### టీఆర్ఎస్ ఎంపీల నిరసన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ఉన్నదని, తెలంగాణకు నిరాశ మిగిల్చిందని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పెట్రోలు, డీజిల్, బంగారం, మార్బుల్ ధరలు పెంచడం ద్వారా సామాన్యులపై భారం పడుతుందన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం స్ఫూర్తితో.. కేంద్ర ప్రభుత్వం హర్ ఘర్ జల్ పథకం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలుచేస్తున్న మిషన్ భగీరథ పథకానికి కేంద్రం నిధులు కేటాయిస్తే.. రాష్ట్రానికి ప్రోత్సాహకరంగా ఉండేదని చెప్పారు. ఎయిమ్స్‌కు నిధుల కేటాయింపు, విభజనచట్టంలోని అంశాలను బడ్జెట్‌లో ప్రస్తావించలేదని.. ఒక్క పైసా కూడా అదనంగా ఇవ్వలేదని విమర్శించారు.

**కేసీఆర్ పథకాలనే అమలుచేస్తున్నారు: జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్**

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇతర రాష్ట్రాలతోపాటు కేంద్రం కూడా అమలుచేస్తున్నదని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. రైతులకు కేంద్రం ఇస్తున్నదానికంటే.. రాష్ట్రం అందిస్తున్న పెట్టుబడి సాయం చాలా ఎక్కువని చెప్పారు. కేంద్రం రెండు హెక్టార్లకు ఏడాదికి రూ.6 వేలు ఇస్తుండగా, తెలంగాణ ప్రభుత్వం ఎకరానికి ఏడాదికి రూ.10 వేలు ఇస్తున్నదన్నారు. రైతులను ఆకర్షించడానికి ఎన్నికలకుముందు కేంద్రం పీఎం- కిసాన్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

**మొండిచేయి: మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి**

బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపించిందని మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. విభజనచట్టంలోని అంశాలతోపాటు తెలంగాణకు సంబంధించిన మెట్రో, రైల్వే ప్రాజెక్టుల గురించి ప్రస్తావన లేదన్నారు. ఏ ఒక్క రాష్ట్రానికీ ప్రజలకు బడ్జెట్ ఉపయోగకరంగా లేదని దుయ్యబట్టారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించే పథకాన్ని ప్రకటించడం సంతోషకరమని, మిషన్ భగీరథ పథకాన్నే కేంద్రం పేరు మార్చి అమలు చేస్తుందన్నారు.

**నిధులపై రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలి: చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి**

కేంద్రం ఆయా శాఖలవారీగా రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయిస్తే.. రాష్ట్రాలు తమ అవసరాలకు అనుగుణంగా వాటిని ఖర్చు చేస్తాయని.. రాష్ట్రాలకు ఆ విధంగా స్వేచ్ఛ ఇవ్వాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కోరారు. దేశ ఆర్థికవ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు ఏవిధంగా చేరుతుందో ఆర్థికమంత్రి వివరించలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని.. సామాన్యుడిపై పన్నులు విధించారని ఆందోళన వ్యక్తంచేశారు.

**జీడీపీలో వ్యవసాయం వాటా తగ్గింది: మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి**

జీడీపీలో వ్యవసాయం వాటా గతంలో 40 నుంచి 50% వరకు ఉండేదని, ప్రస్తుతం అది 15 నుంచి 20 శాతానికి పడిపోవడం ఆందోళనకరమని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

## మిషన్ భగీరథ స్ఫూర్తితో..

# 'జల్ జీవన్ మిషన్'

### దేశవ్యాప్తంగా అమలుకు కేంద్రం సిద్ధం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ న్యూఢిల్లీ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'మిషన్ భగీరథ' పథకం స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం 'జల్ జీవన్ మిషన్'కు శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ ద్వారా 2024 నాటికి గ్రామీణ భారతంలో ప్రతి ఇంటికీ నల్లా నీరు అందిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమిళనాడులో పరిస్థితి మరింత దయనీయంగా ఉన్నది. ఇలాంటి పరిస్థితి తెలంగాణకు రాకూడదన్న ముందుచూపుతోనే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మిషన్ భగీరథకు రూపకల్పన చేశారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీరు సరఫరా చేసే పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని 22,403 గ్రామాల్లో ఇంటింటికీ నల్లా ద్వారా శుద్ధి చేసిన జలాన్ని అందిస్తున్నారు. ఈ పథకం తరహాలోనే కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను రూపొందించింది. ఈ పథకం అమలును పర్యవేక్షించే జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు 2019-20 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ.28,261.59 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జల వనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవనం, తాగు నీరు, పారిశుద్ధ్య శాఖలన్నింటినీ ఏకం చేసి కేంద్రం కొత్తగా జల్‌శక్తి మంత్రిత్వశాఖను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. తాగునీరు, పారిశుద్ధ్య విభాగానికి 2018-19లో రూ.19,992.97 కోట్లు కేటాయించగా, ఈసారి 20,016.34 కోట్లు కేటాయించారు. నీటి వనరులు, గంగా పునరుజ్జీవన శాఖకు ఈసారి రూ.8,245.25 కోట్లు కేటాయించగా, 2018-19లో రూ.7,269.25 కోట్లు కేటాయించారు. జాతీయ నదీ సంరక్షణ ప్రణాళికకు ఈసారి కేటాయింపులు తగ్గాయి. 2018-19లో 1,620 కోట్లు కేటాయించగా, ఈ సారి 1,220 కోట్లు కేటాయించారు. వచ్చే దశాబ్ద కాలానికి నిర్దేశించుకున్న లక్ష్యాల్లో నీరు, నీటి సంరక్షణ, పరిశుద్ధ నదులు కూడా ఒక అంశమని సీతారామన్ వెల్లడించారు. దేశానికి నీటి భద్రత, ప్రతి ఒక్కరికీ సురక్షిత మంచినీరు అందించడానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. జల్ జీవన్ మిషన్ ద్వారా 2024 నాటికి ప్రతి గ్రామీణ కుటుంబానికి రక్షిత నీరు అందించేందుకు జల్ శక్తి శాఖ అన్ని రాష్ట్రాలతో కలిసి పనిచేస్తుందని పేర్కొన్నారు. వాన నీటి సంరక్షణ, మురుగు నీటి శుద్ధికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. మురుగునీటిని సాగుకు యోగ్యంగా మలిచేందుకు ప్రత్యేక పథకం తీసుకువస్తామని తెలిపారు. 256 జిల్లాల్లో జల్‌శక్తి అభియాన్ అమలుచేయనున్నట్లు పేర్కొన్నారు.

> 2024 నాటికి ఇంటింటికీ నల్లానీరు
>
> జల్ శక్తి శాఖకు రూ.28,261 కోట్లు



### స్వచ్ఛభారత్ పథకాన్ని విస్తృతపరుస్తాం..

స్వచ్ఛభారత్ పథకాన్ని మరింత విస్తరిస్తామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రతిగ్రామంలోనూ ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ చేపడతామన్నారు. దేశంలోని అన్ని పట్టణాలను ఇప్పటికే 95 శాతం బహిరంగ మల విసర్జన రహితంగా మార్చామని, 2014 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 9.6 కోట్ల మరుగుదొడ్లను నిర్మించినట్లు చెప్పారు. ఈ ఏడాది అక్టోబర్ నాటికి స్వచ్ఛభారత్ మిషన్‌ను సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. కొత్తగా 10000 రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. పట్టణీకరణను ప్రభుత్వం ఒక సవాల్‌గా కాకుండా అవకాశంగా చూస్తున్నదని చెప్పారు.

### బాధలు పెంచే బడ్జెట్



కేంద్ర బడ్జెట్‌కు ఎలాంటి లక్ష్యం లేదు. ప్రజల బాధలను మరింతగా పెంచేలా ఉంది. సెస్‌తోపాటు అదనపు ఎక్సైజ్ సుంకం విధించడంతో పెట్రోల్ లీటరుకు రూ.2.50, డీజిల్ లీటరుకు రూ.2.30 పెరుగుతాయి. తద్వారా రవాణా, మార్కెట్ నుంచి వంటగది వరకు అన్ని ధరలకు రెక్కలొస్తాయి. సామాన్య ప్రజలు మరింతగా బాధలు పడాల్సిందే.

–పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జి

### ఐప్యాడ్‌తో బడ్జెట్ ప్రవేశపెడతాం



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ పత్రాలను ఎర్రటి పట్టు వస్త్రంలో పార్లమెంట్‌కు తీసుకువచ్చి ప్రవేశపెట్టారు. భవిష్యత్తులో కాంగ్రెస్ ఆర్థిక మంత్రి ఐప్యాడ్ ద్వారా బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఇది నేను కచ్చితంగా చెప్పగలను. – కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం

## పెరుగు - తరుగు

**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొన్నిరకాల వస్తువుల ధరలు తగ్గనుండగా.. కొన్నింటి ధరలు పెరుగనున్నాయి. తొలిసారి ఇల్లు కట్టుకునే వారికి ప్రోత్సాహకాలు ప్రకటించారు. గృహరుణాలపై వడ్డీ రాయితీలు ఇవ్వడంతోపాటు, ఎలక్ట్రిక్ వాహనాలు, విడిభాగాల ధరలు తగ్గనున్నట్టు ప్రకటించారు. అయితే పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.1 పెంచడంతోపాటు, బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని పెంచుతున్నట్టు తెలిపారు.

### పెరిగేవి ఇవే



- పెట్రోల్, డీజిల్
- బంగారం, వెండి
- న్యూస్‌ప్రింట్లు, మ్యాగజైన్లు
- దిగుమతి చేసుకునే ప్రింటెడ్ పుస్తకాలు
- ఏసీలు
- దిగుమతి చేసుకునే కార్లు
- జీడిపప్పు
- రబ్బరు, టైర్లు,
- సీసీ కెమెరాలు, స్పీకర్లు, డిజిటల్ వీడియో రికార్డర్లు
- మెటల్ ఫర్నిచర్,
- సిగరెట్లు, హుక్కా
- సెరామిక్ టైల్స్, గోడలకు అంటించే టైల్స్
- ఆటోమొబైల్‌లో వినియోగించే వస్తువులు
- పీవీసీ పైపులు
- ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు
- దిగుమతి చేసుకునే ప్లాస్టిక్
- సబ్బుల తయారీలో ఉపయోగించేవి
- స్టెయిన్‌లెస్ స్టీల్, మెటల్ ఫర్నిచర్
- సెల్‌ఫోన్ చార్జర్లు



### తగ్గేవి ఇవే..



- గృహ రుణాలు
- ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రిక్ విడిభాగాలు
- సెట్‌టాప్ బాక్సులు
- రక్షణ రంగానికి సంబంధించిన వస్తువులు
- దిగుమతి చేసుకునే వివిధ రకాల వస్తువులు



# సొంతింటి కలకు ఊతం

**గృహ రుణాలపై వడ్డీ రాయితీ రూ.3.50 లక్షలకు పెంపు**

**ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మంజూరైన లోన్లకే**

**రూ.45 లక్షలు, అంతకంటే తక్కువ విలువైన ఇండ్లకే వర్తింపు**

**న్యూఢిల్లీ, జూలై 5:** ఇండ్ల కొనుగోలుదారులకు మరింత ప్రోత్సాహాన్నిచ్చింది మోదీ సర్కారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (వచ్చే ఏడాది మార్చి 31దాకా)లో తీసుకున్న, తీసుకోబోయే గృహ రుణాలకు చెల్లించే వడ్డీపై రూ.1.50 లక్షల అదనపు పన్ను తగ్గింపును తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ప్రస్తుతం ఇది రూ.2 లక్షలుగానే ఉండగా, ఇక నుంచి రూ.3.50 లక్షలకు పెరుగుతుందన్నమాట. అయితే రూ.45 లక్షలు, అంతకంటే తక్కువ విలువ కలిగిన ఇండ్ల కోసం తీసుకునే గృహ రుణాలకే ఈ వడ్డీ తగ్గింపు వర్తించనున్నది. అలాగే తొలిసారి ఇల్లు కొంటున్నవారికే ఈ సదుపాయం ఉంటుందని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నిర్మాణ రంగంలో సరసమైన ధరల ఇండ్ల అమ్మకాలకు ఊతమివ్వాలన్న లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు. సరసమైన ధరల ఇండ్ల ఖర్చును రూ.45 లక్షలు, అంతకు తక్కువగానే అంచనా వేశామని ఆమె అన్నారు.

**గ్రామాల్లో మరో 1.95 కోట్ల ఇండ్లు నిర్మిస్తాం**

ప్రతీ ఒక్కరికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా 2021-22కల్లా అర్హులైన వారందరికీ 1.95 కోట్ల ఇండ్లను ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (పీఎంఏవై-జీ) పథకం కింద అందించాలని సంకల్పించినట్లు నిర్మలా సీతారామన్ వివరించారు.



### గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాలకు రూ.48,000 కోట్లు

గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు తాజా బడ్జెట్‌లో రూ.48,000 కోట్ల నిధులు దక్కాయి. నిరుడుతో పోల్చితే దాదాపు 12 శాతం నిధులు పెరిగాయి. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్)కు రూ.6,853.26 కోట్లను కేటాయించారు. దేశవ్యాప్తంగా మెట్రో ప్రాజెక్టుల కోసం రూ.17,713.93 కోట్ల నిధులను, అలాగే రూ.19,152 కోట్లను మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎంఆర్టీఎస్) కోసం కేటాయించారు. పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరా, మెరుగైన జీవన ప్రమాణాల కోసం ఈసారి రూ.7,300 కోట్లను ఇచ్చారు. అలాగే స్మార్ట్ నగరాల మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 100 నగరాలకు రూ.6,450 కోట్లను మంజూరు చేశారు.

# రోల్డ్‌గోల్డ్ బడ్జెట్!

మూడోపేజీ తరువాయి...

పెద్దగా కనిపించకపోగా.. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రెండేసి రూపాయల చొప్పున సుంకాల విధింపుతో గంటల వ్యవధిలోనే పెట్రోధరలు భగ్గుమన్నాయి. బంగారంపై ప్రస్తుతం పది శాతంగా ఉన్న కస్టమ్స్ సుంకాన్ని 12.5 శాతానికి పెంచుతున్నట్టు ఆర్థికమంత్రి ప్రకటించారు. దీంతో మధ్యతరగతి ప్రజలకు బంగారం మరింత భారంగా పరిణమించనున్నది. మేక్ ఇన్ ఇండియాను ప్రోత్సహించే క్రమంలో.. విదేశాలనుంచి దిగుమతి చేసుకునే పలు ఎలక్ట్రానిక్, డిజిటల్ పరికరాలపై దిగుమతి సుంకాలను పెంచుతున్నట్టు ఆర్థికమంత్రి ప్రకటించారు. రోల్డ్‌గోల్డ్ బడ్జెట్‌లా కనిపిస్తున్న నిర్మలమ్మ పద్దు.. రానున్న ఐదేండ్లలో పెట్టుకున్న లక్ష్యాలను ఏమేరకు సాధించగలదో.. చక్కెరపూసిన గుళికల్లాంటి ప్రతిపాదనలు ప్రజలకు తీపినే అందిస్తాయో.. లేక చేదుగా మిగులుతాయో ఆచరణలోనే చూడాలని ఆర్థిక నిపుణులు అంటున్నారు. కేంద్ర బడ్జెట్ దలాల్ స్ట్రీట్‌ను ఏమాత్రం సంతృప్తిపర్చలేకపోయింది. ఫలితంగా సూచీ 395 పాయింట్లు నష్టపోవడంతో రూ.2.22 లక్షల కోట్ల మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది.

**రూ.27.86 లక్షల కోట్ల బడ్జెట్**

మోదీ 2.0 ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌ను నిర్మలాసీతారామన్ శుక్రవారం పార్లమెంటుకు సమర్పించారు. మొత్తం రూ.27.86 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.14,35,233 కోట్లను ఆదాయం వసూళ్లుగా, రూ.7,06,740 కోట్లను మూలధన వసూళ్లుగా చూపారు. ఆదాయం లోటు రూ.4,43,600 కోట్లుగా తేల్చారు. యాభై ఐదేండ్ల అభివృద్ధిని తాము ఐదేండ్లలో సాధించామని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా నిర్మలాసీతారామన్ చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థను 1.85 లక్షల కోట్ల డాలర్ల నుంచి 2.7 లక్షల కోట్ల డాలర్లకు తీసుకొచ్చామని తెలిపారు. ఈ ఏడాది 3 లక్షల కోట్ల డాలర్లు లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. వచ్చే ఐదేండ్లలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లను చేరాలంటే నిర్మాణాత్మక సంస్కరణలు అవసరమని చెప్పారు. బ్రిటిష్‌కాలం నుంచి ఆనవాయితీగా వచ్చిన బ్రీఫ్‌కేసును పక్కన పెట్టి.. సంప్రదాయ 'బాహీ-ఖాతా' పద్ధతిలో ఓ ఎర్రటి వస్త్రంలో బడ్జెట్ పత్రాలను తీసుకుని నిర్మల లోక్‌సభకు వచ్చారు. దాదాపు 2.17 గంటలపాటు బడ్జెట్ ప్రసంగం సాగింది.

**వేతన జీవులకు నిరాశే**

వేతనజీవులు ఆశగా ఎదురుచూసిన ఆదాయం పన్ను రాయితీల విషయంలో నిర్మల ఎలాంటి నిర్ణయాలు ప్రకటించకుండా నిరాశపర్చారు. అయితే మొదటిసారి ఇల్లు కొనుగోలుచేసేవారికి, ఎలక్ట్రిక్ వాహనాలు కొనేవారికి ఆదాయం పన్నులో మినహాయింపులు ప్రకటించారు. వీటి ప్రకారం ఇంటి రుణాలపై రూ.3.50 లక్షల వడ్డీ రాయితీ లభిస్తుంది. ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలుచేసేవారికి రుణంపై వడ్డీలో 1.5 లక్షలు ఆదాయం పన్ను నుంచి అదనపు మినహాయింపునిస్తారు. ఎన్నికల ముందు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పేర్కొన్న విధంగానే ఐదు లక్షలలోపు వార్షికాదాయం ఉన్నవారిని ఆదాయం పన్ను నుంచి మినహాయించారు. భారీ ఆదాయం సంపాదించేవారు జాతి నిర్మాణానికి మరింత తోడ్పడాలన్న సీతారామన్.. వారికి సర్‌చార్జి వాత పెట్టారు. ఏదైనా ఒక బ్యాంకు ఖాతా నుంచి ఏడాదికి రూ. కోటి మించి నగదు విత్‌డ్రా చేసేవారికి రెండు శాతం టీడీఎస్ విధిస్తారు. స్వయం సహాయక బృందాలకు కూడా ముద్ర యోజన వర్తింపజేస్తామని నిర్మల తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు వరాల జల్లు కురిపిస్తూ.. రూ.400 కోట్ల ఆదాయం ఉన్న కంపెనీలకు కార్పొరేట్ ట్యాక్స్‌ను 25శాతానికి తగ్గించారు.

### అణు శక్తి శాఖకు తగ్గిన నిధులు

**న్యూఢిల్లీ:** స్వదేశీ పరిజ్ఞానంతో 8 అణు విద్యుత్ కర్మాగారాలు నిర్మించాలన్న లక్ష్యానికి అనుగుణంగా అణు విద్యుత్తు, సంబంధిత విడి పరికరాలపై కస్టమ్స్ సుంకాన్ని తొలిగించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆ మేరకు బడ్జెట్‌లో అణు శక్తి శాఖకు రూ.40 కోట్ల మేర నిధులు తగ్గించారు. దేశ వ్యాప్తంగా 22 అణు విద్యుత్ కార్మాగారాలను నిర్వహిస్తున్న భారత అణు విద్యుత్ సంస్థ (ఎన్‌పీసీఐఎల్)కు కూడా ఈసారి నిధులు బాగా తగ్గాయి. 2018-19లో రూ.4,665 కోట్లు కేటాయించగా, 2019-20లో రూ.3,000 కోట్లకు కుదించారు. అయితే దేశీయ విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు అణు ఇంధనంపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించనున్నారు. యురేనియమ్ ధాతువుపై ప్రస్తుతం ఉన్న 2.5 శాతంతోపాటు యూ-235, ప్లుటోనియం, ఇతర మిశ్రమ ధాతువులపై ప్రస్తుతం ఉన్న 7.5 శాతం కస్టమ్స్ సుంకాన్ని కూడా పూర్తిగా రద్దు చేశారు.

# తెలంగాణకు అన్యాయం

మూడోపేజీ తరువాయి...

రూ.3.32 లక్షల కోట్లు కేటాయించగా.. ఇందులో రాష్ట్రానికి 3.5 శాతం వరకు నిధులు రావచ్చని పేర్కొంటున్నారు.

**రాష్ట్ర పథకాలకు మొండిచేయి**

కొత్తగా ఏర్పడిన తెలంగాణ .. వినూత్న తరహాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. కొన్ని భారీ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్రం కేంద్రాన్ని కొంతకాలంగా కోరుతున్నది. భారీ నీటిపారుదల ప్రాజెక్ట్ కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వాలని, లేదా రూ.20 వేల కోట్ల ఆర్థిక సహాయం చేయాలని కోరింది. ఓటాన్-అకౌంట్ బడ్జెట్ సమయంలోనే సీఎం కేసీఆర్ స్వయంగా ప్రధాని మోదీని కలిసి ప్రత్యేకంగా నిధులపై విజ్ఞప్తి చేశారు. కొత్త జిల్లాలను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చాలని, పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదలచేయాలని విన్నవించారు. కరీంనగర్‌లో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, సికింద్రాబాద్- మహబూబ్‌నగర్, సికింద్రాబాద్-జహీరాబాద్ మార్గంలో రైల్వేలైన్లను డబుల్ లైన్లుగా ఏర్పాటుచేయాలని, కొత్త జిల్లాలకు జవహర్ నవోదయ పాఠశాలలను కేటాయించాలని రాష్ట్రప్రభుత్వం కోరింది. కానీ, అత్యంత ప్రాధాన్యం కలిగిన పథకాలను సైతం కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రాన్ని ప్రత్యేక దృష్టితో చూడాలని, ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రోత్సాహకాలు ఇవ్వాలన్న డిమాండ్‌నూ నిర్లక్ష్యం చేసింది. మిషన్‌భగీరథ, మిషన్‌కాకతీయ వంటి బృహత్తర పనులకు ఆర్థికసాయం అందించాలన్న నీతిఆయోగ్ సూచనను, 14వ ఆర్థికసంఘం సిఫారసునూ పెడచెవినపెట్టింది.

**పన్నుల వాటాలో తీరని అన్యాయం**

రాష్ట్రం తలసరి ఆదాయం పెరుగుతున్నది. రాష్ట్రసంపద జీఎస్డీపీ అంచనాలకు మించుతున్నది. కానీ కేంద్రం పన్నుల వాటాలో రాబడి అదేస్థాయిలో తగ్గుతున్నది. సొంత వనరులను ఉపయోగించుకుని రాష్ట్ర సంపదను పెంచుకుంటున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వ విధానాలు ప్రతిబంధకంగా మారాయి. ఆర్థిక క్రమశిక్షణతో ప్రగతిపథంలో ముందుకు దూసుకుపోతున్న తెలంగాణకు ఆర్థిక 'క్రమశిక్షణ' ఒకరకంగా 'శిక్ష'గా మారుతున్నది. తెలంగాణలో తలసరి ఆదాయంతోపాటు రాష్ట్రస్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ)గణనీయంగా పెరుగుతుండటంతో కేంద్రం పన్నుల రాబడిలో వచ్చేవాటాను తగ్గిస్తున్నది. వాస్తవానికి అన్నిరాష్ట్రాల నుంచి ఆదాయం పన్ను, కేంద్ర ఎక్సైజ్ సుంకాలు, సీజీఎస్టీ, ఎస్టేట్ డ్యూటీల ద్వారా వసూలయ్యే పన్నుల రాబడి మొత్తం కేంద్ర ఖజానాకు చేరుతుంది. 14వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు దానిలో నుంచి 42 శాతం నిధులను కేంద్రం రాష్ట్రాలకు పంపిణీ చేస్తుంది. ఈ వాటా కేటాయింపులలో కేంద్రం కొన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఏ రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగా లేదో, ఎక్కడైతే లోటు ఉంటుందో ఆ రాష్ట్రాలకు ఎక్కువ వెయిటేజీ ప్రకారం నిధులు అందుతాయి. తెలంగాణ ఆర్థిక పురోగతి ఇతర రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉన్నందున పన్నులలో వాటా తగ్గిస్తున్నది. నిర్దిష్ట ప్రణాళిక లేకుండా అన్నిరకాల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించకుండా, ఆర్థికంగా గాడితప్పిన రాష్ట్రాలు కేంద్ర పన్నుల వాటాలో అధిక ప్రయోజనం పొందుతుండటం విశేషం. ఇందులోనూ ఉత్తరాది రాష్ట్రాలు ముందున్నాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలు అగ్రభాగాన ఉన్నాయి. కేంద్ర పన్నులవాటాలో బీహార్‌కు 10.9 శాతం, ఉత్తరప్రదేశ్‌కు 19.677 శాతం, మధ్యప్రదేశ్‌కు 7.55 శాతం, పశ్చిమ బెంగాల్‌కు 7.264 శాతం వాటా లభిస్తుండటం విశేషం. కానీ అన్నిరంగాల్లో దూసుకుపోతూ కేంద్రానికి అత్యధిక ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలలో అగ్రభాగాన ఉన్న తెలంగాణకు మాత్రం కేవలం 2.44 శాతం వాటా రావడం గమనార్హం. పొరుగు రాష్ట్రం ఏపీలో రాబడి తక్కువ ఉన్నా జనాభా, ఆర్థిక లోటు ప్రాతిపదికన 4.31 శాతం వాటా ఇస్తున్నది. ఆర్థిక క్రమశిక్షణ, అభివృద్ధి ఆధారంగా తమలాంటి రాష్ట్రాలను ప్రోత్సహించాలని, నిధుల కేటాయింపు ప్రాతిపదికలో మార్పు తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం మొదట్నుంచీ కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడంలేదు.

# డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహం

### మర్చెంట్ డిస్కౌంట్ రేటుపై రుసుము ఎత్తివేత

**న్యూఢిల్లీ, జూలై 5:** డిజిటల్ చెల్లింపులను ప్రజలకు చేరువ చేయడంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నది. కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత డిజిటల్ చెల్లింపుల విధానాన్ని అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డిజిటల్ చెల్లింపుల్లో గత ఐదేండ్లలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన కేంద్రం.. తాజా బడ్జెట్‌లో మరో నిర్ణయం తీసుకున్నది. 'రూ.50 కోట్లకుపైగా వార్షిక టర్నోవర్ కలిగిన వ్యాపారుల డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు, వినియోగదారులకు లబ్ధిచేకూర్చేలా మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)పై ఎలాంటి రుసుము విధించకూడదని నిర్ణయించాం. ఎండీఆర్ అనేది డిజిటల్ లావాదేవీలను సులభతరం చేసేందుకు విధించే చార్జీలు మాత్రమే. ఈ నిబంధనలు అమలుచేయడానికి ఆదాయపు పన్ను చట్టం, చెల్లింపులు, పరిష్కార వ్యవస్థల చట్టం 2007లో అవసరమైన సవరణలు చేస్తాం' అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఎండీఆర్ చార్జీలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), బ్యాంకులు సైతం డిజిటల్ పేమెంట్ల వైపు కస్టమర్లు మళ్లేలా చర్యలు తీసుకుంటే మరిన్ని మంచి ఫలితాలు వస్తాయని సీతారామన్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే భీమ్ యూపీఐ, యూపీఆర్-క్యూఆర్‌కోడ్, ఆధార్ పే, వివిధ డెబిట్ కార్డులు, ఎన్ఈఎఫ్టీ, ఆర్టీజీఎస్ వంటి డిజిటల్ చెల్లింపుల విధానాలు అందుబాటులో ఉన్నాయని, డిజిటల్ చెల్లింపులు ఎక్కువగా జరిగేలా కేంద్రం కూడా తగురీతిలో వ్యాపారులను ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగానే ఎండీఆర్‌పై రుసుములు అని పేర్కొన్నారు.



ఇది గ్రీన్, సిటిజన్ ఫ్రెండ్లీ బడ్జెట్. దేశంలో వ్యవసాయాభివృద్ధికి మార్గం వేస్తుంది. దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లటానికి దన్నుగా నిలుస్తుంది. పర్యావరణ సమతుల్యతకు, అభివృద్ధికి పెద్దపీట వేస్తుంది. వెనుకబడినవర్గాలకు శక్తినిస్తూ దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో తీసుకెళ్తుంది.

**నరేంద్రమోదీ, ప్రధాని**



ఇది ఎలాంటి దిశానిర్దేశం లేని బడ్జెట్. ప్రస్తుత బడ్జెట్‌లో ఎలాంటి మెరుపులు లేవు. ఇది ఉత్తేజం నింపే లక్షణాలు లేని నిర్జీవ బడ్జెట్. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ప్రోత్సాహం లేదు. ఇది పసలేని పడికట్టు పదజాల మాయాజాలంతో రూపొందించిన బడ్జెట్.

**రన్‌దీప్‌సింగ్ సుర్జేవాలా, కాంగ్రెస్ అధికార ప్రతినిధి**

### చరిత్రలో నేడు



**1885**

కుక్కకాటుకు (రేబిస్ వ్యాధి) 'వాక్సిన్'ను కనుగొన్న లూయిస్ పాశ్చర్.

**1892**



బ్రిటిష్ పార్లమెంట్‌కు భారత ప్రతినిధిగా ఎన్నికైన తొలి భారతీయుడు దాదాబాయి నౌరోజీ.



**1947**

రష్యాలో అత్యాధునిక తుపాకీ 'ఏకే-47'ను తయారుచేసిన మైఖెల్ కలష్నికోవ్.

కాంగ్రెస్ అధ్యక్షపదవికి రాజీనామా చేసిన రాహుల్‌గాంధీ వ్యూహాత్మకంగా ముందుకుపోతున్నారు. 2019 సాధారణ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత కాంగ్రెస్ భవిష్యత్తుపై కారు మేఘాలు కమ్మిన వేళ పార్టీ పునరుజ్జీవనానికి రాహుల్‌గాంధీ తన రాజీనామా అస్త్రంతో మరమ్మతులు చేయసంకల్పించారు. పార్టీలో స్వప్రయోజనాలే పరమావిధిగా తిష్టవేసిన సీనియర్లు లక్ష్యంగా రాహుల్ అడుగులు వేస్తున్నారు. అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నా సైద్ధాంతిక పోరాటం కొనసాగిస్తానని చెప్పటం గమనార్హం.

**ది హిందూ**

కేరళలో లాకప్ మరణాలు సాధారణమైపోయాయి. యూడీఎఫ్ అయినా, ఎల్డీఎఫ్ అయినా పోలీసుల తీరు మారటం లేదు. ఎల్డీఎఫ్ అధికారంలోకి వచ్చిన ఈ మూడేండ్లలోనే ఐదు లాకప్ మరణాలు చోటుచేసుకున్నాయి. ఆర్థికపరమైన మోసం కేసులో అరెస్టు చేసిన వ్యక్తిని తీవ్ర చిత్రహింసలు పెట్టిన కారణంగా అతడు జైల్లో చనిపోయాడు. ఇంతకుముందు కూడా 26 ఏండ్ల యువకున్ని అరెస్టు చేసి చిత్రహింసల పాలుచేయటంతో చనిపోయాడు. నిజానికి అతడు నిందితుడు కాదు.పొరపాటుగా ఒకరికి బదులుగా పొరపాటున అరెస్టు చేశారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలే కాదు, పోలీసుల పని పద్ధతులూ మారలేదనటానికి ఇది నిదర్శనం.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**



# దేశీయత లేని బడ్జెట్

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలనే లక్ష్యమే ప్రధానమైందిగా కనబడుతున్నది. ఆర్థికరంగంలో వ్యవస్థాగత సంస్కరణలను చేపట్టడానికి మోదీ ప్రభుత్వం మొదటి పర్యాయం పాలనలో అనుసరించిన విధానాలకు తాజా బడ్జెట్ కొనసాగింపనేది స్పష్టం. విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడానికి అనుగుణమైన అనుకూల పరిస్థితులను సృష్టించడానికి భిన్నరకాల చర్యలను బడ్జెట్ ప్రతిపాదిస్తున్నది. విమానయానం, మీడియా, బీమా రంగాలలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సరళీకరించాలని ఆర్థికమంత్రి బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దేశాన్ని 2025 నాటికి ఐదు లక్షల కోట్ల రూపాయల ఆర్థికవ్యవస్థగా వృద్ధి చేయాలనే లక్ష్యం బాగానే ఉన్నప్పటికీ, ఆందుకు అనుసరిస్తున్న విధానాలు మాత్రం సామాజికాభివృద్ధికి దోహదపడేవిగా లేవు. పెట్టుబడులు ప్రవహిస్తే ఉద్యోగ కల్పన జరుగుతుంది, ఎగుమతులు పెరుగుతాయి, మొత్తం ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందనే సాధారణ సూత్రీకరణ ఇప్పుడున్న సంక్లిష్ట పరిస్థితులకు వర్తిస్తుందా అనేది సందేహమే. ఇంటింటికి నీళ్ళందించడం, అందరికి ఆవాసాలు కల్పించడం విధానకర్తల కనీస ధర్మమై ఉండాలె. అది బడ్జెట్‌లో పేర్కొన్నంత మాత్రాన ఎంతవరకు సాధిస్తారనేది చెప్పలేని పరిస్థితి. అయితే గ్రామీణాభివృద్ధి అంటే స్వచ్ఛభారత్, ఇంటింటికి నీళ్ళందించడమనే స్థాయిలో ఆలోచిస్తూ, దేశాన్ని పెద్ద ఆర్థికవ్యవస్థగా తీర్చిదిద్దుతామని చెప్పుకోవడం ఆశ్చర్యకరంగా ఉన్నది. గ్రామీణాభివృద్ధిని వ్యవసాయ–వ్యాపారాభివృద్ధిగా కాకుండా సమగ్ర సామాజికాభివృద్ధిలో భాగంగా చూడాలె.


**గ్రామీణ, వ్యవసాయ రంగాల్లో తీవ్ర సంక్షోభం ఉన్నది. యువతలో అసంతృప్తి పెరుగుతున్నది. దేశ ఆర్థికవ్యవస్థ బలహీనంగా ఉన్నది. ఈ పరిస్థితిలో దేశానికి దిశానిర్దేశం చేసేదిగా బడ్జెట్ ఉండాలని ప్రజలు ఆశిస్తారు. సూక్ష్మస్థాయిలో సమాజంలోని భిన్నవర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలు గమనార్హమైనవి. వ్యవసాయరంగాన్ని కూడా సంక్షోభం నుంచి బయటపడేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనుసరిస్తున్న వ్యూహాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సింది.**

మౌలిక వసతుల రంగంలోకి భారీగా విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాలని కేంద్రం భావిస్తున్నది. మౌలిక వసతుల కల్పన కోసం నిపుణుల కమిటీని నియమించాలని భావిస్తున్నది. ఈ రంగాన్ని ప్రాధాన్యాంశంగా గుర్తిస్తున్నట్టు మంత్రి సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో స్పష్టంగా వెల్లడించారు. ఆర్థికవ్యవస్థ వృద్ధి కోసం దేశవ్యాప్తంగా మౌలికవసతులు, అనుసంధానం అవసరమని ఆమె వివరించారు. ఇందుకోసం సమగ్ర నమూనాను రూపొందించారు. జాతీయ రహదారుల కోసం ఇప్పటికే 24 వేల కోట్లను సేకరించారు. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన తాత్కాలిక పద్దుల్లోనే, రహదారుల అభివృద్ధికి 83,016 కోట్లు, రైల్వేలకు 64, 587 కోట్లు కేటాయించారు. రైల్వే మౌలికవసతుల రంగంలో యాభై లక్షల కోట్ల రూపాయల మేర పెట్టుబడులు అవసరమైన నేపథ్యంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని కల్పిస్తున్నట్టు బడ్జెట్లో పేర్కొన్నారు. కేంద్రం నదీ జలరవాణాను వృద్ధిచేయాలని నిర్ణయించింది. భారత్ మాల, సాగర మాల వంటి పారిశ్రామిక కారిడార్ల పథకాలు కొనసాగుతాయి. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద గ్రామీణ రహదారుల నిర్మాణానికి 80,250 కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నది. పబ్లిక్‌రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం కూడా మోదీ విధానాలలో ప్రధానమైనది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో 51 శాతం ప్రభుత్వ వాటాను తగ్గించుకోవాలని కూడా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరిస్తామని కూడా స్పష్టంచేశారు. విదేశీ పెట్టుబడిదారులకు ఇబ్బంది కలిగించే కార్మిక చట్టాలను సంస్కరించాలనేది కూడా బడ్జెట్‌లో ప్రస్తావించారు.

గ్రామీణ, వ్యవసాయ రంగాల్లో తీవ్ర సంక్షోభం ఉన్నది. యువతలో అసంతృప్తి పెరుగుతున్నది. దేశ ఆర్థికవ్యవస్థ బలహీనంగా ఉన్నది. ఈ పరిస్థితిలో దేశానికి దిశానిర్దేశం చేసేదిగా బడ్జెట్ ఉండాలని ప్రజలు ఆశిస్తారు. సూక్ష్మస్థాయిలో సమాజంలోని భిన్నవర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలు గమనార్హమైనవి. వ్యవసాయరంగాన్ని కూడా సంక్షోభం నుంచి బయటపడేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనుసరిస్తున్న వ్యూహాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సింది. సమాజాన్ని అర్థం చేసుకొని తదనుగుణమైన పథకాలను రూపొందించుకొని వాటిని సమర్థవంతంగా అమలుచేసినప్పుడే పరివర్తన సాధ్యం. ప్రజల్లో కొనుగోలు శక్తి లేనప్పుడు, ఎంత ఉత్పత్తి జరిగి ఏమి లాభం? ఆర్థిక సంక్షోభాలన్ని ఈ వాస్తవాన్ని విస్మరించడం వల్ల కలిగేవే. ఇక అంతర్జాతీయరంగంలో ప్రపంచీకరణ మంత్రం పాటించిన దేశాలే ఇవాళ రక్షిత వాణిజ్య విధానాలను అనుసరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పత్తి చేసినంత మాత్రాన ఎగుమతులు సాధ్యం కాదు. దానికి స్పష్టమైన రాజకీయ వ్యూహం ఉండాలె. విదేశీ ఆర్థిక సంక్షోభాల నుంచి మన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడం కూడా ముఖ్యమే. విదేశీ పెట్టుబడులను నమ్ముకొని దేశ ఆర్థిక సుస్థిరతను సాధించలేం. విదేశీ కరెన్సీ రుణాలను అంగీకరించే పోకడ ఎక్కడికి దారితీస్తుందనే స్పృహ కూడా అవసరం. డాలరీకరణ విధానాల వల్ల ఇతర దేశాల అనుభవాలను గ్రహించాలె. కానీ కేంద్ర బడ్జెట్ దేశ పరిస్థితులను, వాణిజ్యరంగంలో అంతర్జాతీయ పోకడలను గమనంలోకి తీసుకున్నట్టుగా కనిపించడం లేదు. ఐదు లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థకు బాట వేస్తుందంటున్న బడ్జెట్‌లో దేశీయత కొరవడింది.

### జనగళం

## దళిత వైతాళికుడు జగ్జీవన్‌రామ్



నవభారత నిర్మాణానికి నాంది పలికిన అగ్రశ్రేణి జాతీయ నాయకుల్లో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఒకరు. పిన్న వయస్సులోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు కెళ్లిన నాయకుడు. కులరహిత సమాజం కోసం అహర్నిశలు కృషిచేసిన నేత. సంక్షేమ రాజ్య స్థాపనకు నాంది పలికిన సంస్కర్త. బడుగు, అట్టడుగు వర్గాల ప్రజల ఆశాదీపం జగ్జీవన్ రామ్. ఆయన 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రంలోని షాబాద్ జిల్లా చాంద్వా గ్రామంలో బసంత్ దేవి–శోభిరామ్ పుణ్య దంపతులకు జన్మించాడు. చదువుకునే రోజుల్లోనే అంటరానితనం దుష్ప్రభావాలను చవిచూశాడు. ఆ పరిస్థితులే జగ్జీవన్‌రామ్ దేశంలోనే అత్యున్నత పదవులను అధిరోహించడానికి కారణమయ్యాయి.

1935లో ఆయన 27 ఏండ్ల వయస్సులో బీహార్ శాసనమండలి సభ్యునిగా ఎన్నిక కావడంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. జగ్జీవన్‌రామ్ చరిత్రను మూడు దశలుగా విభజించి చూస్తేగానీ పూర్తిగా ఆయనను అర్థం చేసుకోలేం. 1.స్వాతంత్ర్య పోరాటంలో జాతీయస్థాయిలో అగ్రశ్రేణి నాయకుల్లో ఒకడిగా పోరాటం చేయటం. 2.భారత రాజ్యాంగ రచన డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యునిగా ఉండటం. 3.ఐదు దశాబ్దాల రాజకీయాల్లో ఓటమెరుగని నేత. మూడు దశాబ్దాల కాలం పాటు కేంద్ర కేబినెట్ మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా దేశ సమగ్రాభివృద్ధికి ఎనలేని సేవలందించడం వంటి ప్రధాన దశలను పరికించి చూస్తేగానీ ఆయన చరిత్ర అవగతం కాదు.

ఎస్సీ రిజర్వేషన్లు పదేండ్ల అమలు తర్వాత రిజర్వేషన్లు ఉండాలా? వద్దా? అన్న అంశం పార్లమెంట్‌లో చర్చకు వచ్చిన సందర్భంలో 'ఈ దేశంలో కులపీడన, దోపిడీ, అణిచివేతలు కొనసాగినంత కాలం రిజర్వేషన్లు ఉండాల్సిందే'నని పట్టుబట్టి చట్ట సవరణ చేయించిన దళిత జాతి వైతాళికుడు. ఆయన 78 ఏండ్ల వయస్సులో 1986 జూలై 6న స్వర్గస్తులైనారు. ఆ మహనీయుని జీవితం వర్తమాన చరిత్రకారులు పునికిపుచ్చుకున్నప్పుడే ఆయనకు సరైన నివాళి.

**- డప్పోళ్ల రమేష్**

(నేడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి)

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

ముక్తసరి



**దేవులపల్లి ప్రభాకరరావు**

# రామరామ మహా బాహో..

'సంఖ్యాధిక్యత ముఖ్యం కాదు. అంకెల బలం లేనివాళ్లు రంకెలు వేయవలసిన అవసరం లేదు. ఇక నవభారత నిర్మాణం మన తక్షణ కర్తవ్యం. అన్ని విషయాలు అందరం కూర్చొని ప్రశాంతంగా మాట్లాడుదాం' అని రెండవసారి ప్రధాని కాగానే మోదీజీ అన్నారు. విశాల హృదయంతో ఇవి మోదీజీ పలికిన ఊరడింపు మాటలని కొందరు భావించారు. ఇవి ఓటమి పాలైన ప్రతిపక్షాలను ఉడికించే మాటలని మరికొందరి అభిప్రాయం.

రామరామ మహా బాహో.. అని అంటూ ఆదికవి వాల్మీకి మహర్షి ఒక సందర్భాన అగస్త్య మహర్షి నోటిద్వారా శ్రీరాముడి మహా బలశక్తిని ప్రపంచానికి వివరించాడు. సందేహం లేదు శ్రీరాముడు అత్యంత శక్తివంతుడే. బాల్యంలోనే శ్రీరాముడిని రాక్షస సంహారం కోసం తనవెంట అడవులకు తీసుకువెళ్లి మరో మహర్షి విశ్వామిత్రుడు దశరథ కుమారుడు అయోధ్య రాముడు అసాధారణ బల సంపన్నుడని నిరూపించాడు. కొన్నేండ్లు అరణ్యవాసం చేసి, కొన్నేండ్లు ధర్మపత్ని, సహచరి సీతమ్మకు దూరమై కష్టాలు, దుఃఖాలు, మానసిక క్లేశం ఏమిటో తెలిసిన దయామయుడు రాముడు తన పేరు చెప్పి కొందరు ఇతరులపైన దాడులు చేస్తున్నా, అమాయకులను చంపివేసి రాక్షస ఆనందం పొందుతున్నా ఎందుకు చలించడం లేదో! 'ఇది అన్యాయం' అని ఎందుకనడం లేదో అర్థం కాదు. తన ప్రియసఖి సీతను కాకి పొడుస్తుంటే చూడలేక బాధపడుతూ 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం' అన్నట్లు కాకి మీద అస్త్ర ప్రయోగం జరిపిన ఆ రాముడు ఈ రోజు ఈ పుణ్యభూమిలో తన పేరు ఉచ్చరిస్తూ చావబాదుతుంటే, హత్యలు చేస్తుంటే ఎందుకు నోరు విప్పడం లేదు! అయ్యో రామ ఈ రోజు, గత ఐదేండ్ల నుంచి ఈ భరత భూమిలో నీ నామ దుర్వినియోగం జరుగుతున్నా, నీ నామ జపం చేస్తూ కొందరు కొందరి గొంతులు కోస్తున్నా నువు ఎందుకు మాట్లాడటం లేదు? ఎంతో మొరపెట్టుకున్నా ఉలుకని పలుకని శ్రీ రాముడి దయ కోసం ఇంకా మిడుకుతూ కూర్చోవడం దండుగ అని భార త బాధితులు భావించి ఉంటారు. ఇంతలోనే మన్‌కీ బాత్‌లో మోదీజీ గంభీర గళం వినిపించింది 'రామా రామా అంటూ ఈ నరకడం, చం పడం బాగా లేదు, ఎంతో బాధపడుతున్నాన'ని మోదీజీ నొక్కినొక్కి చెప్పిన మాటలు ఉపశమనం కలిగించాయి. అంతేగాని, దేశంలో, విశేషించి ఉత్తర భారతంలో దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, లించింగ్‌లు ఆగలేదు. ఆగడం లేదు. ఆగడాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి.

ఇటీవల ఎన్నికల ఫలితాల అనంతరం ఔదార్యం కొల్లేరు వలె కట్టలు తెగి ప్రవహించింది. త్రీనాట్ త్రీ అంతులేని ఉత్సాహం కలిగించింది. 'సంఖ్యాధిక్యత ముఖ్యం కాదు. అంకెల బలం లేని వాళ్లు రంకెలు వేయవలసిన అవసరం లేదు. ఇక నవభారత నిర్మాణం మన తక్షణ కర్తవ్యం. అన్ని విషయాలు అందరం కూర్చొని ప్రశాంతంగా మాట్లాడుదాం' అని రెండవసారి ప్రధాని కాగానే మోదీజీ అన్నారు. విశాల హృదయంతో ఇవి మోదీజీ పలికిన ఊరడింపు మాటలని కొందరు భావించారు. ఇవి ఓటమి పాలైన ప్రతిపక్షాలను ఉడికించే మాటలని మరికొందరి అభిప్రాయం. ఈ మరికొందరి అభిప్రాయం నిజమవుతున్న సూచనలు కన్పించాయి. మోదీజీ తొలి ఐదేండ్లకు భిన్నంగా రానున్న ఐదేండ్లలో దేశంలో ఫెడరల్ వ్యవస్థ పటిష్టమై ప్రజాస్వామ్యం పరిమళిస్తుందని గంపెడాశలు పెట్టుకున్నవాళ్లకు ఆదిలోనే ఆశాభంగం తప్పలేదు. గతంలో 16 లోక్‌సభల ప్రారంభానికి భిన్నంగా, 17వ లోక్‌సభ ప్రారంభమైందని, సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని పరికించినప్పుడు ఇదొక సెక్యులర్ రిపబ్లిక్ లోక్‌సభేనా అన్న అనుమానం కలిగిందని ఒక ప్రసిద్ధ దినపత్రిక సీనియర్ కాలమిస్ట్ వ్యాఖ్యానించాడు. ఆయన వ్యాఖ్యతో పరిశీలకులు, విశ్లేషకులు ఎందరో ఏకీభవించారు. దేశంలోని 20 కోట్ల ఒక ముఖ్య వర్గానికి తన లోక్ సభాపక్షంలో కనీసం ఒక్క సీటైనా ఇవ్వని మోదీజీ 'సబ్‌కా విశ్వాస్, సబ్ కా సాథ్, సబ్‌కా వికాస్' నినాదం శుష్కంగా ధ్వనిస్తున్నదని మరొకరి వ్యాఖ్య. 2014 ఎన్నికల్లో 31 శాతం ఓట్లతో, 2019 ఎన్నికల్లో 36 శాతం చిల్లర ఓట్లతో అధికారంలోకి వచ్చిన మోదీజీ 'సబ్‌కా విశ్వాస్' పొందడానికి ఇంకెంతో దూరం పయనించవలసి ఉంటుందని ఆ వ్యాఖ్యాతే అన్నాడు.

తన అమూల్య సందేశంతో ఉభయసభల సంయుక్త సమావేశంలో ప్రసంగించిన, 17వ లోక్‌సభను లాంఛనంగా ప్రారంభించిన రాష్ట్రపతి నవభారత్ నిర్మాణానికి మోదీజీ ప్రభుత్వ సంకల్పం, వ్యూహం బృహత్ ప్రణాళిక, అవతారిక వగైరా ఏమిటో, నవభారత్ నిర్మాణం కోసం మోదీ ప్రభుత్వం ఉద్దేశించిన, ఉద్దేశించబోతున్న నయా పథకాలేమిటో వివరించలేదు. నిజానికి 72 ఏండ్ల కిందట దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించగానే తొలి ప్రధాని నెహ్రూ నేతృత్వంలో నవభారత నిర్మాణం కోసం శాస్త్రీయ, ప్రణాళికాబద్ధ, సామ్యవాదసరళి విధానాలతో (దేశీయ ప్రభుత్వ రంగ సంస్థలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ పబిక్ సెక్టార్‌కే ప్రథమస్థానం సంతరింపజేస్తూ) ఆర్థిక, పారిశ్రామిక, వ్యావసాయక, వైజ్ఞానిక, శాస్త్రీయ, అణుశక్తి అంతరిక్ష సంబంధ, సామాజిక, గ్రామీణ వికాస, పంచాయితీ రాజ్య, అధికార వికేంద్రీకరణ, రక్షణ సంబంధ, అంతర్జాతీయ రంగాల్లో జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన తర్వాత వచ్చిన ప్రధానులు ప్రారంభించి అమలుచేయనివి, ఈ రోజు మోదీజీ ఐదు శూన్య సంవత్సరాల అనంతరం పెను నిద్దుర నుంచి మేల్కొని నవభారత నిర్మాణం కోసం ఆలోచిస్తున్నవేమిటో వివరించి చెప్పగలరా? నవభారత నిర్మాణం విద్వేషరహితంగా, అసహనానికి తావులేకుండా, సామ్యవాద దృక్పథంతో 72 ఏండ్ల కిందటనే ప్రారంభమైందన్నది మోదీయులకు మింగుడు పడని కఠోర సత్యం. నిన్న మొన్నటి చిన్నతరహా సర్జికల్ స్ట్రయిక్స్ కంటే మిలియన్ రెట్లు మిన్న అయిన పారదర్శక–వాస్తవ యుద్ధాల్లో (1947, 1965, 1971) అప్పటి ప్రధానుల ఆర్భాట, ప్రచారరహిత నాయకత్వంలో భారత సైనిక త్రివిధ బలాలు ఘనాతి ఘన విజయాలు సాధించాయన్నది చారిత్రక సత్యం.

**దేశ వ్యవహారాల మంత్రిగా కశ్మీర్‌కు స్వయంగా వెళ్లివచ్చిన షా జీ అక్కడ పరిస్థితి ప్రశాంతంగా ఉందన్నారు. సక్షోంభిత, కల్లోలిత కశ్మీర్ అమిత్‌జీకి ప్రశాతంగా కన్పించినందుకు భారతీయ దేశభక్తులందరు సంతోషిస్తారు. ప్రశాంతంగా ఉంటే మరో ఆరు నెలల పాటు కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించి, అక్కడి రాష్ట్ర శాసనసభ ఎన్నికలను ఎందుకు వాయిదా వేశారో అమిత్ జీ చెప్పలేదు.**

'ఎన్నికలైనాయి. ఇక రాజకీయాలు వద్దు' అన్న తన ముద్దుముద్దు మాటను విస్మరించి, దేశంలో ఇంకే సమస్యలు లేవన్నట్లు తొలిరోజే 'ఒక దేశం ఒకే ఎన్నికలు' అన్న నినాదం వినిపించారు మోదీజీ, ఆయన అనుచరులు. ఈ దేశంలోని వైవిధ్యానికి, భిన్నత్వానికి, విభిన్న సామాజిక, సాంస్కృతిక పరిస్థితులకు, భిన్న వాతావరణ పరిస్థితికి ఈ నినాదం ఇస్తున్నవారు విలువ ఇవ్వడం లేదు. మోదీజీ పక్షం రోజులైనా కాకముందే 'నవభారత నిర్మాణం' నినాదాన్ని మరపింపజేసి 17వ లోక్‌సభ ప్రథమ సమావేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ గురించి తమ పార్టీయుల బల్లగుద్దుళ్ల మధ్య అనర్గళంగా ప్రసంగించారు. 'ఇందిర ఎమర్జెన్సీ అనుశాసన్ పర్వ్' అని ఆచార్య వినోబాభావే వంటి పెద్దలు ప్రశంసించారు. ఎమర్జెన్సీ విధింపు తన తప్పిదమని ఇందిరా గాంధీ పశ్చాత్తాపం ప్రకటించారు. దక్షిణ భారతదేశం ఇందిరా ఎమర్జెన్సీని బలపరచిందని 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' నినాదకర్తలు గ్రహించకతప్పదు. 1977 ఎన్నికల్లో అధికారం కోల్పోయిన (ఎమర్జెన్సీ అనంతరం) ఇందిరా 20 నెలలకే 1980లో తిరిగి అధికారంలోకి వచ్చారు! దేశ ప్రజలకు ఆమె ఎమర్జెన్సీ పాలనే నయం, మేలు అని పించిందా? అన్నిటికంటే ముఖ్యం– ఇందిర ఎమర్జెన్సీలో ఆమె వెంట ఉండి కీలకపాత్ర వహించిన కొందరు పెద్దలు మొదట వాజపేయి మంత్రివర్గంలో ప్రాధాన్యం పొందారు, ఇప్పుడు మోదీజీ మంత్రివర్గంలో ప్రాబల్యం వహిస్తున్నారు. 'దీని భావమేమి తిరుమలేశ!'

ప్రధాని మోదీజీ కుడి భుజం, ఎడమ భుజం రెండూ అయిన అమిత్ షాజీ తెలంగాణలో దిమ్మతిరిగే జవాబు లభించిన తర్వాత ఇక ఎన్నడూ అబద్ధాల జోలికి పోరని ప్రపంచం నమ్మింది. కానీ, దేశ వ్యవహారాల మంత్రిగా అమిత్‌జీ 17వ లోక్‌సభలో తమ మొదటి ప్రసంగాన్ని అబద్ధాలతో, స్వవచన వ్యాఘాతాలతో ప్రారంభించడం విచారకరం. దేశ వ్యవహారాల మంత్రిగా కశ్మీర్‌కు స్వయంగా వెళ్లివచ్చిన షా జీ అక్కడ పరిస్థితి ప్రశాంతంగా ఉందన్నారు. సంక్షోభిత, కల్లోలిత కశ్మీర్ అమిత్‌జీకి ప్రశాతంగా కన్పించినందుకు భారతీయ దేశభక్తులందరు సంతోషిస్తారు. ప్రశాంతంగా ఉంటే మరో ఆరు నెలల పాటు కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించి, అక్కడి రాష్ట్ర శాసనసభ ఎన్నికలను ఎందుకు వాయిదా వేశారో అమిత్ జీ చెప్పలేదు. ఆణిముత్యం వంటి ఒక మాట అని అమిత్‌జీ చేతులు దులుపుకున్నారు. '1947 నుంచి కశ్మీర్ సమస్యకు ప్రధాన కారకుడు నెహ్రూ..' ఇవి 17వ లోక్‌సభ ప్రథమ సమావేశంలో దేశ వ్యవహారాల మంత్రిగా అమిత్ జీ అన్న మాటలు. ఇవి తెలంగాణలో చెప్పిన అబద్ధాల వంటివే. 1947లో నెహ్రూ ప్రభుత్వంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఉప ప్రధాని, దేశ వ్యవహారాల మంత్రి. అయినా పటేల్ మాట నెహ్రూ వినలేదని, అందువల్లనే కశ్మీర్ సమస్య ఉత్పన్నమైందని మోదీయులు అంటారు. అప్పుడు, 1947 అక్టోబర్ 8న నెహ్రూకు రాసిన లేఖలో పటేల్ అన్న మాటలివి.. "I do not think that any thing which could have been for Kashmir has been left undone by me; nor am I aware of any difference between you and me on matters of policy ralating to Kashmir. Still it is most unfortunate that persons down below should think that there is gulf between us. It is also distressing to me..' కశ్మీర్ మహారాజు హరిసింగ్ కశ్మీర్‌ను స్వతంత్ర రాజ్యం చేయాలనుకున్నాడు. కానీ, జవహర్‌లాల్ రాజనీతిజ్ఞత, నిర్విరామ ప్రయత్నాల వల్ల జమ్మూ–కశ్మీర్ భారత్‌లో విలీనమైంది. వాజపేయి నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కశ్మీర్ సమస్యను పరిష్కరించలేకపోయింది. గత ఐదేండ్ల మోదీజీ పాలన లో 2015లో బీజేపీ పెత్తనం మొదలైనప్పటి నుంచి కశ్మీర్ సమస్య ఎన్నడు లేనంతగా తీవ్ర స్వరూపం ధరించింది. మొత్తం దేశం కశ్మీర్ అయ్యే ప్రమాదముంది. అందువల్లనే దూరదృష్టితో బి.ఆర్.అంబేద్కర్ ఎన్నడో అన్నాడు.."If Hindu Raj does become a fact, it will, no doubt, be the greatest calamity for this country... Hindu Raj must be prevented at any cost".

# ఆచరణ కాని ముసాయిదాలేల?

విద్య



**ఎడమ శ్రీనివాస్ రెడ్డి**

కస్తూరి రంగన్ కమిషన్ విడుదల చేసిన జాతీయ విద్యావిధాన నివేదిక అనేకవిధాలుగా చర్చనీయాంశమవుతున్నది. ఈ నివేదికలోని అంశాల్లో ముఖ్యంగా విద్యాహక్కు చట్టాన్ని మూడు నుంచి 18 ఏండ్ల వరకు విస్తరించాలనే సిఫారసు, ప్రీ ప్రైమరీ విద్య, టీచర్ ఎడ్యుకేషన్లను బలోపేతం చేయాలనడం, సెకండరీ విద్యలో కోచింగ్ ప్రభావాన్ని, పరీక్షల ప్రభావాన్ని తగ్గించే ఆలోచనలు, కరిక్యులర్, కో కరిక్యులర్ విభజనను తొలిగించడం, వొకేషనల్ విద్యతో సమైక్య పరుచడం, సైంటిఫిక్ టెంపర్‌ను పెంచాలనే సిఫార్సులు, ఉన్నత విద్యలో లిబరల్ ఆర్ట్స్ కోర్సులకు ప్రాధాన్యం, ప్రైవేట్ సంస్థలు తమ సంస్థల పేర్లలో 'పబ్లిక్' పదాన్ని వాడకూడదనే సూచన, మానవ వనరుల అభివృద్ధి శాఖను విద్యాశాఖగా మార్చాలనే సూచన, విద్యకు బడ్జెట్ పెంపు, విద్యా సంస్థల స్వయం ప్రతిపత్తి గురించిన ప్రతిపాదనలు చూసినపుడు నివేదిక సంతృప్తికరంగానే ఉందనే భావనను కలిగిస్తుంది. కానీ దేశవ్యాప్తంగా స్కూల్ ఎడ్యుకేషన్‌లో సుమారు 50 శాతం, ఉన్నత విద్యలో 80 శాతం, ప్రొఫెషనల్ విద్యలో 90 శాతం ప్రైవేటీకరణ జరిగింది. ఈ నేపథ్యంలో విద్యలో ప్రైవేటీకరణ జరిగిన దేశాల అనుభవాల నుంచి, విద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తున్న దేశాల అనుభవాల నుంచి పరిశీలించినపుడు ఈ కమిషన్ ప్రతిపాదనల అమలుకు సంబంధించిన పరిమితులు అర్థమవుతాయి.

విద్యా విషయాల్లో వెనుకబడిన దేశం మనది. 33 ఏండ్ల తర్వాత రూపొందించుకుంటున్న విద్యావిధానం కాబట్టి ఇది ప్రస్తుత విధానం లోని వైఫల్యాలను, లోపాలను సవరించేదిగా ఉండాలి. కస్తూరి రంగన్ సిఫార్సుల్లో మంచివని భావించబడుతున్నవి కూడా విద్యాపరంగా అభివృద్ధి చెందిన దేశాల్లో చాలా మార్పులను పొంది ఉన్నాయి. అందుకని వీటికి పూర్తిస్థాయి సమకాలీనత లేదు. కొన్ని సిఫార్సులు ఆదర్శప్రాయంగా ఉన్నాయి కానీ ఆచరణాత్మకంగా లేవు. ముఖ్యంగా విద్యలో ప్రైవేటీకరణ పరిణామాలను ఇది విస్మరించింది.

స్వాతంత్ర్యానంతరం అందరికీ సమానంగా విద్యావకాశాలను, వాటి ఫలితాలను అందజేయడంలో వైఫల్యం చెందాం. అందరికీ విద్యను ప్రభుత్వమే అందజేయవలసిన రాజ్యాంగ నిర్దేశిత బాధ్యత నుంచి ప్రభుత్వాలు క్రమంగా పక్కకు తొలిగాయి. ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వల్ల విద్యాసంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయి. విద్యావకాశాల్లో, ఫలితాల్లో తీవ్ర అసమానతలు చోటుచేసుకున్నాయి. విద్యా వ్యవస్థలో తలపెట్టే మార్పులు ఈ లోపాలను సవరించేవిగా ఉండాలి. జాతీయ విద్యా విధాన ముసాయిదా లోపాలను గుర్తిస్తున్నది, కానీ వాటి పరిష్కారాలకు సూచించిన ఆచరణలో స్పష్టత లోపించడమే గాక సమస్యలను కొనసాగింపజేసేవిగానే ఉన్నాయి.

అభ్యసన సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రీ స్కూల్ దశలో తీసుకురావలసిన మార్పులను ఈ ముసాయిదా లోతుగానే చర్చించింది. విద్యాహక్కు చట్టాన్ని 3–18 వయస్సు గల పిల్లలందరికీ వర్తింపజేయాలని కోరింది. మెదడు అభివృద్ధిలో ఆటంకాలు, పేదరికం పిల్లల అభ్యసనాన్ని ఎలా కుంటుపరుస్తాయో వివరించింది. కానీ ఇప్పటికే వ్యాపారమయమైన ప్రీ ప్రైమరీ విద్య గురించి గానీ, దాని విస్తరణ ద్వారా జరుగబోయే వ్యాపారీకరణను గాని ఈ ముసాయిదా చర్చించలేదు. పోగా విద్యాహక్కు చట్టం అనుసరించి మౌలిక వసతులు, ఇతరత్రా తప్పనిసరిగా సమకూర్చుకోవలసిన వాటి నుంచి ప్రైవేట్ విద్యాసంస్థలకు మినహాయింపులు ఇవ్వాలనే సూచనలను చేయటం గమనార్హం.

**చదువుల విషయంలో పిల్లల ఆసక్తులను పరిగణనలోకి తీసుకోవడం, వారికి స్వేచ్ఛను ఇవ్వడం జరుగదు. వీటిని పరిష్కరించకుండా అభ్యసన సంక్షోభాన్ని పరిష్కరించలేం. కానీ ఈ ముసాయిదా మన వారసత్వ విజ్ఞానంలోని ఇలాంటి లోపాలను ఎత్తి చూపలేదు. మన వారసత్వ విజ్ఞానం అంతా ఆమోదయోగ్యమైనదే అన్నట్లుగా చర్చ చేసింది.**

విద్యకు, పని అనుభవానికి మధ్య సంబంధం లేని చదువులు, ఒకేషనల్ విద్య పట్ల నిర్లక్ష్యం పిల్లలంతా సాధారణ విద్యకు చేరేటట్లు చేస్తాయి. దీనితో తక్కువ ఉపాధి అవకాశాలకు ఎక్కువ మంది పోటీ పడటం జరుగుతున్నది. ఎంపిక పరీక్షలకు ప్రాధాన్యం పెరుగుతుంది. విద్యా వ్యవస్థ పరీక్షా వ్యవస్థగా మారుతుంది. విద్యలో ప్రైవేటీకరణ పెరిగినా కొద్దీ దీని తీవ్రత అధికమవుతుంది. అర్థవంతంగా, సమగ్రంగా నేర్చుకోవడం కంటే, పరీక్షలను ఎదుర్కునే సామర్థ్యాలను పొందడానికి, సర్టిఫికెట్లను పొందడానికి ప్రాముఖ్యం పెరుగుతుంది. దీన్నే 'డిప్లొమా డిసీజ్' అని బ్రిటిష్ సామాజిక శాస్త్రవేత్త రోనాల్ డోరె పిలిచారు. మౌలికమైన ఈ సమస్యలను పరిష్కరించకుండా 5+3+3+4 నిర్మాణం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ లాంటి మార్పులు ఈ డిప్లొమా డిసీజ్‌ను తగ్గించలేవు.

దేశంలో వైవిధ్యం ఎక్కువ ఉన్నప్పుడు, ప్రాంతీయ అసమానతలు ఉన్నప్పుడు అందరికీ ఒకే పరీక్ష న్యాయమైనది కాదు. వేర్వేరు వైయక్తిక లక్షణాలతో ఉండే పిల్లలను వేర్వేరుగా గాక ఒకే పరీక్ష ద్వారా అంచనా వేయాలనుకుంటున్నాం. ప్రాథమికమైన ఈ వైరుధ్యాన్ని ఈ ముసాయిదా విస్మరించింది.

విషయాలను స్మరించడం (రొట్ మెమరీ) ద్వారా నేర్చుకోవడం, నైతిక ఆధిపత్యంతో స్వేచ్ఛ లోపించిన టీచర్ స్టూడెంట్ సంబంధాలు మన సాంస్కృతిక నేపథ్య ఫలితాలు. మన పిల్లలు ఏదేని విషయంలో రాణించలేదంటే, వారు సరిగా కష్టపడలేదనుకుంటాం. కానీ ఆ విషయంలో వారికి ఆసక్తి లేకపోవడమని అనుకోం. చదువుల విషయంలో పిల్లల ఆసక్తులను పరిగణనలోకి తీసుకోవడం, వారికి స్వేచ్ఛను ఇవ్వడం జరుగదు. వీటిని పరిష్కరించకుండా అభ్యసన సంక్షోభాన్ని పరిష్కరించలేం. కానీ ఈ ముసాయిదా మన వారసత్వ విజ్ఞానంలోని ఇలాంటి లోపాలను ఎత్తి చూపలేదు. మన వారసత్వ విజ్ఞానం అంతా ఆమోదయోగ్యమైనదే అన్నట్లుగా చర్చ చేసింది. విద్యాసంస్థల స్వయంప్రతిపత్తి గురించి ఆదర్శాలు వల్లిస్తున్న ముసాయిదా అధికార కేంద్రీకరణకు, విద్యా విధాన నిర్ణయాల్లో రాజకీయ ప్రాబల్యానికి తావునిచ్చే విధంగా రాష్ట్రీయ శిక్షా ఆయోగ్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. ప్రతిభ పట్ల సంకుచిత అభిప్రాయాలకు సాధికారత, దాన్ని కొలిచే అశాస్త్రీయ పద్ధతులున్న ప్రక్రియ విపరీతమైన వ్యాపారమయమై, చదువులను కొనుక్కునే పరిస్థితులున్నంత కాలం స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్స్, జెండర్ ఇంక్లుసివ్ ఫండ్ లాంటి పథకాలు ఆదర్శమవుతాయి తప్ప అసమానతలను తగ్గించలేవు.

పిల్లల సమగ్ర వికాసానికి సంబంధించిన సంస్కరణలలో యునెస్కో అంతర్జాతీయ విద్యా కమిషన్ అయిన 'డెలర్' కమిషన్ నివేదికను మార్గదర్శకంగా ఎంచుకోవాలని ఈ ముసాయిదా ప్రముఖంగా పేర్కొన్నది. అయితే డెలర్ నివేదిక లాగానే ఇది కూడా ఆచరణాత్మకంగా లేని ఆదర్శాల వల్లె వేత మాత్రమే.

**(వ్యాసకర్త: అధ్యాపకులు, జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



# బడ్జెట్ 2019-20

## 2022 నాటికి

- దేశంలోని ప్రతి కుటుంబానికి విద్యుత్ సౌకర్యం
- ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా లబ్ధి
- లబ్ధిదారులకు 1.95కోట్ల ఇండ్ల అందజేత
- ప్రభుత్వ, ప్రైవేటు భాగ స్వామ్యం ద్వారా రైల్వేల్లో నూతన విధానం
- 2030నాటికి రైల్వేల మౌలిక వసతుల కోసం రూ.50లక్షల కోట్లు అవసరం

## 80 వేల కోట్లు

- గ్రామీణ సడక్ యోజన ద్వారా రూ.80వేల కోట్లతో 1.25 లక్షల కిలోమీటర్ల రహదారుల నిర్మాణం
- ప్లాస్టిక్ వ్యర్థాలతో 30వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారుల నిర్మాణం




## పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ తల్లిదండ్రులు


బడ్జెట్ ప్రసంగాన్ని వినేందుకు శుక్రవారం పార్లమెంట్‌కు వస్తున్న నిర్మలా సీతారామన్ తల్లిదండ్రులు సావిత్రి, నారాయణ్

**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మొట్టమొదటి బడ్జెట్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆమె తల్లిదండ్రులు శుక్రవారం పార్లమెంట్‌కు వచ్చారు. సీతారామన్ తల్లిదండ్రులు సావిత్రి, నారాయణ్ సీతారామన్ ప్రత్యేక కారులో పార్లమెంట్‌కు చేరుకున్నారు. రైల్వే ఉద్యోగిగా రిటైర్ట్ అయిన నారాయణ్ సీతారామన్ తన భార్య సావిత్రితో కలిసి వచ్చారు. వారిని సిబ్బంది, అధికారులు సాదరంగా ఆహ్వానించారు. వారు సందర్శకుల గ్యాలరీలో కూర్చుని తమ కూతురు బడ్జెట్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు.



# శభాష్.. సీతారామన్

- తొణుకుబెణుకు లేకుండా బడ్జెట్ సమర్పణ
- ఉర్దూ, హిందీ, సంస్కృతం, తమిళ సామెతలతో.. 2.17 గంటలపాటు అనర్గళంగా ప్రసంగం
- మంచినీళ్లు తాగడానికి కూడా విరామం తీసుకోని వైనం
- తొలి పూర్తిస్థాయి మహిళా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌పై ప్రశంసలు



**న్యూఢిల్లీ, జూలై 5:** ఎక్కడా తడబాటు లేదు.. తొనుకు లేదు.. బెణుకూ లేదు.. పంతులు పాఠం చెప్పినట్టు.. ప్రఖ్యాత వక్త ప్రసంగించినట్టు.. అవధాని చలోక్తులు విసిరినట్టు అక్కడక్కడా ఉర్దూ, హిందీ, సంస్కృతం, తమిళ సామెతలు.. పద్యాలు.. రెండుగంటల పదిహేడు నిమిషాలపాటు సాగిన సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగంలో కనీసం మంచినీళ్లయినా ముట్టలేదు..! ఇదీ..తొలి పూర్తిస్థాయి మహిళా ఆర్థికమంత్రిగా నిర్మలాసీతారామన్.. 2019-20 వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తీరు. రక్షణ మంత్రిగా అనేక సవాళ్లను దీటుగా ఎదుర్కొన్న ఆమె.. మొట్టమొదటిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మహిళగా చరిత్రకెక్కారు. ప్రధాని మోదీతోపాటు పలువురు ఎంపీలు బల్లలను చరుస్తూ ఆమె ప్రతిపాదనలను స్వాగతించారు. బంగారు వర్ణం అంచున్న ఎరుపురంగు పట్టుచీరలో ఉదయం 10.55 గంటలకు లోక్‌సభలో అడుగుపెట్టిన నిర్మలా సీతారామన్.. తన స్థానంలో ఆసీనులయ్యారు. ఆమె వెంట వచ్చిన పలువురు మహిళా ఎంపీలు బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. బడ్జెట్ ప్రసంగం ప్రారంభించడానికి ముందుగా ఆమె తన మైక్‌ను సరిచేసుకున్నారు. గ్యాలరీలో కూర్చున్న ఆమె తల్లిదండ్రులు సావిత్రి, నారాయణన్ సీతారామన్, జర్నలిస్టు అయిన కుమార్తె వాంగ్మయ్ పరకాల నిర్మలా సీతారామన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హిందీలో గ్రామీణ కళాకారులపై నిర్మల కొన్ని ప్రకటనలు చేసినప్పుడు సుదీర్ఘ ప్రశంసలు (చప్పట్లు) అందుకున్నారు. ఆమె ప్రసంగం హిందీ, ఉర్దూ, సంస్కృతం, తమిళ శ్లోకాలతో కొనసాగింది. ప్రముఖ ఉర్దూ కవి మంజూర్ హస్మి రాసిన కవిత 'యకీన్ హో తో కోయి రాస్తా నికల్తా హై. హవా కీ ఓత్ బాయి లే కర్ చిరాగ్ జల్తా హై' (మీకు విశ్వాసం ఉంటే మీరు ఎలాగైనా మార్గాలు కొనుగొంటారు. గాలిలో కూడా దీపం ప్రకాశవంతంగా వెలుగుతుంది)ను ఉటంకించారు. మంజూర్‌హస్మి, చాణక్య, స్వామి వివేకానంద, బసవేశ్వర స్వామి ద్విపదలు, బోధనలు, సామెతలతో ప్రసంగాన్ని ధాటిగా కొనసాగించారు. తొలి సారే అయినప్పటికీ ఎక్కడా తడబడకుండా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్‌ను స్పీకర్ ఓమ్ బిర్లా ప్రశంసించారు.

### బ్రీఫ్‌కేస్ ఆనవాయితీకి బ్రేక్

దేశ తొలి పూర్తిస్థాయి మహిళా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన తొలి బడ్జెట్ ప్రతిపాదన సందర్భంగా బ్రిటిష్ కాలంనాటి ఆనవాయితీని బ్రేక్ చేశారు. పార్లమెంట్‌కు బడ్జెట్ ప్రతులను గోధుమరంగు బ్రీఫ్‌కేసులో తీసుకొచ్చే సంప్రదాయానికి స్వస్తిపలుకుతూ.. ఎర్రటి పట్టు వస్త్రంలో ఆమె బడ్జెట్ ప్రతులను తీసుకువచ్చారు. ఆ వస్త్రంపై జాతీయ చిహ్నం కూడా ఉన్నది. లక్ష్మీ కటాక్షం కోసం భారతీయ వ్యాపారులు తమ ఖాతా పుస్తకాలను ఎర్రటి వస్త్రంలో ఉంచుతుంటారు. దీన్నే బాహీ ఖాతాగా వ్యవహరిస్తారు. నగదు లావాదేవీల వ్యవహారాలకు దీన్ని శుభకరమైనదిగా భావిస్తారు. అలాగే మత సంబంధిత గ్రంథాలను కూడా ఇలాంటి వస్త్రంలోనే ఉంచుతారు.

# 55 ఏండ్ల అభివృద్ధిని ఐదేండ్లలో సాధించాం!

### ఆర్థిక వ్యవస్థను 1.85 లక్షల కోట్ల డాలర్ల నుంచి 2.7 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాం

### ఈ ఏడాది లక్ష్యం 3 లక్షల కోట్ల డాలర్లు

**న్యూఢిల్లీ, జూలై 5:** 'మన ఆర్థిక వ్యవస్థ లక్ష కోట్ల డాలర్లకు చేరేందుకు 55 ఏండ్లు పట్టింది. కానీ మేము గత ఐదేండ్లలో మరో లక్ష కోట్ల డాలర్లను జతచేశాం. ఇప్పుడు మూడు లక్షల కోట్ల డాలర్లకు చేరుకోబోతున్నాం' అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 3 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.205 లక్షల కోట్లు) చేరుకుంటుందని, వచ్చే ఐదేండ్లలో ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలంటే నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టాల్సి ఉంటుందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఐదేండ్ల క్రితం 1.85 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న మన ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు 2.7 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుందని, వచ్చే ఐదేండ్లలో ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేరుకునే సామర్థ్యం మనకుందని చెప్పారు. దేశ ప్రజలు కఠినంగా శ్రమిస్తేనే ఐదు లక్షల కోట్ల డాలర్ల లక్ష్యాన్ని చేరుకోగలమని మంత్రి స్పష్టం చేశారు. 'భారత ఆర్థిక స్థితి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంటుంది. ప్రపంచంలో ప్రస్తుతం మనం ఆరో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నాం. ఐదేండ్ల క్రితం మనం 11వ స్థానంలో ఉన్నాం. కొనుగోలు శక్తి సమానతలో చూస్తే భారత్ ఇప్పటికే చైనా, అమెరికాల తరువాత మూడో స్థానంలో ఉంది. మన ఆర్థిక వ్యవస్థను ఐదు లక్షల కోట్ల డాలర్లకు, అంతకు మించిన స్థితికి చేర్చాలంటే పలు నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది' అని సీతారామన్ పేర్కొన్నారు. గత ఐదేండ్లలో ప్రభుత్వం పరోక్ష పన్నులు, బ్యాంకుల దివాళాను నిరోధించడం, రియల్ ఎస్టేట్ వంటి అంశాల్లో భారీ సంస్కరణలు అమలు చేసిందని చెప్పారు. ఓవైపు పార్లమెంట్ ఈ సంస్కరణలను చేపడుతుండగా, మరోవైపు ముద్రా రుణాల ద్వారా సామాన్యుల జీవితాలలో పరివర్తన వచ్చిందన్నారు. 'సామాన్యుల వంటగదులు పొగరహితంగా మారాయి, వారికి విద్యుత్ కనెక్షన్ లభించింది, ఇండ్లలో మరుగుదొడ్ల నిర్మాణం ద్వారా మహిళలకు గౌరవం లభించింది' అని చెప్పారు. ఈ సంస్కరణలను కొనసాగించాలంటే మౌలిక సదుపాయాలపై, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ మీద, అలాగే చిన్న, మధ్య తరహా సంస్థల్లో ఉపాధి సృష్టిపై భారీగా పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రైవేట్ రంగంలోని చిన్న, మధ్య తరహా లేక భారీ పరిశ్రమలు విశేష పాత్రను పోషించాయని చెప్పారు. నేడు భారతీయ పరిశ్రమలే ఉపాధిని సృష్టిస్తున్నాయని అన్నారు. పరస్పర విశ్వాసంతో భారత్ గెలుపొందగలదని, వేగవంతంగా స్థిరమైన జాతీయ అభివృద్ధిని సాధించగలమని అన్నారు.

**5 లక్షల కోట్ల డాలర్లను చేరాలంటే నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం**

**బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్**


శుక్రవారం పార్లమెంట్‌లో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

#### పథకాలు జోరందుకుంటాయి

ఎన్డీఏ ప్రభుత్వం మొదటి పర్యాయంలోనే నవ భారత నిర్మాణానికి నాంది పలికిందని, ఇప్పుడు పథకాల అమలు జోరందుకుంటుందని నిర్మలా సీతారామన్ చెప్పారు. పథకాల ఫలాలు చివరి వ్యక్తికి కూడా అందాలన్న ప్రయత్నం ఫలించిందని అన్నారు. మోదీ ప్రభుత్వం పని చేసేదిగా రుజువు చేసుకున్నదని, అందువల్లనే ప్రజలు గత లోక్‌సభ ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ప్రసంగం అనంతరం నిర్మలాసీతారామన్ మీడియాతో మాట్లాడుతూ పదేండ్ల దీర్ఘకాలిక విజన్‌తో బడ్జెట్‌ను రూపొందించామని చెప్పారు.

### నిర్మలా సీతారామన్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు

- లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందడానికి భారత్‌కు 55 ఏండ్లు పట్టింది. ప్రజల్లో ఆశలు, ఆకాంక్షలు నెలకొన్న స్థితిలో మేము కేవలం ఐదేండ్లలో మరో లక్ష కోట్ల డాలర్లను జతచేశాం. ఓవైపు పరివర్తన సంస్కరణలకు బాట వేస్తూనే మరోవైపు సామాన్యులకు సేవలందించాం. మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెట్టాల్సి ఉంది. దేశ ప్రజలు ప్రతి విషయంలో తేడాను గమనించారు. 'మజ్బూత్ దేశ్ కే లియే మజ్బూత్ నాగరిక్ (బలమైన దేశం కోసం బలమైన నాగరికులు)' అన్నదానిపైనే మా దృష్టిని కేంద్రీకరించాం.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుంది. ప్రపంచంలో మనం ఇప్పుడు ఆరో ఆర్థిక శక్తిగా ఉన్నాం. ఐదేండ్ల క్రితం మనం 11వ స్థానంలో ఉన్నాం. 'కార్య పురుష కరే నా లక్ష్యం సంపదాయతే' అని చాణక్యుడు నీతి సూత్రం చెప్పాడు. అనగా దృఢ చిత్తంతో మానవులు ప్రయత్నిస్తే.. లక్ష్యాన్ని తప్పకుండా సాధించగలరు.
- విమానయాన ఫైనాన్స్, లీజింగ్ రంగంలో చేరేందుకు భారత్‌కు ఇదే సరైన సమయం. అభివృద్ధికి ముఖ్యమైనది అనుసంధానం. చట్టబద్ధంగా లాభాలు సంపాదించే వారిని చిన్నచూపు చూడం. ఫలితాలనివ్వని విధానాలు రూపొందించే కాలం పోయింది. లైసెన్స్ వ్యవస్థకు చరమగీతం పాడాం. భారత సంస్థలే సంపద సృష్టికర్తలు.
- పెట్టుబడి మార్కెట్లను సామాన్యుల వద్దకు తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. ఎలక్ట్రానిక్ విధానంలో నిధులు సమకూర్చేందుకు సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలను స్టాక్ మార్కెట్‌లో చేరుస్తాం. తద్వారా ప్రజల సంక్షేమం కోసం పనిచేసే సామాజిక సంస్థలు పెట్టుబడులను సమకూర్చుకోగలుగుతాయి.
- తమిళ సంగం యుగంలోని పిసిరన్‌డైయార్ అనే కవి పురననూరు అనే గ్రంథంలో అప్పటి పాండ్య రాజు అరివుడై నంబికి చెప్పిన ఏనుగు కథను ఉటంకిస్తూ.. చిన్న భూభాగం నుంచి సేకరించిన కొద్దిపాటి బియ్యాన్ని వండి వడ్డిస్తే ఒక ఏనుగుకు సరిపోతుంది. కానీ అదే ఏనుగు వరి చేలలోకి వెళితే.. అది తినేదానికన్నా ఎక్కువగా పంటను కాళ్ల కింద నలిపేస్తుంది. ఆ ఏనుగులాగా ప్రభుత్వం ఎవరినీ తన కాళ్ల కింద వేసి నలిపేయాలనుకోవడం లేదు. వచ్చే ఐదేండ్లలో మౌలిక సదుపాయాల కోసం రూ.100 లక్షల కోట్లను ఖర్చు చేయనున్నాం.

# సంపన్నులపై సర్‌చార్జీ మోత

### ఏటా రూ.2 కోట్ల నుంచి 5 కోట్ల ఆదాయంపై 3 శాతం

### రూ.5 కోట్లు దాటితే 7 శాతానికి పెంపు

### బడ్జెట్‌లో ప్రతిపాదించిన కేంద్రం



**న్యూఢిల్లీ, జూలై 5:** సంపన్నులకు సర్‌చార్జీ మోత మోగింది. ఏటా రూ.2 కోట్ల నుంచి 5 కోట్ల మధ్య ఉన్న వ్యక్తిగత ఆదాయంపై 3 శాతం సర్‌చార్జీని కేంద్రం ప్రతిపాదించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను శుక్రవారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. శ్రీమంతులకు రెండు రకాల సర్‌చార్జీలను తెచ్చారు. రూ.5 కోట్ల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉన్నవారికి 7 శాతం సర్‌చార్జీ పడుతుందని స్పష్టం చేశారు. అయితే ఇతర ఆదాయం పన్ను (ఐటీ) చెల్లింపుదారుల ట్యాక్స్ రేట్లు, శ్లాబుల జోలికి మాత్రం వెళ్లలేదు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో సామాన్య, సగటు వేతన జీవులకు ఐటీలో మోదీ సర్కారు రిబేటును ప్రకటించిన విషయం తెలిసిందే. ఐటీ చట్టంలోని సెక్షన్ 87ఏ కింద రూ.5 లక్షల వరకు వార్షిక ఆదాయంపై రూ.12,500ల వరకు రిబేటును ఇచ్చింది. దీంతో రూ.5 లక్షలదాకా వార్షిక ఆదాయం ఉన్నవారు పన్ను పరిధిలో ఉండరు. అంతకుముందు రూ.2.50 లక్షల వరకే ఈ వెసులుబాటు ఉండేది. వృద్ధులకైతే రూ.3 లక్షలుగా ఉండేది. అలాగే సెక్షన్ 80సీలో భాగంగా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) వంటి వాటిల్లో పెట్టుబడులు, పిల్లల విద్యా వ్యయం, గృహ రిజిస్ట్రేషన్ల కోసం చెల్లించే స్టాంప్ సుంకంపై రూ.1.50 లక్షల వరకు మరో మినహాయింపును కల్పించారు.

#### టీడీఎస్ ఉండాల్సిందే

పన్ను పరిధిని పెంచడంలో భాగంగా ఏటా రూ.50 లక్షలకు మించి కాంట్రాక్టర్లు లేదా ప్రొఫెషనల్స్‌కు జరిపే అన్ని వ్యక్తిగత చెల్లింపులపై 5 శాతం టీడీఎస్‌ను ప్రతిపాదించారు సీతారామన్. పాన్‌ను ఉపయోగించి మాత్రమే ఈ ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్ (టీడీఎస్)ను డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఏటా కరెంట్ అకౌంట్‌లో రూ.కోటికి పైగా డిపాజిట్ చేస్తున్నవారు, విద్యుత్ బిల్లుల కోసం రూ.లక్షకుపైగా చెల్లింపులు జరుపుతున్నవారు, విదేశీ ప్రయాణాలకు రూ.2 లక్షలు వెచ్చిస్తున్నవారు తప్పక ఐటీ రిటర్నులను దాఖలు చేయాల్సి ఉంటుందని చెప్పారు.

#### కోటికిపైగా ఉపసంహరిస్తే పన్నే

ఒకే బ్యాంక్ ఖాతా నుంచి ఏటా రూ.కోటి అంతకుమించి నగదు ఉపసంహరణ చేస్తే పన్ను వేయాలని యోచిస్తున్నట్లు ఈ బడ్జెట్‌లో సీతారామన్ తెలిపారు. పెద్ద మొత్తంలో తరచూ నగదు ఉపసంహరణలు చేస్తూ అక్రమ నగదు నిల్వలకు పాల్పడేవారిపై విచారణలేగాకుండా బ్యాంకింగ్ క్యాష్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (బీసీటీటీ) తరహా లెవీని వేయాలనుకుంటున్నట్లు చెప్పారు.

### పాన్ తప్పనిసరికాదు

ఆదాయం పన్ను (ఐటీ) రిటర్నుల దాఖలుకు పర్మినెంట్ అకౌంట్ నెంబర్ (పాన్) తప్పనిసరి కాదని నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా ప్రకటించారు. ఆధార్ ఉన్నా ఐటీ ఫైలింగ్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. దీంతో చాలామందికి ఐటీ రిటర్నుల అవకాశాన్ని కల్పించినట్లైంది. ఆదాయం పన్ను పరిధిలోకి రాకున్నా రుణాల కోసం కొన్ని బ్యాంకింగ్ సంస్థలు ఐటీ రిటర్నులను కోరుతున్న విషయం తెలిసిందే. అలాంటి వారందరికీ ఈ నిర్ణయం కలిసి రానున్నది.

### 99.3 శాతం కార్పొరేట్లకు ఊరట

#### వార్షిక టర్నోవర్ రూ.400 కోట్లున్న సంస్థలకూ 25 శాతం పన్ను

**న్యూఢిల్లీ, జూలై 5:** కార్పొరేట్ వర్గాల్లో మరికొందరికి కార్పొరేట్ పన్ను నుంచి ఉపశమనాన్ని కలిగించారు నిర్మలా సీతారామన్. శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.400 కోట్లదాకా వార్షిక టర్నోవర్ కలిగిన కార్పొరేట్ సంస్థలకు 25 శాతం పన్నే పడుతుందని ప్రకటించారు. ప్రస్తుతం రూ.250 కోట్ల వరకు వార్షిక టర్నోవర్ ఉన్న సంస్థలకే కార్పొరేట్ ట్యాక్స్ 25 శాతంగా ఉన్నది. తాజా ప్రతిపాదనతో దేశంలో 99.3 శాతం కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూరిందని, ఇక కేవలం 0.7 శాతం సంస్థలే 30 శాతం కార్పొరేట్ పన్నును చెల్లించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు.

#### రూ.4 వేల కోట్ల ఆదాయం దూరం

టర్నోవర్ పరిమితిని పెంచి కార్పొరేట్ పన్ను ప్రయోజనాన్ని మరింత మందికి చేర్చడం వల్ల ప్రభుత్వానికి ఏటా రూ.4,000 కోట్ల ఆదాయం దూరమవుతున్నదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు చెబుతున్నాయి. దేశంలోని మెజారిటీ సంస్థలకు ఈ నిర్ణయం లాభిస్తుందని, బడా కార్పొరేట్లకు మాత్రమే 30 శాతం పన్ను పడుతుందని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ తెలిపారు.

# రైల్వేకి రూ.65,837 కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రస్తుతం రైల్వేశాఖ వ్యయం రూ.1.60 లక్షల కోట్లు ఉండగా, తాజా బడ్జెట్‌లో రూ.65,837 కోట్లు కేటాయిస్తున్నట్టు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ మొత్తంలో రూ.7,255 కోట్లతో కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు, రూ.2,200 కోట్లతో గేజ్ మార్పు, రూ.700 కోట్లతో డబ్లింగ్, రూ.6,114 కోట్లు రోలింగ్ స్టాక్, రూ.1,750 కోట్లు టెలికాం, సిగ్నలింగ్ వ్యవస్థ కోసం కేటాయించినట్టు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం రూ.3,422.57 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు పేర్కొన్నారు. గత ఏడాది ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం రూ. 1,657 కోట్లు కేటాయించారు. గత ఏడాది రైల్వేవ్యయం రూ.1.48 లక్షల కోట్లు ఉండగా, రూ.55,088 కోట్లు కేటాయించారు. నిర్భయ సహాయనిధి కోసం రూ.267 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం రైల్వేశాఖకు ఏటా అయ్యే వ్యయం తలకు మించిన భారంగా మారింది. వేతనాల కోసమే రూ.86,554.31 కోట్లు వెచ్చిస్తున్నారు.

### నమ్మకం, సాధికారత కలిగిన బడ్జెట్

బడ్జెట్ అద్భుతంగా ఉన్నది. రైతులను సంపన్నులను చేయాలని, పేదలు గౌరవప్రదంగా జీవించాలని, మధ్యతరగతి వారికి తగిన న్యాయం చేయాలని, భారతీయ సంస్థలకు కొత్త ఊపిరి పోయాలన్న ప్రధాని నరేంద్రమోదీ విజన్‌ను ఈ బడ్జెట్ ప్రతిబింబిస్తున్నది. రాబోయే సంవత్సరాల్లో భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకునేందుకు ఈ బడ్జెట్ కొత్త స్ఫూర్తి నింపుతుంది. ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ భవిష్యత్‌కు మార్గనిర్దేశనం చేయనుంది. ఇది వివిధ రంగాల్లో పౌరుల వృద్ధికి కొత్త మార్గం చూపనున్నది. దేశంలోని ప్రతి ప్రాంతానికి విద్యుత్ వెలుగులు అందేలా, ప్రతి పౌరునికి నీరు చేరేందుకు ఈ బడ్జెట్ ఓ వేదికగా నిలువనున్నది. భారత్ మరింత శక్తివంతమైన స్టార్టప్‌హబ్‌గా మారేందుకు దోహదం చేయనున్నది. ఇది నమ్మకం, సాధికారత కలిగిన బడ్జెట్.

– బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

### 'కొత్త సీసాలో పాత సారా' ఈ బడ్జెట్

కేంద్రం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పాత హామీల పునరుక్తి. బీజేపీ వారు నవభారత్ అని మాట్లాడుతున్నప్పటికీ.. ఇదంతా కొత్త సీసాలో పాత సారాలాంటింది. ప్రభుత్వం బడ్జెట్‌లో ఎలాంటి కొత్త కార్యక్రమాలను ప్రకటించలేదు. ఉపాధి కల్పన విషయంలో ఎలాంటి ప్రణాళిక లేదు. వ్యవసాయ, కార్మిక రంగాలకు ఏమివ్వాలనే విషయంలోనూ స్పష్టతలేదు.

– కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి

# అనూహ్యమైన ఎదుగుదల

### నిర్మలాసీతారామన్ ప్రస్థానం..




నిర్మలా సీతారామన్ 1959 ఆగస్టు 18న తమిళనాడులోని మదురైలో జన్మించారు. తల్లి సావిత్రి, తండ్రి నారాయణన్ సీతారామన్. తండ్రి రైల్వే ఉద్యోగి కావడంతో ఆమె బాల్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గడిచింది. మద్రాస్, తిరుచిరాపల్లిలో ఆమె పాఠశాల విద్యాభ్యాసం పూర్తిచేశారు. తిరుచిరాపల్లిలోని సీతారామ రామస్వామి కళాశాల నుంచి బ్యాచిలర్ డిగ్రీ, ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ, ఎంఫిల్ పట్టా పొందారు. తెలుగువాడైన పరకాల ప్రభాకర్‌ను 1986లో ఆమె పెండ్లి చేసుకున్నారు. లండన్‌లోని రెజెంట్ స్ట్రీట్‌లో ఓ గృహోపకరణాల షాపులో ఆమె సేల్స్‌పర్సన్‌గా పనిచేశారు. అనంతరం అగ్రికల్చర్ ఇంజినీర్స్ అసోసియేషన్‌లో ఎకనమిస్ట్ అసిస్టెంట్‌గా సేవలందించారు. బీబీసీలో నూ కొంత కాలం పనిచేశారు. 2008 లో బీజేపీలో చేరిన సీతారామన్.. 2010లో పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. 2014లో బీజేపీ అధికారంలోకి రావడంతో ప్రధాని మోదీ ఆమెను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. వాణిజ్య పరిశ్రమల శాఖ సహాయ (స్వతంత్ర హోదా) మంత్రిగా నియమించారు. ఆ తర్వాత 2017లో నాటి రక్షణ మంత్రి మనోహర్ పారికర్ గోవా ముఖ్యమంత్రిగా వెళ్లడంతో ఆ పదవి ఈమెను వరించింది. ఈ ఏడాది బీజేపీ రెండోసారి అధికారంలోకి రావడంతో సీతారామన్‌కు ఆర్థిక శాఖను అప్పగించారు.

### కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తొలి మహిళగా..

# ఇందిరాగాంధీ పేరిట రికార్డు

### తొలి పూర్తిస్థాయి మహిళా ఆర్థికమంత్రిగా నిర్మలాసీతారామన్

#### అత్యధికంగా పదిసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన మొరార్జీదేశాయ్



**న్యూఢిల్లీ, జూలై 5:** స్వతంత్ర్య భారతదేశ చరిత్రలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి మహిళా ఆర్థికమంత్రిగా నిర్మలాసీతారామన్ చరిత్ర సృష్టించారు. ప్రధాని నరేంద్ర మోదీ రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన తర్వాత నిర్మలాసీతారామన్‌ను ఆర్థికశాఖ మంత్రిగా నియమించడంతో 2019-2020 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఆమెకు లభించింది. గతంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1970-71వ ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తొలి మహిళగా రికార్డులకెక్కారు. అప్పటి ఆర్థికశాఖ మంత్రి మొరార్జీదేశాయ్ తన పదవికి రాజీనామాచేసిన నేపథ్యంలో అప్పుడు ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ ఆ శాఖను కూడా తన వద్దే ఉంచుకొన్నారు. మొరార్జీదేశాయ్ అత్యధికంగా పదిసార్లు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం విశేషం. అంతకుముందు మన్మోహన్‌సింగ్, యశ్వంత్‌సిన్హా, అరుణ్ జైట్లీ ఐదేసిసార్లు, ప్రణబ్‌ముఖర్జీ నాలుగు సార్లు, జశ్వంత్‌సింగ్ ఒకసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రధాని నరేంద్రమోదీ ఏర్పాటుచేసిన తొలి ప్రభుత్వంలో అరుణ్‌జైట్లీ మొత్తం ఐదుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టగా.. అనారోగ్యం కారణంగా మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేకపోయారు. ఎన్నికల ముందు మధ్యంతర బడ్జెట్‌ను పీయూష్‌గోయల్ ప్రవేశపెట్టారు.



# బడ్జెట్ 2019-20

## ఉజాల యోజన

- ఉజాల యోజన ద్వారా దేశవ్యాప్తంగా 35కోట్ల ఎల్ఈడీ బల్బుల పంపిణీ
- ఎల్ఈడీ బల్బుల ద్వారా రూ.80వేల కోట్ల విలువైన విద్యుత్ ఆదా

## ముద్ర రుణం

- స్వయంసహాయ బృందాలకు కూడా ముద్ర యోజన వర్తింపు
- ప్రతి బృందంలో ఒక్కో మహిళకు రూ.లక్ష వరకు ముద్ర రుణం

## అన్నింటికీ ఒకే కార్డు

- రహదారి, రైల్వే ప్రయాణాలకు ఉపయోగపడేలా ఒకే కార్డు
- ఆ కార్డుతో ఏటీఎంలలో నగదు తీసుకునే సదుపాయం






శుక్రవారం ఢిల్లీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని భారీ తెరపై వీక్షిస్తున్న పారిశ్రామికవేత్తలు



# బంగారం భగ.. భగ

- ఒకేరోజు రూ.590 పెరిగిన ధర
- హైదరాబాద్‌లో రూ.350 ప్రియం
- దిగుమతి సుంకం 2.5% పెంపు



**న్యూఢిల్లీ, జూలై 5:** బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న అతి విలువైన లోహాలపై దిగుమతి సుంకాన్ని మరో 2.5 శాతం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడమే ఆలస్యం దేశవ్యాప్తంగా ధరలు అమాంతం పెరిగాయి. దేశరాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర ఒకే రోజు రూ.590 పెరిగి రూ.34,800 పలికింది. హైదరాబాద్‌లో పసిడి ధర రూ.350 ఎగబాకి రూ.34,500కి చేరుకోగా, కిలో వెండి ధర రూ.100 అందుకొని రూ.41 వేలుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో పసిడి దిగుమతులపై సుంకాన్ని 10 శాతం నుంచి 12.5 పెంచుతున్నట్లు ప్రకటించింది. కస్టమ్స్ సుంకం పెంపుతో ప్రస్తుతం ధరలు పెరిగినప్పటికీ పసిడి వినియోగంపై ఎలాంటి ప్రభావం చూపబోదని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర జైన్ తెలిపారు. దిగుమతి సుంకాన్ని తగ్గించాలని ఆభరణాల వర్తకుల డిమాండ్‌ను కేంద్రం పెడచెవిన పెట్టినట్లు అయింది. వాణిజ్య మంత్రిత్వ శాఖ కూడా దిగుమతి సుంకాన్ని తగ్గించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖకు సూచించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో పసిడి దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 3 శాతం తగ్గి 32.8 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కరెంట్ ఖాతా లోటును(క్యాడ్) కట్టడి చేయాలనే ఉద్దేశంతో అతి విలువైన లోహాల వాడకాన్ని నిరుత్సాహ పరుచేందుకుగాను కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది. 2017-18లో 33.7 బిలియన్ డాలర్ల విలువైన పసిడిని దిగుమతి చేసుకున్న భారత్..అంతక్రితం ఏడాదిలో 27.5 బిలియన్ డాలర్లు, 2015-16లో 31.8 బిలియన్ డాలర్ల పసిడి వచ్చిచేరింది. గతేడాది దేశంలోకి 982 టన్నుల బంగారం దిగుమతి అయింది. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,413 డాలర్ల వద్ద ఉండగా, వెండి 15.22 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

# రూ.1,05,000 కోట్లు

## ఈ ఏడాదిలో పీఎస్‌యూల వాటా విక్రయ లక్ష్యం

## 51 శాతానికి మించి తగ్గే అవకాశం లేదన్న ఆర్థికమంత్రి

**న్యూఢిల్లీ, జూలై 5:** ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడంలో భాగంగా ఈ ఏడాది పలు సంస్థల్లో వాటాలను విక్రయించడానికి సిద్ధమైంది కేంద్ర ప్రభుత్వం. ఈ ఏడాది పలు సంస్థల్లో వాటాలను విక్రయించడం ద్వారా రూ.1.05 లక్షల కోట్ల మేర నిధులను సేకరించాలనుకుంటున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎయిర్ ఇండియాతోపాటు 28 ఇతర కంపెనీల్లో వాటాను విక్రయించాలనుకుంటున్నట్లు చెప్పారు. దేశ చరిత్రలో ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో నిధులను సేకరించాలనుకోవడం ఇదే తొలిసారి కానున్నది. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో అంచనావేసిన రూ.90 వేల కోట్ల కంటే ఇది అధికం. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.80 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, రూ.85 వేల కోట్లను సేకరించింది. 2017-18లోనూ లక్ష్యానికి మించి లక్ష కోట్ల రూపాయలను సమీకరించి రికార్డు నెలకొల్పింది. ముఖ్యంగా హెచ్‌పీసీఎల్‌లో 51.11 శాతం వాటాను ఓఎన్‌జీసీ కొనుగోలు చేయడంతో సమకూరిన రూ.36,915 కోట్లు ఇందుకు దోహదం చేశాయి. బడ్జెట్‌లో రూ.72,500 కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఆ తర్వాతి క్రమంలో దీనిని లక్ష కోట్ల రూపాయలకు పెంచింది. గతేడాది భారత్ 22 ఈటీఎఫ్‌లను జారీ చేయడం ద్వారా రూ.18,729.85 కోట్లను సేకరించింది. వాటాను విక్రయించనున్నప్పటికీ పీఎస్‌బీలు ప్రభుత్వం చేతిలో ఉండే విధంగా అంటే 51 శాతం కంటే తక్కువ వాటాను విక్రయించే ఉద్దేశం లేదని మంత్రి స్పష్టంచేశారు.

### ఎఫ్‌పీఐల కేవైసీ సరళతరం

విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులకు(ఎఫ్‌పీఐ)లకు కేంద్ర ప్రభుత్వం మరింత ఊరటనిచ్చింది. కేవైసీ నిబంధనలను మరింత సరళతరం చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. స్టాక్ మార్కెట్లో లిస్టైన సంస్థల్లో ప్రజల వాటాను 25 శాతం నుంచి 35 శాతానికి పెంచుతూ నిర్మలా సీతారామన్ నిర్ణయం తీసుకున్నారు. కార్పొరేట్ బాండ్ మార్కెట్లో కూడా కీలక చర్యలు తీసుకోవడానికి రిజర్వు బ్యాంక్, సెబీలకు మంత్రి సూచించారు.

### త్వరలో కంపెనీల ఎంపిక

వాటా విక్రయానికి సంబంధించి ప్రభుత్వ రంగ సంస్థలను త్వరలో ఎంపిక చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రస్తుత దేశీయ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఎయిర్ ఇండియాలో వ్యూహాత్మక వాటా విక్రయానికి మొగ్గుచూపినట్లు చెప్పారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ..వచ్చే మార్చి నాటికి పీఎస్‌యూల్లో వాటా విక్రయం ద్వారా సేకరించాలనుకుంటున్న రూ.1.05 లక్షల కోట్లు చాలా వాస్తవికమైనదని అభిప్రాయపడ్డారు. డిజిన్వెస్ట్‌మెంట్ కూడా ఒక సంస్కరణల ఎజెండాలో భాగమేనని, ఆర్థిక వ్యవస్థ నిశ్చల స్థితిలో ఉండాలని కోరుకోవడం లేదని, ఇదే సమయంలో పీఎస్‌యూవీల్లో ప్రభుత్వ వాటా 51 శాతానికి తగ్గించాలనుకోవడం లేదని ఒక ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్లను జారీ చేయడం ద్వారా రూ.45 వేల కోట్లను సేకరించిన కేంద్రం..ఈసారి మరింత పెరిగే అవకాశం ఉన్నదన్నారు. ముఖ్యంగా రిటైల్ ఇన్వెస్టర్లకు తమ పెట్టుబడులు పెట్టడానికి ఈటీఎఫ్‌లే కీలకమని, వీటికి భారత్‌లో మంచి డిమాండ్ ఉండటంతో అనతికాలంలోనే వీరి పెట్టుబడులకు అధిక రిటర్నులు పంచనున్నట్లు చెప్పారు.




# సుంకాలతో రూ.25 వేల కోట్లు..

- సర్‌చార్జీతో రూ.12 వేల కోట్లు
- సీతారామన్ బడ్జెట్‌తో ఖజానాకు కిక్కు

**న్యూఢిల్లీ, జూలై 5:** బడ్జెట్‌లో ప్రతిపాదించిన కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు, సర్‌చార్జీతో కేంద్రానికి రూ.37 వేల కోట్ల ఆదాయం రానున్నది. సిగరెట్లు తదితర ఉత్పత్తులపై పెరిగే ఎక్సైజ్, కస్టమ్స్ సుంకంతో రూ.25,000 కోట్లు, సంపన్నులపై సర్‌చార్జీతో దాదాపు రూ.12,000 కోట్ల అదనపు ఆదాయం రానున్నది. రూ.2-5 కోట్ల మధ్య వార్షిక ఆదాయం ఉన్న శ్రీమంతులపై 3 శాతం సర్‌చార్జీ, రూ.5 కోట్లకుపైగా ఆదాయం ఉన్నవారిపై 7 శాతం సర్‌చార్జీ వేస్తామని శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీనివల్ల రూ.12,000 కోట్ల ఆదాయం రావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక ఫిల్టర్ సిగరెట్లపై వెయ్యికి రూ.5 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని బడ్జెట్‌లో సీతారామన్ వేశారు. నమిలే పొగాకు, జర్దా, ఇతరత్రా పొగాకు ఉత్పత్తులపైనా ఎక్సైజ్ సుంకాన్ని పెంచారు. జీడిపప్పు, పీవీసీ, వినీల్ ఫ్లోరింగ్, టైల్స్, ఆటో భాగాలు, మార్బుల్ శ్లాబులు, ఆప్టికల్ ఫైబర్ కేబుల్, సీసీటీవీ కెమెరాలు, ఐపీ కెమెరాలు, డిజిటల్, నెట్‌వర్క్ వీడియో రికార్డర్లపై ఎక్సైజ్ సుంకాన్ని వేశారు. పెట్రో ఉత్పత్తులపైనా ఎక్సైజ్ ట్యాక్స్, రోడ్, ఇన్‌ఫ్రా సెస్సు వేశారు. ఇదిలావుంటే 'కొన్నింటిపై సుంకాలను పెంచాం. మరికొన్నింటిపై తగ్గించాం. ముడి సరుకులు, క్యాపిటల్ గూడ్స్‌పై కస్టమ్స్ సుంకాలను తగ్గించాం' అని రెవిన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే తెలిపారు. కార్పొరేట్ ట్యాక్స్ టర్నోవర్ పరిమితిని పెంచామని, దీనివల్ల ప్రభుత్వానికి ఈ ప్రత్యక్ష పన్ను ఆదాయం రూ.6 వేల కోట్ల నుంచి 7 వేల కోట్లకు పరిమితమైందని వివరించారు.

# ఆర్బీఐ నుంచి రూ.90 వేల కోట్ల డివిడెండ్!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిజర్వు బ్యాంక్ నుంచి డివిడెండ్ రూపంలో రూ.90 వేల కోట్లు ఆశిస్తున్నట్లు ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ తెలిపారు. అంతక్రితం ఏడాది చెల్లించిన రూ.68 వేల కోట్లతో పోలిస్తే 32 శాతం అధికం. మధ్యంతర డివిడెండ్ రూపంలో కేంద్రానికి గతేడాది రూ.28 వేల కోట్లు చెల్లించింది. 2015-16లో రూ.65,896 కోట్లు చెల్లించిన సెంట్రల్ బ్యాంక్..2017-18లో రూ.40,659 కోట్లు. వార్షిక సమావేశం తర్వాత ఆర్బీఐ డివిడెండ్ చెల్లింపులుపై నిర్ణయం తీసుకుంటున్నది. జూలై-జూన్ మధ్యకాలాన్ని ఆర్థిక సంవత్సరంగా వ్యవహరిస్తున్న రిజర్వు బ్యాంక్..డివిడెండ్‌ను మాత్రం ఆగస్టులో జరుగనున్న వార్షిక సమావేశం తర్వాత ప్రకటించనున్నది. సెంట్రల్ బ్యాంక్ వద్ద మిగులు నిధులు ఎక్కువగా ఉండటంతో వీటిపై దృష్టి సారించింది కేంద్ర ప్రభుత్వం. తాజా బడ్జెట్‌లోనూ డివిడెండ్ రూపంలో భారీగా చెల్లింపులు జరుపాలని ఒత్తిడి తీసుకొస్తున్నది. జాతీయ, ఆర్థిక సేవల సంస్థలకు ఆర్బీఐ రూ.1.06 లక్షల కోట్ల నిధులను వెచ్చించింది. అంతక్రితం ఏడాది రూ.74,140.37 కోట్లుగా ఉన్నది. ఆర్థిక మూలధన ఫ్రేమ్‌వర్క్(ఈసీఎఫ్) సమీక్షించడానికి రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యులు కలిగిన కమిటీని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. త్వరలో ఈ కమిటీ తుది నివేదికను సమర్పించనున్నది. ఈ కమిటీలో మాజీ డిప్యూటీ గవర్నర్ రాకేశ్ మోహన్, ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్, ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ ఎన్ఎస్ విశ్వనాథన్‌లతోపాటు ఇద్దరు ఆర్బీఐ సెంట్రల్ బోర్డు సభ్యులు భరత్ దోషి, సుధీర్‌లు ఉన్నారు.




# బ్యాంకులకు రూ.70 వేల కోట్లు

- 8 బ్యాంకులను కుదించేయోచనలో కేంద్రం




ప్రభుత్వరంగ బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు రుణ వితరణ సామర్థ్యాన్ని పెంచడానికి రూ.70 వేల కోట్ల స్థాయిలో నిధులను కేటాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. మొండి బకాయిల భరతం పట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దివాలా చట్టంతో గడిచిన నాలుగేండ్లలో రూ.4 లక్షల కోట్ల వసూలయ్యాయని, ఇదే క్రమంలో గతేడాది లక్ష కోట్ల రూపాయాలు బ్యాంకులు వసూలు చేసినట్లు లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మంత్రి చెప్పారు. గత కొన్ని సంవత్సరాలుగా సింగిల్ డిజిట్‌లో ఉన్న క్రెడిట్ వృద్ధిరేటు గతేడాది రెండంకెల 13 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నదని ఆమె వ్యాఖ్యానించారు. ఇప్పటికే పలు బ్యాంకులను విలీనం చేసిన కేంద్రం..తాజాగా వీటిని 8కి తగ్గించడానికి ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నది. ఇదివరకే బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)లో ఐదు అనుబంధ బ్యాంకులను విలీనం చేసిన కేంద్రం..ఇటీవల బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ)లో విజయ, దేనా బ్యాంకులను కలిపేసింది. దీంతో పీఎస్‌బీల సంఖ్య 19కి తగ్గింది. వీటిని సగానికి సగం తగ్గించాలనుకుంటున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో మరో బ్యాంకుల విలీనానికి సమయం ఆసన్నమైంది. 2008 నుంచి 2014 మధ్యకాలంలో పీఎస్‌బీల రుణాలు రూ.18 లక్షల కోట్ల నుంచి రూ.52 లక్షల కోట్లకు పెరిగాయి. బ్యాంకులు ఇష్టం వచ్చినట్లు రుణాలు ఇవ్వడంపై రిజర్వు బ్యాంక్ అభ్యంతరాలను వ్యక్తంచేసింది.

# కుదేలైన సెన్సెక్స్

## 395 పాయింట్లు నష్టపోయిన సూచీ

### నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్.. మదుపరులకు రుచించని బడ్జెట్

**ముంబై, జూలై 5** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్ స్టాక్ మార్కెట్లకు ఏ మాత్రం రుచించలేదు. ఈక్విటీ మార్కెట్లో ప్రవేశించిన సంస్థల్లో ప్రజల వాటాను 25 శాతం నుంచి 35 శాతానికి పెంచుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకున్న నిర్ణయం మార్కెట్లలో అలజడి సృష్టించింది. ప్రారంభంలో 40 వేల పాయింట్ల పైకి చేరుకున్న బీఎస్ఈ సెన్సెక్స్.. బడ్జెట్ ప్రారంభించగానే తీవ్ర ఆటుపోటులకు గురైంది. ఒక దశలో 500 పాయింట్లకు పైగా పతనం చెందిన సెన్సెక్స్ వారాంతం మార్కెట్ ముగిసే సమయానికి 394.67 పాయింట్లు లేదా 0.99 శాతం తగ్గి 39,513.39 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ కూడా మరో 135.60 పాయింట్లు(1.14 శాతం) కోల్పోయి 11,811.15 వద్ద స్థిరపడింది. స్టాక్‌మార్కెట్లో లిస్టైన 1,174 సంస్థల్లో ప్రజల వాటా 25 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని నిర్మలా సీతారామన్ ప్రతిపాదన మదుపరుల్లో ఆందోళనను పెంచింది. ఈ పది శాతానికి సమానమైన రూ.3.87 లక్షల కోట్ల వాటాను విక్రయించాల్సి ఉంటుందని సెంట్రమ్ బ్రోకింగ్ నివేదిక అంచనావేస్తున్నది. మరోవైపు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు ఊరటకల్పిస్తూ కేవైసీ ప్రమాణాలను మరింత సరళతరం చేస్తూ తీసుకున్న నిర్ణయం మార్కెట్లకు అచ్చిరాలేదు. గడిచిన నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్ పడినట్లు అయింది. ఈవారంలో సెన్సెక్స్ 118.75 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 22.30 పాయింట్లు లాభపడింది. ఫిబ్రవరి1న మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు సెన్సెక్స్ 3,043.96 పాయింట్లు లేదా 8.34 శాతం లాభపడగా, అదే నిఫ్టీ 917.50 పాయింట్లు లేదా 8.42 శాతం ఎగబాకింది.

### ఒత్తిడిలో ఆర్థిక రంగ షేర్లు

ఆర్థిక రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. బడ్జెట్‌లో తీసుకున్న కీలక నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థకు ఇబ్బంది తలపెట్టనున్నాయన్న అంచనాలు మదుపరుల్లో నెలకొన్నది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా యెస్ బ్యాంక్ షేరు 8.36 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. వీటితోపాటు ఎన్‌టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, వేదాంతా, సన్ ఫార్మా, టీసీఎస్‌ల షేర్లు 4.81 శాతం వరకు పతనం చెందాయి. మరోవైపు ఇండస్‌ఇండ్ బాయక్, కోటక్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్‌ల షేర్లు 2.16 శాతం వరకు లాభపడ్డాయి. ఈక్విటీ మార్కెట్లో లిస్టైన సంస్థల్లో ఇంకా కొన్ని సంస్థల్లో ప్రజల కోసం షేర్లు కేటాయించకపోవడంతో నియంత్రణ మండలి సెబీ పలుమార్లు హెచ్చరించినప్పటికీ సంస్థలు పట్టించుకోకపోవడంతో కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. ద్రవ్య లోటు లక్ష్యం 3.3 శాతానికి చేరుకునే అవకాశాల లేవని, మరోవైపు డిజిన్వెస్ట్‌మెంట్ రూ.1.05 లక్షల కోట్లకు చేరుకునే అవకాశాలున్నాయని మార్కెట్ పండితులు అంచనావేస్తున్నారు. రంగాల వారీగా చూస్తే మెటల్, రియల్టీ, ఇంధనం, వాహన, ఐటీ, బేసిస్ మెటిరియల్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఇండస్ట్రీయల్, ఎనర్జీ, క్యాపిటల్ గూడ్స్ రంగాల సూచీ నాలుగు శాతం వరకు పడిపోయాయి. కేవలం ఎఫ్ఎంసీజీ, బ్యాంకెక్స్, టెలికం షేర్లు మదుపరులను ఆకట్టుకన్నాయి.

### ఆభరణాల షేర్లు ఢమాల్

పసిడి దిగుమతులపై ఎక్సైజ్ సుంకాన్ని 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచుతూ బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయం ఆభరణాల స్టాక్‌లపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో ఈ రంగానికి చెందిన కంపెనీ షేర్లు 7 శాతం వరకు పతనం చెందాయి. తంగమయిల్ జ్యూవెల్లరీ షేరు ధర ఏకంగా 7.43 శాతం తగ్గి రూ.312.90 వద్ద ముగిసింది. పీసీ జ్యూవెల్లరీ షేరు 4.95 శాతం పడిపోగా, టీబీజెడ్ 3 శాతం, గోల్కొండ డైమండ్స్ అండ్ జ్యూవెల్లరీ 2 శాతం, టైటాన్ 1 శాతం మేర తగ్గాయి.




### రూ.2.22 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్ల భారీ పతనంతో రూ.2.22 లక్షల కోట్ల మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. ఐపీవోకి వచ్చిన సంస్థల్లో ప్రజల వాటాను పెంచాలని బడ్జెట్ ప్రతిపాదనతో మదుపరుల్లో ఆందోళనను మరింత పెంచింది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో స్టాక్ మార్కెట్లో లిస్టైన సంస్థల నికర విలువ రూ.2,22,579.67 కోట్లు తగ్గి రూ.1,51,35,495.86 కోట్లకు పడిపోయింది. క్యాపిటల్ మార్కెట్లోకి వచ్చిన సంస్థల్లో ప్రజల వాటా కనీసం 25 శాతం నుంచి 35 శాతానికి పెంచే ప్రతిపాదన, ఇతర నిర్ణయాలు మార్కెట్లకు రుచించలేదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లీ తెలిపారు.

### ఎన్ఆర్ఐలకు వెసులుబాటు

విదేశాల్లో ఉంటున్న ప్రవాసభారతీయులకు కేంద్ర ప్రభుత్వం మరిన్ని వెసులుబాటు కల్పించింది. ముఖ్యంగా ఎన్ఆర్ఐల నుంచి పెట్టుబడులు పెంచే లక్ష్యంతో బడ్జెట్‌లో కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో దేశీయ స్టాక్ మార్కెట్ లేదా ఇతర రూపాల్లో విదేశీ సంస్థాగత మదుపరుల(ఎఫ్ఐఐ) దేశంలో సులభంగా పెట్టుబడులు పెట్టవచ్చును. వీరికి అనేక పెసులుబాటు కల్పించింది. తమకు నచ్చినప్పుడు పెట్టుబడులను ఉపసంహరించుకునే అవకాశం కూడా కల్పించింది. తాజాగా ఇవే నిబంధనలను ప్రవాసులకు వర్తించ చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఎన్ఆర్ఐల పెట్టుబడులను విదేశీ పోర్ట్ ఫోలియోగానే గుర్తిస్తామన్నారు. ప్రస్తుతం భారత క్యాపిటల్ మార్కెట్లో ఎన్ఆర్ఐ పెట్టుబడులు చాలా తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారిని ప్రోత్సహించడానికి విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ల గుర్తిస్తామన్నారు.

## ఎవరేమన్నారు..!



బడ్జెట్ నిరాశపరిచింది. ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్ రంగాలకు ఆశించిన స్థాయిలో నిధులను కేటాయించలేదు. స్టార్టప్‌లకు, విద్యా రంగాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అనిపించింది. పరిశోధన రంగాన్ని పెడచెవిన పెట్టారు.

**- సతీష్ రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్ చైర్మన్**



వచ్చే ఐదేండ్ల కాలాన్ని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వీటితో ఆరోగ్యరంగానికి అరకొర నిధులు కేటాయించడం మినహా అన్ని రంగాలకు భారీగా కేటాయించారు.

**- ప్రతాప్ సీ రెడ్డి, అపోలో హాస్పిటల్స్ గ్రూపు చైర్మన్**




కార్పొరేట్ పన్ను పరిమితిని రూ.250 కోట్ల నుంచి రూ.400 కోట్లకు పెంచడాన్ని స్వాగతిస్తున్నాం. గృహ కొనుగోలుదారులకు ఊరటకల్పిస్తూ తీసుకున్న నిర్ణయంతో రియల్ ఎస్టేట్ రంగం భారీ వృద్ధిని నమోదు చేసుకోనున్నది. అలాగే సిమెంట్, స్టీల్, నిర్మాణ రంగాలు కూడా వృద్ధి బాటపట్టనున్నాయి.

**- డీ రాజు, సీఐఐ తెలంగాణ చైర్మన్**

# ఎఫ్‌డీఐలకు రాచబాట

## మీడియా, ఏవియేషన్, బీమా, సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలోకి అనుమతి

**న్యూఢిల్లీ, జూలై 5:** విదేశీ పెట్టుబడులను ఆకట్టుకోవడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. విమానయానం, బీమా, యానిమేషన్ మీడియా, సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలోకి మరిన్ని ఎఫ్‌డీఐలను ఆకట్టుకోవడానికి ప్రస్తుతం ఉన్న నియంత్రణలను ఎత్తివేయాలనుకుంటున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు ఆరు శాతం పెరిగి 64.37 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇతర దేశాలతో పోలిస్తే ఎఫ్‌డీఐలు ఆకట్టుకోవడంలో భారత్ దూసుకుపోతున్నదన్న మంత్రి..నూతన రంగంలోకి పెట్టుబడులు పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీంట్లో భాగంగా ఆయా రంగానికి చెందిన నిపుణుల నుంచి సమాచారం సేకరించిన తర్వాతనే పూర్తి స్థాయిలో అనుమతించాలనుకుంటున్నట్లు తెలిపారు. బీమా మధ్యవర్తి సంస్థల్లోకి 100 శాతం ఎఫ్‌డీఐలను అనుమతించాలని నిర్ణయించినట్లు, వీటితోపాటు సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలోకి కూడాఅనుమతించేదానిపై చర్చలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం బీమా రంగంతోపాటు ఇన్సూరెన్స్ బ్రోకింగ్, థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్స్ విభాగాల్లోకి 49 శాతం ఎఫ్‌డీఐల అనుమతివున్నది. ప్రపంచవ్యాప్తంగా బీమా వినియోగం 6.2 శాతంగా ఉండగా, అదే భారత్‌లో 3.4 శాతం మాత్రమే.




# ఆర్థిక వృద్ధే లక్ష్యం

## కేంద్ర బడ్జెట్‌పై పరిశ్రమ వర్గాలు

**న్యూఢిల్లీ, జూలై 5:** కేంద్ర బడ్జెట్‌ను దేశీయ పరిశ్రమ వృద్ధికారక బడ్జెట్‌గా అభివర్ణించింది. '2025కల్లా భారత ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరడానికి ఈ బడ్జెట్ చుక్కాని' అంటూ అభిప్రాయపడింది. ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ ప్రకటించిన తొలి బడ్జెట్.. దేశ జీడీపీ సామర్థ్యాన్ని పెంచడానికి కృషి చేస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. 'బౌండరీలను బాదడానికి బదులుగా సింగిల్ రన్‌లతో నిలకడగా స్కోరును పెంచే ప్రయత్నం సీతారామన్ చేశారు' అంటూ క్రికెట్ పరిభాషలో బడ్జెట్‌ను మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా అభివర్ణించారు. 'ఐదేండ్ల క్రితం 1.85 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న దేశ జీడీపీ.. ఇప్పుడు 2.7 లక్షల కోట్ల డాలర్లను తాకింది. రాబోయే ఐదేండ్లలో 5 లక్షల కోట్ల డాలర్లను చేరేలా ఈ బడ్జెట్ దోహదపడగలదు' అని అసోచామ్ అధ్యక్షుడు బీకే గోయెంకా అన్నారు. పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు రాజీవ్ తల్వార్ సైతం సీతారామన్ దీర్ఘకాల లక్ష్యాల సాధన దృష్టితోనే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని అభిప్రాయపడ్డారు. సీఐఐ అధ్యక్షుడు విక్రమ్ కిర్లోస్కర్ సైతం ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.




ఆషాఢం ఆఫర్ సేల్.. ఆనందం హోల్‌సేల్
అదృష్ట
ఆషాఢం
63 సేల్
అన్నిరకాల సరికొత్త వస్త్రాలపై
% వరకు తగ్గింపు
2 ఆరణి చెక్స్ శారీస్ ₹333
2 కుప్పాడం జరీ శారీస్ ₹444
2 మాస్టర్ కార్డ్ శారీస్ ₹555
2 విపుల్ కేటలాగ్ శారీస్ ₹666
*Conditions apply.
MENS
3 కేజువల్ షర్ట్స్ or
3 ఫార్మల్ షర్ట్స్ or
2 బ్రాండెడ్ జీన్స్ or
3 బ్రాండెడ్ ట్రౌజర్స్
₹999 మాత్రమే
WOMENS
లెగ్గింగ్స్ • కుర్తీస్
డ్రస్ మెటీరియల్స్
సల్వార్ సూట్స్
1+1 1+2
BOYS
టి-షర్ట్స్, షర్ట్స్,
3/4 పాంట్స్,
బాబా సూట్స్
1+2
GIRLS
ఫ్రాక్స్ కుర్తీస్
టాప్స్ లెగ్గింగ్స్
1+2
Designer Sarees | Fancy Sarees | Work Sarees | Chudidars | Ghagras
All Kinds of Kids Wear | Mens Readymades | Sherwanis | Kurtha Pyjamas
J.C.Brothers
THE FAMILY SHOPPING MALL
DILSUKHNAGAR - KUKATPALLY - ZAHEERABAD
Available All Leading Men's Fashion Brands
VAN HEUSEN
Allen Solly
Levi's
CLASSIC POLO
LOUIS PHILIPPE
mufti
WHITE HOUSE
PAN AMERICA
TWILLS
KILLER
DUKE
Arvind
OCM
LINEN CLUB
DIGJAM
Raymond
LINEN VOGUE
బంగారు గొలుసులు గాజుల పై ఫ్లాట్ 6 శాతం
₹1225/- తగ్గింపు
10 గ్రాముల 916 బంగారు ఆభరణాలపై
తరుగు - మజూరీ లేదు సిల్వర్ ఆర్టికల్స్ పై
₹1000/- అధికంగా పొందండి
పాత ఆభరణాల మార్పిడిపై 10 గ్రాములకు

ఆట
నమస్తే తెలంగాణ
క్రికెట్ సమరం
WORLD CUP
కరీంనగర్ | WWW.NTNEWS.COM | శనివారం 6 జూలై 2019 | 11

## పాయింట్ల పట్టిక

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1. ✓ | ఆస్ట్రేలియా | 8 | 7 | 1 | 0 | +1.00 | 14 |
| 2. ✓ | భారత్ | 8 | 6 | 1 | 1 | +0.81 | 13 |
| 3. ✓ | ఇంగ్లండ్ | 9 | 6 | 3 | 0 | +1.15 | 12 |
| 4. ✓ | న్యూజిలాండ్ | 9 | 5 | 3 | 1 | +0.17 | 11 |
| 5. | పాకిస్థాన్ | 9 | 5 | 3 | 1 | -0.43 | 11 |
| 6. | శ్రీలంక | 8 | 3 | 3 | 2 | -0.93 | 8 |
| 7. | బంగ్లాదేశ్ | 9 | 3 | 5 | 1 | -0.41 | 7 |
| 8. | దక్షిణాఫ్రికా | 8 | 2 | 5 | 1 | -0.08 | 5 |
| 9. | వెస్టిండీస్ | 9 | 2 | 6 | 1 | -0.22 | 5 |
| 10. | ఆఫ్ఘనిస్థాన్ | 9 | 0 | 9 | 0 | -1.32 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు, ✓- అర్హత

**వరల్డ్‌కప్‌లో నేడు**
భారత్ X శ్రీలంక - 3 గం.
ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా - 6 గం.

స్టార్ స్పోర్ట్స్‌లో

అత్యధిక పరుగులు **606** షకీబ్ (బంగ్లాదేశ్)

అత్యధిక వికెట్లు **24** స్టార్క్ (ఆస్ట్రేలియా)

# శిఖరాగ్రమే లక్ష్యం

## లంకతో భారత్ ఆఖరి పోరు

### మిడిల్‌పైనే కోహ్లీసేన దృష్టంతా

### విజయంతో ముగించాలని లంకేయుల ఆరాటం

**ప్రియమైన ప్రత్యర్థిపై మూడో ద్విశతకంతో రెచ్చిపోవాలని హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ఆశపడుతుంటే.. ఐదు అర్ధశతకాలు చేసినా.. ఇంకా ఏదో తక్కువైందనుకుంటున్న రన్‌మెషీన్ విరాట్ కోహ్లీ మూడంకెల మార్క్‌పై కన్నేశాడు. మిడిలార్డర్ సమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని మేనేజ్‌మెంట్ భావిస్తుంటే.. పంత్, పాండ్యా పవర్ హిట్టింగ్‌తో ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలనుకుంటున్నారు. పేసర్లు బెంబేలెత్తిస్తున్న తరుణంలో.. ధోనీ బ్యాట్‌కు, స్పిన్నర్లు బంతికి పనిచెప్తే నాకౌట్ ముందు టీమ్ఇండియాకు తిరుగుండదు.**

**ఇప్పటికే సెమీఫైనల్లో అడుగుపెట్టేశాం. ఇక మిగిలిందల్లా అస్త్రశస్త్రాలు మరోసారి సరిచూసుకోవడమే. లంకతో మ్యాచ్‌ను నాకౌట్‌కు ముందు రిహార్సల్‌లా వినియోగించుకోవాలని భారత్ భావిస్తుంటే.. చివరి మ్యాచ్‌లో విజయంతో టోర్నీకి వీడ్కోలు పలకాలని లంక పట్టుదలగా ఉంది. సెమీస్‌లో కాస్త బలహీన ప్రత్యర్థి న్యూజిలాండ్ ఎదురుపడాలంటే టీమ్ఇండియా ఈ మ్యాచ్ నెగ్గి తీరాల్సిందే.**


కోహ్లీ

### ప్రయోగాలు చేస్తారా..!

నామమాత్రమైన మ్యాచ్ కావడంతో టీమ్ఇండియా ప్రయోగాలకు అవకాశమిస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. విశ్వసమరానికి ముందు ప్రకటించిన 15 మంది జట్టులో ఒక్క రవీంద్ర జడేజాకు మినహా మిగిలినవారందరికీ మ్యాచ్ ఆడే అవకాశం దక్కింది. చివరి మ్యాచ్‌లో అతడికి చాన్స్ ఇస్తారా చూడాలి. ఇప్పటికే మాజీలు మొహమ్మద్ అజారుద్దీన్, వీవీఎస్ లక్ష్మణ్, హర్భజన్ సింగ్.. జడ్డూకు ఓ చాన్స్ ఇవ్వాలని అభిప్రాయపడుతున్నారు. లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌తో పాటు ఆఫ్ స్పిన్‌తో ఆకట్టుకోగలిగే జడేజాను జట్టులోకి తీసుకుంటారా.. బంగ్లాతో మ్యాచ్‌లో ఎక్కువ బంతులు ఆడే చాన్స్ దక్కని దినేశ్ కార్తీక్‌ను కొనసాగిస్తారా చూడాలి. సెమీస్‌కు ముందు పేసర్లకు విశ్రాంతి ఇవ్వాలనుకుంటే.. బుమ్రాకు రెస్ట్ ఇవ్వొచ్చు. పిచ్ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశాలున్న నేపథ్యంలో ఇద్దరు స్పిన్నర్లతో బరిలో దిగే చాన్స్ ఉంది. విన్నింగ్ కూర్పును మార్చడానికి పెద్దగా ఇష్టపడని కెప్టెన్ కోహ్లీ ఏం చేస్తాడో చూడాలి. ఒక్క వన్డే కూడా ఆడకుండానే ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకున్న మయాంక్ అగర్వాల్ మరోసారి బెంచ్‌కే పరిమితమవ్వొచ్చు.

**లీడ్స్:** ఇప్పటికే నాకౌట్‌లో అడుగుపెట్టిన టీమ్ఇండియా సెమీఫైనల్‌కు ముందు చివరి లీగ్ మ్యాచ్‌లో శనివారం శ్రీలంకతో తలపడనుంది. టాపార్డర్ రాణిస్తున్నా మిడిల్ సమస్యతో సతమతమవుతున్న కోహ్లీ సేన ఈ మ్యాచ్‌లో ఆ లోపాలను సరిదిద్దుకోవాలనుకుంటున్నది. మరోవైపు పేరుకు తగ్గట్లు రాణించలేకపోయిన లంకేయులు చివరి మ్యాచ్‌లోనైనా నెగ్గి విజయంతో టోర్నీ ముగించాలని ఆశతో ఉన్నారు. సెమీస్‌లో కాస్త సులువైన ప్రత్యర్థి అని అనుకుంటున్న న్యూజిలాండ్ ఎదురవ్వాలంటే భారత్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలువాల్సి ఉంటుంది. ప్రస్తుతం 13 పాయింట్లతో రెండోస్థానంలో ఉన్న టీమ్ఇండియా లంకను ఓడిస్తే 15 పాయింట్లతో టాప్‌కు చేరుతుంది. మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా నెగ్గితే మన స్థానంలో మార్పు లేకుండా కివీస్‌తో తలపడొచ్చు. ఒకవేళ ఆసీస్ నెగ్గితే.. సెమీఫైనల్లో ఆతిథ్య ఇంగ్లండ్‌తో భారత తలపడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆసీస్ మ్యాచ్ ఫలితం మన చేతిలో లేదు కాబట్టి చివరి మ్యాచ్‌లో నెగ్గి టాప్ కు వెళ్లాలని భారత్ పట్టుదలగా ఉంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో భీకరంగా కనిపిస్తున్న టీమ్ఇండియాకు.. లంక ఏ మాత్రం పోటీనిస్తుందో చూడాలి.

**మిడిలార్డరే ప్రధాన సమస్య**

టాపార్డర్‌లో పెద్దగా సమస్యలు లేకపోవడంతో లంకతో మ్యాచ్‌లో టీమ్ఇండియా మిడిల్ లోపాలపై దృష్టి పెట్టింది. కెప్టెన్ కోహ్లీ (408 పరుగులు), వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ (544 పరుగులు) బ్యాటింగ్ భారాన్ని మోస్తూ జట్టును ముందుకు నడిపిస్తున్నారు. ఐదు అర్ధశతకాలు బాదిన కోహ్లీతో పాటు లోకేశ్ రాహుల్ భారీ ఇన్నింగ్స్‌లాడాలని పట్టుదలగా ఉంటే.. నాలుగో స్థానంలో ఆకట్టుకుంటున్న పంత్ అదే జోరు కొనసాగించాలనుకుంటున్నాడు. మునుపటి మెరుపులు మెరిపించేందుకు లంకను మించిన ప్రత్యర్థి ధోనీకి దొరక్కపోవచ్చు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి మహీకి ఇది చక్కటి అవకాశం. స్పిన్నర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటాడనే పేరున్న ధోనీ ఈ టోర్నీలో స్పిన్నర్ల బౌలింగ్ 81 బంతుల్లో 47 పరుగులు మాత్రమే చేశాడు. ఈ గణాంకాలు, అతడి ప్రదర్శనపై వస్తున్న విమర్శలు పటాపంచలు అవ్వాలంటే మాజీ కెప్టెన్ బ్యాట్‌కు పని చెప్పక తప్పదు. ధోనీని నాలుగులో ఆడించి హిట్టర్లు పంత్, పాండ్యాలకు ఫినిషింగ్ బాధ్యతలు అప్పజెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు. పేసర్లు విజృంభిస్తుండటంతో స్పిన్నర్ల లోపాలు బయటపడటం లేదు. కానీ మణికట్టు మాయగాళ్లు మధ్య ఓవర్లలో మరింత ప్రభావవంతంగా బౌలింగ్ చేయాల్సిన అవసరం ఉంది.

**అడ్డుకునేనా..**

బ్యాటింగ్‌తో పోల్చుకుంటే లంక బౌలింగే బలంగా కనిపిస్తున్నది. వెటరన్ పేసర్ లసిత్ మలింగ.. అవకాశాలు లేని చోటు నుంచి కూడా జట్టుకు విజయాల బాట వేస్తున్నాడు. గత మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన యువ ఆటగాడు అవిష్క ఫెర్నాండో మరోసారి జోరు కనబర్చాలనుకుంటున్నాడు. క్రీజులో నిలిచేందుకు కష్టపడుతున్న కెప్టెన్ దిముత్ కరుణరత్నే భారీ ఇన్నింగ్స్ ఆడాల్సిన అవసరం ఉంది. కుషాల్ మెండిస్, కుషాల్ పెరీరా, మాథ్యూస్ కూడా తలో చేయి వేస్తే లంక మంచి స్కోరు చేయగలదు. మలింగ, ఉడానా, రజిత, వాండర్సే, ధనంజయతో కూడిన బౌలింగ్ దళం.. భారత బ్యాట్స్‌మెన్‌ను ఎలా అడ్డుకుంటుందో చూడాలి. ముఖ్యంగా లంక బౌలింగ్‌ను చెడుగుడాడుకునే రోహిత్‌ను ఆరంభంలో అడ్డుకుంటేనే ఆ జట్టు గెలుపు ఆశలు సజీవంగా ఉండేది. ప్రపంచకప్‌లో దాదాపు చివరి మ్యాచ్ ఆడబోతున్న మలింగ ఎలాంటి ప్రణాళికలతో వస్తాడనేది ఆసక్తికరం.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లీ (కెప్టెన్), రోహిత్, రాహుల్, పంత్, ధోనీ, కార్తీక్/జాదవ్, పాండ్యా, భువనేశ్వర్/షమీ, చహల్, కుల్దీప్, బుమ్రా.
**శ్రీలంక:** కరుణరత్నే (కెప్టెన్), కుషాల్ పెరెరా, ఫెర్నాండో, కుషాల్ మెండిస్, మాథ్యూస్, తిరిమన్నే/తిసార పెరెరా, ఉడానా, ధనంజయ, వాండర్సే, రజిత, మలింగ.

### పిచ్, వాతావరణం

హెడింగ్లే పిచ్‌పై టర్న్‌కు అవకాశం ఉండటంతో స్పిన్నర్లకు సహకరించొచ్చు. విండీస్‌తో మ్యాచ్‌లో ఆఫ్ఘన్ స్పిన్ త్రయం పరుగులు కట్టడి చేసింది. మ్యాచ్‌కు వర్షం ముప్పలేదు.


కరుణరత్నే

## కొత్తగా జాతీయ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పాటు

### బడ్జెట్‌లో అదనపు కేటాయింపుల్లేకుండానే బిల్లు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'ఖేలో ఇండియా' కార్యక్రమాన్ని మరింత విస్తృత పరిచేందుకు గాను కొత్తగా జాతీయ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ బోర్డు(ఎన్ఎస్ఈబీ)ఏర్పాటు చేయబోతున్నారు. శుక్రవారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ యేడాది ఫిబ్రవరిలో మాజీ ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ తాత్కాలిక బడ్జెట్‌లో క్రీడలకు కేటాయించిన నిధులను కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం మొగ్గుచూపింది. దీంతో ఎన్ఎస్ఈబీ ఏర్పాటు మినహా క్రీడలకు అదనపు కేటాయింపులు లేకుండానే సీతారామన్ బడ్జెట్ ప్రసంగం ముగిసింది. 'ఖేలో ఇండియా కార్యక్రమాన్ని మరింత విస్తరిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. పూర్తిస్థాయి ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఖేలో ఇండియా స్కీమ్ కింద దేశ వ్యాప్తంగా అన్ని స్థాయిల్లో క్రీడలకు ప్రాచుర్యం కల్పించేందుకు కొత్తగా ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పాటు చేయబోతున్నాం' అని సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించారు. ఇదిలా ఉంటే తాత్కాలిక బడ్జెట్‌లో క్రీడలకు రూ.2216.92 కోట్లు కేటాయించారు. ఇది గతేడాది కంటే రూ. 214.2 కోట్లు అధికం. ఇందులో భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్)కు కేటాయింపులను రూ.55 కోట్ల నుంచి రూ.450 కోట్లకు పెంచారు. ఖేలో ఇండియా కార్యక్రమానికి రూ.601 కోట్లు, ఎన్ఎస్‌డీఎఫ్‌లకు రూ.70 కోట్లు, జాతీయ క్రీడా సమాఖ్య(ఎన్ఎస్ఎఫ్)కు రూ.245 కోట్లు నిధులు కేటాయించారు. బడ్జెట్ నిధులపై కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజిజు ట్విట్టర్‌లో సంతృప్తి వ్యక్తం చేశారు.

## కెనడా క్వార్టర్స్‌లో కశ్యప్, సౌరభ్


కశ్యప్

**కాల్గరీ:** కెనడా బ్యాడ్మింటన్ ఓపెన్‌లో భారత షట్లర్లు పారుపల్లి కశ్యప్, సౌరభ్ వర్మ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన ప్రిక్వార్టర్స్ పోరులో ఆరో సీడ్ కశ్యప్ 23-21, 21-23, 21-19 తేడాతో రెన పెంగ్ బో(చైనా)పై చెమటోడ్చి గెలిచాడు. దాదాపు గంటన్నర పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో కశ్యప్‌కు చైనా షట్లర్ దీటైన పోటీనిచ్చాడు. ప్రతి పాయింట్ కోసం ఇద్దరు నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. తొలి గేమ్‌ను 23-21తో దక్కించుకున్న కశ్యప్..ప్రత్యర్థికి రెండో గేమ్‌ను చేజార్చుకున్నాడు. అయితే నిర్ణయాత్మక మూడో గేమ్‌లో పుంజుకున్న కశ్యప్..చైనా షట్లర్ అవకాశమివ్వకుండా మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. క్వార్టర్స్‌లో లుకాస్ క్లైర్‌బౌట్(ఫ్రాన్స్)తో కశ్యప్ తలపడుతాడు. మరో మ్యాచ్‌లో సౌరభ్ వర్మ 21-13, 15-21, 21-15తో సున్ ఫి జియాంగ్(చైనా)పై గెలిచి క్వార్టర్స్‌లోకి వెళ్లాడు.

# గెలిచినా.. ఇంటికే

### బంగ్లాపై నెగ్గినా సెమీస్ చేరని పాక్
### అధికారికంగా బెర్త్ ఖరారు చేసుకున్న కివీస్

**'బంగ్లాదేశ్‌పై 500 పరుగులు చేస్తాం'మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ కెప్టెన్ సర్ఫరాజ్ వ్యాఖ్యలివి. ఆ తర్వాత దాన్ని జోక్‌గా మలిచినా.. సెమీస్‌కు చేరాలంటే భారీ స్కోరు చేయక తప్పని మ్యాచ్‌లో పాకిస్థాన్ నిరాశ పరిచింది. ఇన్నాళ్లుగా వెక్కిరించిన అదృష్టం చివరి మ్యాచ్‌లో టాస్ రూపంలో కలిసొచ్చింది. భారీ స్కోరు చేస్తేనే నాకౌట్ చాన్స్‌లు నిలుస్తాయని తెలిసినా.. పాక్ బ్యాట్స్‌మెన్ పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. బంతికో పరుగు చొప్పున చేస్తూ.. మ్యాచ్ నెగ్గే స్కోరైతే చేశారు కానీ, సెమీస్ బెర్త్‌ను మాత్రం అందుకోలేకపోయారు. ఇక తర్వాత బంగ్లాను 7 పరుగులలోపు కట్టడి చేస్తే నాకౌట్ అవకాశం ఉండేదే.. అదీ సాధ్యం కాకపోవడంతో.. అధికారికంగా న్యూజిలాండ్ సెమీస్ బెర్త్ దక్కించుకోగా.. సర్ఫరాజ్ సేన నిరాశగా ఇంటిబాట పట్టింది.**

**లండన్:** అనితర సాధ్యమైన విజయం సాధిస్తేనే.. సెమీస్ రేసులో నిలిచే స్థితిలో చివరి మ్యాచ్ ఆడిన పాకిస్థాన్ గెలువనైతే గెలిచింది కానీ.. భారీ తేడాతో కాదు. దీంతో ఆఖరి మ్యాచ్ విజయంతో 11 పాయింట్లు ఖాతాలో వేసుకున్నా.. రన్‌రేట్ తక్కువగా ఉండటంతో నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది. శుక్రవారం లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 94 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 315 పరుగులు చేసింది. ఇమామ్ ఉల్ హక్ (100; 7 ఫోర్లు) సెంచరీ చేయగా.. బాబర్ ఆజమ్ (96; 11 ఫోర్లు) తృటిలో శతకం చేజార్చుకున్నాడు. ముస్తఫిజుర్ (5/75) టోర్నీలో రెండోసారి ఐదు వికెట్లు పడగొట్టాడు. అనంతరం యువ పేసర్, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'షాహీన్ షా అఫ్రిది (6/35) విజృంభించడంతో బంగ్లాదేశ్ 44.1 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. మెగాటోర్నీలో షకీబ్ అల్ హసన్ (64; 6 ఫోర్లు) ఏడో అర్ధ సెంచరీతో అదరగొట్టినా మిగిలినవారు విఫలమవడంతో బంగ్లాకు ఓటమి తప్పలేదు.

**ప్రపంచకప్ తర్వాత క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతానని ముందే చెప్పిన షోయబ్ మాలిక్‌కు ఆ జట్టు గార్డ్ ఆఫ్ ఆనర్‌తో వీడ్కోలు పలికింది.**


**షకీబ్ ఏడోసారి**

స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ మరో అర్ధసెంచరీతో పోరాడినా.. మిగిలినవారి నుంచి సరైన సహకారం అందకపోవడంతో బంగ్లాకు ఓటమి తప్పలేదు. ధాటిగా ఆడిన సర్కార్ (22)తో పాటు తమీమ్ (8) వెంటవెంటనే ఔటయ్యారు. ముష్ఫికర్ (16) పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. లిటన్ (32)తో కలిసి షకీబ్ నాలుగో వికెట్‌కు 58 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టే ప్రయత్నం చేసినా అది ఎక్కువ సేపు సాగలేదు. లిటన్ ఔటైనా కాసేపటికే షకీబ్ కూడా వెనుదిరగడంతో బంగ్లా ఓటమి ఖాయమైంది.

**బాబర్, ఇమామ్ ఆకట్టుకున్నా..**

భారీ స్కోరు చేయాలనే లక్ష్యంతో బరిలో దిగిన పాకిస్థాన్‌కు అందుకు తగ్గ ఆరంభం లభించలేదు. పవర్ ప్లే ముగిసేసరికి ఆ జట్టు ఫఖర్ జమాన్ (31 బంతుల్లో 13) వికెట్ కోల్పోయి 38 పరుగులు చేసింది. మరో ఓపెనర్ ఇమామ్‌తో కలిసి బాబర్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఆరంభంలో నెమ్మదిగా ఆడిన ఈ జోడీ కుదురుకున్నాక జోరు పెంచింది. ఈ క్రమంలో మొదట బాబర్ 62 బంతుల్లో ఆ తర్వాత ఇమామ్ 52 బంతుల్లో అర్ధ శతకాలు పూర్తి చేసుకున్నారు. రెండో వికెట్‌కు 157 పరుగులు జోడించాక.. టోర్నీలో రెండో సెంచరీకి నాలుగు పరుగుల దూరంలో బాబర్ ఔటయ్యాడు. హాఫీజ్ (27) సహకారంతో సెంచరీ పూర్తి చేసుకున్న ఇమామ్ ఆ వెంటనే హిట్‌వికెట్ రూపంలో వెనుదిరిగాడు. దీంతో ఒక దశలో 246/2తో పటిష్ఠంగా ఉన్న పాకిస్థాన్ ఆ తర్వాత తడబడింది. ఇమాద్ వసీమ్(26 బంతుల్లో 43; 6 ఫోర్లు, 1 సిక్స్) ఇరగదీస్తున్నా.. హరీస్ సోహైల్ (6), సర్ఫరాజ్ (3 నాటౌట్), వహాబ్ (2) షాదాబ్ (1), ఆమిర్ (8) ఆకట్టుకోలేకపోవడంతో పాక్ 68 పరుగుల వ్యవధిలో 7 వికెట్లు కోల్పోయింది.

**సంక్షిప్త స్కోర్లు: పాకిస్థాన్:** 50 ఓవర్లలో 315/9 (ఇమామ్ 100, బాబర్ 96; ముస్తఫిజుర్ 5/75, సైఫుద్దీన్ 3/77), **బంగ్లాదేశ్:** 44.1 ఓవర్లలో 221 ఆలౌట్ (షకీబ్ 64, లిటన్ 32; షాహీన్ 6/35).


షాహీన్ (6/35)

**1** విశ్వసమరంలో పిన్న వయసులో 5 వికెట్లు పడగొట్టిన పేసర్‌గా షాహీన్ షా అఫ్రిది (19 ఏండ్ల 90 రోజులు) చరిత్ర సృష్టించాడు.


షకీబ్ (64)

**3** ఒక ప్రపంచకప్‌లో ఎక్కువ పరుగులు చేసిన జాబితాలో షకీబ్ (606) మూడో స్థానానికి చేరాడు. సచిన్ (673 ), హెడెన్ (659) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

**7** ఈ టోర్నీలో షకీబ్ అర్ధసెంచరీల సంఖ్య. సచిన్ (2003లో, 7) సరసన చేరాడు.

**1** ప్రపంచకప్‌లో పాకిస్థాన్ తరఫున అతి చిన్న వయసులో సెంచరీ కొట్టిన బ్యాట్స్‌మన్‌గా ఇమాముల్ హక్ (23 ఏండ్ల 205 రోజులు) గుర్తింపు సాధించాడు.

## హోరాహోరీగా సెయిలింగ్ పోటీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** నగరం నడిబొడ్డున హుస్సేన్ సాగర్ వేదికగా హైదరాబాద్ సెయిలింగ్ వీక్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీలకు మూడో రోజైన శుక్రవారం జరిగిన వేర్వేరు విభాగాల్లో సెయిలర్లు నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. ఓవైపు బలంగా వీస్తున్న గాలులను తట్టుకుంటూ, అవరోధాలను అధిగమిస్తూ రేసులో దూసుకెళ్లారు. లేజర్ ఆర్‌డీఎల్ క్లాస్ విభాగంలో హర్‌ప్రీత్ సింగ్, గితేశ్ మధ్య పోరు ఆకట్టుకుంది. ముజాహిద్‌ఖాన్, సురేశ్ కుమార్, గితేశ్ ఆయా రేసుల్లో టాప్‌లో నిలిచారు. ఈ ఏడాది పోటీల్లో సెయిలర్ల ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయిలో ర్యాంక్‌లను ప్రకటించనున్నారు. విజేతలకు ఆదివారం జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నారు.

## స్టార్ల జోరు

### హలెప్, జొకోవిచ్ ముందంజ

**లండన్:** ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ రసవత్తరంగా సాగుతున్నది. ఈసారి కచ్చితంగా టైటిల్ కొడుతారనుకున్న అంచనాల మధ్య బరిలోకి దిగిన వాళ్లు ఆదిలోనే నిష్క్రమిస్తే..అనామకులనుకున్న వారు అద్భుతాలు సృష్టిస్తున్నారు. సిమోనా హలెప్, నొవాక్ జొకోవిచ్ టోర్నీలో ముందంజ వేయగా, గతేడాది రన్నరప్ కెవిన్ అండర్సన్, విక్టోరియా అజరెంకా, వోజ్నియాకి తమ పోరాటాన్ని ముగించారు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో హలెప్ 6-3, 6-1తో అజరెంకాను వరుస సెట్లలో మట్టికరిపించింది. గంటా ఆరు నిమిషాల పాటు జరిగిన పోరులో అజరెంకా ఏ దశలోనూ హలెప్‌కు పోటీనివ్వలేకపోయింది. అద్భుతమైన ఫోర్‌హ్యాండ్ షాట్లకు తోడు పదునైన సర్వ్‌లతో చెలరేగిన ఈ రొమేనియా భామ కోర్టు నలువైపులా పరిగెడుతూ అజరెంకాను ముప్పుతిప్పలు పెట్టింది. . మరో మ్యాచ్‌లో ప్లిస్కోవా 6-3, 2-6, 6-4తో హెసియ్‌పై గెలువగా, వోజ్నియాకి 4-6, 2-6తో జాంగ్ షుయి(చైనా) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. వింబుల్డన్‌లో నాలుగో రౌండ్‌లోకి వెళ్లడం జాంగ్‌కు ఇది తొలిసారి కావడం విశేషం. గత ఐదు పర్యాయాలు మెయిన్ డ్రాలో జాంగ్ మ్యాచ్‌లు గెలువలేకపోయింది. పురుషుల సింగిల్స్‌లో అండర్సన్ 4-6, 3-6, 6-7(4/7)తో గుయిడో పెల్లా(అర్జెంటీనా) చేతిలో ఓటమి చవిచూశాడు. తన కంటే తక్కువ ర్యాంక్‌లో ఉన్న ఆటగానిపై అండర్సన్ స్థాయికి తగ్గ ఆటతీరును కనబరుచలేకపోయాడు. డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ 7-5, 6-7(5/7), 6-1, 6-4తో హర్కాజ్‌పై విజయంతో నాలుగో రౌండ్‌లోకి ప్రవేశించాడు.


హలెప్

**ప్రిక్వార్టర్స్‌లో శరణ్:**
వింబుల్డన్‌లో భారత ఆశలను నిలబెడుతూ దివిజ్ శరణ్ ప్రిక్వార్టర్స్‌లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పోరులో శరణ్, మార్సెలో డీమాలినర్ జోడి 7-6(7/1), 5-7, 7-8(8/6), 6-4తో బెల్జియం ద్వయం సాండర్ గిల్లె, జోరన్ విల్జీయన్‌పై గెలిచింది.



యాదాద్రిలో వరుణయాగం నిర్వహిస్తున్న రుత్వికులు, పాల్గొన్న ఈవో గీత, అనువంశిక ధర్మకర్త నర్సింహ్మామూర్తి

## యాదాద్రిలో వరుణయాగం

**యాదాద్రిభువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తేతెలంగాణ:** యాదాద్రిలో శ్రీవర్ష పాశుపత హవనపూర్వక వరుణ యాగం శుక్రవారం మొదలైంది. వర్షాలు సమృద్ధిగా కురవాలని కాంక్షిస్తూ కొండపైన శివాలయం ఆవరణలో రుత్వికులు యాగం ప్రారంభించారు. అనంతరం శతరుద్రాభిషకం, వరుణయాగ జపాలు, హవనములు నిర్వహించారు. కార్యక్రమంలో యజ్ఞబ్రహ్మ మేళ్లూరి సందీప్‌శర్మ, యాదాద్రి ప్రధానార్చకుడు నల్లంతీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, శివాలయం ప్రధానార్చకుడు సత్యనారాయణశర్మ, ఆలయ అనువంశిక ధర్మకర్త బీ. నర్సింహమూర్తి, ఆలయ ఈవో ఎన్. గీత తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేటలో నీటి వనరులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

## వర్ధన్నపేటలో కేంద్ర బృందం పర్యటన

**వర్ధన్నపేట, నమస్తే తెలంగాణ:** భూగర్భ జలాలను పెంపొందించేందుకు నిర్మించిన ఫాంపాండ్లు, చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతలను కేంద్ర అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట మండలం పలు గ్రామాల్లో కేంద్ర కామర్స్ విభాగం డిప్యూటీ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి సునీల్‌రాజన్, కేంద్ర నీటిపారుదలశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఫ్రాంక్లిన్, పలువురు అధికారులు వర్ధన్నపేట పరిధిలోని నీటి వనరులను పరిశీలించారు. భూగర్భ జలాలు అడుగంటి పోతున్న తరుణంలో భూగర్భ జలాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను పరిశీలించామని అధికారులు పేర్కొన్నారు. భూగర్భ జలాలను పెంచేందుకు వాగులపై చెక్‌డ్యాంలు, ఫాంపాడ్‌లు, ఇంకుడు గుంతల నిర్మాణంతో పాటుగా చెరువులు, కుంటలను సంరక్షించుకోవాలని సూచించారు. పురాతన చెరువులు, వాగులను సందర్శించారు.

## పాముకాటుతో రైతు మృతి

**వెల్దండ:** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కంటోనిపల్లికి చెందిన కమటం కృష్ణయ్య (55) అనే రైతు పాము కాటుతో శుక్రవారం మృతి చెందాడు. తెల్లవారు జామున తన వ్యసాయం పొలానికి వెళ్లన కృష్ణయ్య గోంగుర తెంచి కట్టలు కడుతుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు కృష్ణయ్యను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతు మరణించాడు.



కృష్ణయ్య (ఫైల్)

# పలు జిల్లాల్లో ఓ మోస్తరు వాన

## నల్లగొండలో గాలివాన బీభత్సం

ఖమ్మం, వికారాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వర్షం.. సూర్యాపేట జిల్లాలో చిరుజల్లులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శుక్రవారం వర్షం కురిసింది. నల్లగొండ జిల్లాలో గాలివాన బీభత్సానికి విద్యుత్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడింది. ఖమ్మం, వికారాబాద్ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ మోస్తరుగా, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లిలో భారీ వర్షం కురిసింది. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో పొద్దంతా ఎండ కాయగా.. సాయంత్రం అకస్మాత్తుగా వాన కురిసింది. ఖమ్మం నగరంలో ఓ మోస్తరు వర్షం కురవగా, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. మధ్యాహ్నం నగరంపై మేఘాలు దట్టంగా అలుముకోగా.. సాయంత్రం నాలుగు గంటలకే చిమ్మచీకటిని తలపించింది. కొంకాలంగా వర్షం కోసం ఎదురుచూస్తున్న ఖమ్మం నగర వాసులు సాయంత్రం వేళ కురిసిన వానతో ఉపశమనం పొందారు. ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, వైరా, చింతకాని, బోనకల్, కారేపల్లి, ఏన్కూర్, సత్తుపల్లి నియోజకవర్గంలోని ఆయా మండలాలలో చిరుజల్లులు కురిశాయి. పత్తి విత్తుకున్న రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గడిచిన 24 గంటల్లో ఖమ్మం రూరల్ మండలంలో 2.4 మిల్లీమీటర్లు, కొణిజర్లలో 4.2 మి.మీ, సత్తుపల్లిలో 5.2 మి.మీ, వేంసూర్ మండలంలో 6.2 మి.మీ, వైరా మండలంలో 2.4 మి.మీ, తల్లాడలో 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. సూర్యాపేటలో సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. కొద్దిరోజులుగా వర్షం లేకపోవడంతో 10 నిమిషాలు కురిసిన వర్షానికి ప్రజలు ఉపశమనం చెందారు. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే వారు, విద్యార్థులు వర్షంతో ఇబ్బంది పడ్డారు. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. వికారాబాద్, ధారూర్, మోమిన్ పేట్, నవాబుపేట్, కోట్‌పల్లి, బంట్వారం మండలాల్లో అరగంటపాటు ఎడతెరపి లేకుండావర్షం కురిసింది. తాండూర్, పెద్దేముల్ మండలాల్లోనూ 15 నిమిషాలపాటు ఓ మోస్తరు వర్షం కురవగా.. పరిగి నియోజకవర్గంలో చిరుజల్లులు పడ్డాయి. కొడంగల్ మండలంలో ఓ మోస్తరు వర్షం కురవగా దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉండి కొద్ది పాటి జల్లులు కురిశాయి. అచ్చంపేట, తెలకపల్లి మండలాల్లో అదును వర్షం కురిసింది.



శుక్రవారం సాయంత్రం ఖమ్మం నగరంలో కురుస్తున్న వర్షం



వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో కురుస్తున్న వాన

### చింతలమానేపల్లిలో భారీ వర్షం

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లిలో భారీ వర్షం కురిసింది. మండలంలోని కేతిని, దిందా గ్రామాల మధ్య ఉన్న వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బెజ్జూరు మండలంలో మోస్తరు వర్షం పడింది.

### నల్లగొండలో గాలివాన బీభత్సం

నల్లగొండ జిల్లాలో శుక్రవారం పలు చోట్ల వర్షం కురిసింది. గాలివాన కారణంగా పలు చోట్ల చెట్లు కూలి విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నిడమనూరు, మునుగోడులో ఈదురుగాలులతో వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో దాదాపుగా చిరుజల్లులు కురిశాయి. ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేసిన రైతాంగానికి తాజా వర్షం ఊతమిచ్చినట్లయింది.

వాయవ్య బంగాళాఖాతంలో

## ఉపరితల ఆవర్తనం

### చురుకుగా రుతుపవనాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వాయవ్య బంగాళాఖాతం.. దానిని ఆనుకుని పశ్చిమబెంగాల్ ప్రాంతాల్లో సముద్రమట్టానికి 3.1 నుంచి 7.6 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. దీని ప్రభావంతో తెలంగాణలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతాయని చెప్పారు. రాగల 48 గంటల్లో రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు.

### గ్రేటర్ హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం

గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల రెండురోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గ్రేటర్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో అత్యధికంగా 1.1 సెం.మీ. వర్షపాతం నమోదుకాగా, నగరంలోని పాతబస్తీ, రాజేంద్రనగర్, మెహిదీపట్నం, కార్వాన్, నాంపల్లి, అబిడ్స్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనానికి తోడు రుతుపవనాలు చురుకుగా కదులుతున్న నేపథ్యంలో రాగల మూడ్రోజులు గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## యువకుడి దారుణ హత్య

**పాల్వంచ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో శుక్రవారం తెల్లవారుజామున ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక బ్రాహ్మణ వీధిలో నివసించే ఎండీ షకీల్(20) సోదరి (మైనర్)ని పట్టణంలోని తెలంగాణనగర్‌కు చెందిన యనమల శివశంకర్‌రెడ్డి అలియాస్ శివారెడ్డి కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. ఈ వ్యవహారం తెలిసిన షకీల్ చాలాసార్లు శివారెడ్డిని మందలించాడు. షకీల్, శివారెడ్డి కుటుంబాల మధ్య పంచాయతీలు కూడా జరిగాయి. అయినా శివారెడ్డి ప్రేమ వ్యవహారం నడిపిస్తు బాలికతో ఫోన్‌లో మాట్లాడేవాడు. ఈ క్రమంలో తమ ప్రేమకు అడ్డువస్తున్న షకీల్‌ను మట్టుపెట్టాలని శివారెడ్డి నిర్ణయించుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున పాల్వంచలోని దమ్మపేట సెంటర్‌లో కనిపించిన షకీల్‌పై శివారెడ్డి తన స్నేహితులతో కలిసి కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో షకీల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి గౌస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శివారెడ్డితో పాటు మరో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.



ఎండీ షకీల్ (ఫైల్)

## కాంట్రాక్టర్లకు ఆన్‌లైన్‌లో చెల్లింపులు

తెలంగాణలో తొలిసారిగా సిరిసిల్లలో అమలు • ఫైనాన్స్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్‌చందా

**సిరిసిల్లటౌన్:** మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించే విధానాన్ని రాష్ట్రంలో మొదటిసారిగా సిరిసిల్ల మున్సిపాలిటీలో శుక్రవారం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి సురేశ్‌చందా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్త విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలోని మున్సిపాలిటీల అకౌంటెంట్లు, కాంట్రాక్టర్లకు ఆయన అవగాహన కల్పించారు. పనులు పూర్తైనా వెంటనే కాంట్రాక్టర్లకు వేగంగా, పారదర్శకంగా బిల్లు చెల్లించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం దీనిని అమలులోకి తెచ్చిందన్నారు. రెండు రోజుల్లో బిల్లులు చెల్లించేలా ఈ నూతన విధానం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. దశలవారీగా జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయితీ కార్యాలయాల్లోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అంతకుముందు పంచాయతీరాజ్ అతిథి గృహంలో సురేశ్‌చందాను కలెక్టర్ కృష్ణభాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. సమావేశంలో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి మున్సిపాలిటీల అకౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న సురేశ్‌చందా







నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం 6 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

# ఇన్‌స్టాలో రెజ్యూమె.. 'డెలాయిట్'లో జాబ్!



**యువత అంతా ఉద్యోగ వేటలో ఉంది. రెజ్యూమె చేతిలో పట్టుకొని ఆఫీస్‌ల చుట్టూ తిరిగే వారు కొందరైతే, ఇంటర్నెట్ ద్వారా ఉద్యోగావకాశాలు వెతికే వారు మరికొందరు. కానీ ముంబైకి చెందిన అంకిత చావ్లా అనే యువతి వినూత్నంగా ప్రయత్నించింది. ఆమె సృజనాత్మకతను గుర్తించిన ఓ కంపెనీ పిలిచి మరీ ఉద్యోగమిచ్చింది.**



'డోంట్ వెయిట్ ఫర్ ద అపార్చునిటీ.. క్రియేట్ ద అపార్చునిటీ' అన్నారు పెద్దలు. అవకాశాల కోసం వేచి చూడడం కన్నా ప్రతిభతో అవకాశాలను సృష్టించుకోవాలి. ముంబైకి చెందిన అంకిత అచ్చం అలాగే చేసింది. ఈమె విజువల్ కంటెంట్ క్రియేటర్. రైటింగ్ నైపుణ్యాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. అంకిత ఫ్రెండ్స్ అందరూ ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేసేవారు. వారి ప్రయత్నాలు చూసి అంకితకు ఆశ్చర్యమేసేది. ఒకే ఫార్మాట్‌లో ఉండే రెజ్యూమెను పట్టుకొని ఆఫీస్‌ల చుట్టూ తిరగడం, ఇంటర్నెట్‌లో జాబ్ నోటిఫికేషన్లు వెతకడం ఆమెకు వింతగా అనిపించింది. ఎందుకు ఇలానే చేయాలి? అనుకుంది. తన ఇన్‌స్టా అకౌంట్‌లో రెజ్యూమె పెట్టింది. దాన్ని రొటీన్ ఫార్మాట్‌లో కాకుండా క్రియేటివ్‌గా తయారు చేసింది. 'హైర్ అంకిత చావ్లా' పేరుతో ఇన్‌స్టా ప్రొఫైల్‌ను మార్చేసింది. తన నైపుణ్యాలను జోడించింది. దీన్ని ప్రముఖ కంపెనీ 'డెలాయిట్ ఇండియా' చూసింది. వెంటనే అంకితకు ఉద్యోగాన్ని ఆఫర్ చేసింది. ఇప్పుడు అంకిత అక్కడ విజువల్ కంటెంట్ క్రియేటర్‌గా పనిలో ఉంది. ఇలా అంకిత అందరికన్నా భిన్నమైన ఆలోచనలతో ఉద్యోగాన్ని సంపాదించింది.

# నైటింగేల్ మన సలోమీ

**డాక్టర్.. రోగికి వైద్యం మాత్రమే చేస్తాడు.
నర్స్.. రోగికి వైద్యంతో పాటు సేవ చేస్తుంది.
ఓ తల్లి ప్రసవ వేదన సమయంలో పక్కన ఉంటుంది.
ఓ తండ్రి క్యాన్సర్ చికిత్సలో వెన్నంటే ఉంటుంది.
ఓ అన్న గుండెపోటు పరీక్షలో తోడుగా ఉంటుంది.
అందుకే నర్స్ 'సిస్టర్' అయ్యింది!
ఇంతటి విలువైన వారి సేవల్ని గుర్తించి
కేంద్ర ప్రభుత్వం ప్రతీయేటా 'ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు' ఇస్తున్నది. ఈ సంవత్సరం
తెలంగాణ నుంచి ఈ అవార్డుకు ఎంపికైన
సీనియర్ నర్స్ అస్కా సలోమీ పరిచయం ఇది.**




**మెట్టుగూడ..** మెట్రోరైల్ స్టాప్ పక్క వీధి. ఓ రెండంతస్థుల ఇల్లు. ఇంట్లో ఇద్దరే ఇద్దరు మహిళలు ఉన్నారు. ఇద్దరూ వయసు పైబడినవారే. 'ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుకు ఎంపికయ్యారు కదా? అస్కా సలోమీ.. ప్లీజ్ ఆమెను పిలువరా?' అని అడిగితే.. 'అయ్యో.. ఆ అస్కా సలోమీని నేనే నయ్యా' అన్నారొక మహిళ.

'ఏంటీ అవార్డు తీసుకునేది మీరేనా?' అని అడిగితే.. 'అవును. దాంట్లో అనుమానమెందుకు?. ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు నర్సింగ్ విభాగంలో విశిష్ట సేవలు అందించిన వారికి ఇస్తారు. నిన్న కాదు.. ఇవాళ కాదు 1971 నుంచి నర్స్‌గా సేవలందిస్తున్నాను. నా సర్వీస్‌లో ఎంతోమందికి ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాను. ఆరోగ్యం పట్ల.. జీవితం పట్ల.. అక్షరాస్యత పట్ల.. పారిశుధ్యం పట్ల అవగాహన కల్పించాను. తండాల్లో పర్యటించి వారి తండ్లాటకు పరిష్కార మార్గాలు చూపించాను. అప్పుడు వారి కళ్లలో కనిపించే మెరుపు.. ఆనందం నాకు వృత్తిపట్ల సంతృప్తినిచ్చింది. నర్సింగ్ సమాజమంతా గొప్పగా ఫీలయ్యే మా ఆరాధ్యురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ పేరిట స్థాపించిన అవార్డును నేను అందుకోబోతున్నట్లు తెలిసి ఈ జీవితానికి ఇక ఇది చాలు అనిపిస్తున్నది' అన్నారు.

ఇంతలో పక్కనున్న మరో మహిళ.. 'అస్కా సలోమీని చిన్నప్పటి నుంచి దగ్గరుండి చూశాను. ఈవిడ ప్రతీది సామాజిక కోణంలోనే ఆలోచిస్తుంది. నర్సింగ్ స్కూల్‌లో నాకంటే సలోమీ జూనియర్. కాకపోతే మేం ఇద్దరం కలిసిమెలిసి ఉండేవాళ్లం. తనకు ఏ సందేహం వచ్చినా నిర్మొహమాటంగా అడుగుతుండేది. దేన్నయినా చాలెంజింగ్‌గా తీసుకునే అలవాటు సలోమీకి ఉన్నది. ఇంత చేసింది కదా? మన ఆరాధ్యురాలైన నైటింగేల్ పేరిట ఇచ్చే అవార్డుకు ఎందుకు అప్లయ్ చేసుకోకూడదు? అని మొదట ఆలోచన నాకే వచ్చింది. మనకెందుకులే అని ఆమె ఎన్ని రకాలుగా తప్పించుకునే ప్రయత్నం చేసినా దగ్గరుండి మరీ నేనే చేయించాను. చాలామటుకు ఇన్ సర్వీస్‌లో ఉన్నవాళ్లకే ఈ అవార్డు ఇస్తుంటారు. కానీ ఈ సారి రిటైర్డ్ అయిన సీనియర్ నర్స్‌కు ఈ అవార్డు ఇస్తున్నారంటే సలోమీ సేవలేంటో అర్థం చేసుకోవచ్చు. నైటింగేల్ అవార్డును పొందే అన్ని అర్హతలు.. అనుభవం ఉన్న వ్యక్తి సలోమీ' అంటూ చెప్పుకొచ్చారు.

ఆ చెప్పినావిడ పేరు గ్రేస్.



నిస్వార్థంతో చేసే పనికి తగిన గుర్తింపు లభిస్తే ఆనందం ఎలా ఉంటుందో వాళ్ల ఇంటిని చూస్తే అర్థమవుతుంది. ఇంట్లోని షెల్ఫ్‌లు పూల బొకేలతో నిండి ఉన్నాయి.

అదే సమయంలో 'నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి లక్ష్మణ్, మలేరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న 'వెల్‌టెక్ ఫౌండేషన్' చైర్మెన్ చిలుపూరి వీరాచారి ఆమెకు సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. హాల్ అంతా అతిథులతో నిండిపోయింది. ఒక అవార్డు వస్తే ఇంత ఆనందం.. సంబురం ఉంటాయా? అని ఎవరికైనా అనిపిస్తుంది.

* * *

అస్కా సలోమీ స్వస్థలం నిజామాబాద్. వాళ్ల నాన్న రైల్వే ఉద్యోగి. ప్రాథమిక విద్య నిజామాబాద్‌లోనే చదివిన ఆమె ఉన్నత పాఠశాల విద్యను సికింద్రాబాద్ వెస్లీ గర్ల్స్ హైస్కూల్‌లో చదివారు. మాధ్యమిక విద్య కోసం మళ్లీ నిజామాబాద్ వెళ్లి గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో హెచ్ఎస్సీ పూర్తిచేశారు.

తనముందు అగ్రికల్చర్, హోం సైన్స్, నర్సింగ్ మూడు ఉన్నాయి.

'వాస్తవానికైతే తనకు నర్సింగ్ అవసరమే లేదు. అంతకాదంటే డాక్టర్ విద్యనైనా అభ్యసించేది. కానీ ఆమెకెందుకో నర్సింగ్ కోర్సు కావాలనిపించింది. ఇంట్లోవాళ్లను ఒప్పించింది. హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో బీఎస్సీ నర్సింగ్ చేసింది. తర్వాత ఆర్నెళ్లు ఖాళీగా ఉన్నది' అని గ్రేస్ చెప్తుండగా.. 'ఆగాగు.. ఖాళీగా ఉన్నానని చెప్పేస్తే సరిపోదు. కారణమేంటో కూడా చెప్పాలి. అప్పుడు తెలంగాణ ఉద్యమం జోరుగా సాగుతున్నది. మేం హాస్టల్ నుంచి చూసేవాళ్లం. అందరూ రోడ్లపైకి వచ్చి 'జై తెలంగాణ' నినాదాలు చేసేవాళ్లు. ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవ్వరికీ తెలియనంత కన్ఫ్యూజన్ ఉండేది. మేం కూడా తెలంగాణే కాబట్టి.. ఆలస్యమైతే అయ్యింది ఉద్యమమైతే ఫలించాలి అనుకునేవాళ్లం' అని తన మనసులోని భావాలను పంచుకున్నారు సలోమీ.

1971 సెప్టెంబర్‌లో నర్స్‌గా సలోమీకి పోస్టింగ్ వచ్చింది. తొలి పోస్టింగ్ సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో. 1982 వరకు అక్కడే పనిచేసి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగలరావు.. ప్రెసిడెంట్ వివి గిరి చేతులమీదుగా అవార్డులు పొందారు. ఉత్తమ సేవలకుగాను ఎన్నో ప్రశంసలు అందుకున్నారు కూడా. సరోజినీలో పనిచేస్తున్నప్పుడే ఆమెకు దేశంలోని పలు రాష్ట్రాల సరిహద్దుల్లో స్పెషల్‌డ్రైవ్‌లు పడేవి. అలా స్పెషల్ డ్రైవ్‌ల్లో ఆమెతో అత్యంత అనుబంధం ఏర్పరుచుకున్న ప్రాంతం మహారాష్ట్రలోని సిల్వంచ.

* * *

'డాక్టర్ పి.శివారెడ్డి బృందంతో కలిసి నేను సిల్వంచ వెళ్లాను. అక్కడి ప్రజలను చూసి చాలా బాధనిపించింది. మామూలుగా మనకు చెద పురుగులను చూస్తేనే అదోలా అనిపిస్తుంది కదా? కానీ వాళ్లు అదే చెద పురుగులను చెట్ల నుంచి సేకరించి పొయ్యిమీద వేసుకొని వేయించి తింటున్నారు. ఇదేంటి? అని అడిగితే మా ఆహారం ఇదే అని చాలా తేలికగా చెప్తున్నారు. ఎంత ఘోరమో అనిపించేది. ఏం చేయాలి? తరతరాలుగా వారు దానిని తమ సాంప్రదాయ ఆహారం అనుకుంటున్నారు. వారి ఆలోచనను అంత ఈజీగా మార్చగలమా? అనుకున్నాను. కానీ మార్చాలి అనే పట్టుదలతో చాలాకాలం అక్కడే ఉండి వారిలో మార్పు తీసుకురాగలిగాను. ప్రతీ నెలకు ఓసారి వారి దగ్గరకు వెళ్లేదాన్ని. పారిశుద్ధ్యం పట్ల అవగాహన కల్పించేదాన్ని. సిల్వంచ ట్రైబల్ ఏరియాలో పనిచేస్తున్నప్పుడే నాలో చాలా మార్పు వచ్చింది. మహారాష్ట్రలో పనిచేస్తున్న కొందరు నర్సులకు కూడా ప్రజారోగ్యంపై సరైన అవగాహన లేకపోవడం గమనించాను. డాక్టర్ ఖాళీ చికిత్స మాత్రమే చేస్తారు. రోగిని కంటికి రెప్పలా కాపాడి.. వారిని బిడ్డలా చూసుకునేది నర్సులమే కదా? మరి అలాంటప్పుడు ఆరోగ్యం పట్ల మనకు స్పష్టమైన అవగాహన ఉండాలి కదా? అనుకున్నాను. టీచింగ్ వైపు వెళ్లి సరికొత్త నర్సింగ్ సమాజాన్ని ఏర్పాటుచేయాలి అనుకొని 1979లో కాలేజ్ ఆఫ్ నర్సింగ్ డిపార్ట్‌మెంట్‌లో చేరాను. నర్స్‌లకు టీచింగ్ ఫ్యాకల్టీగా 1983 వరకు అక్కడే పనిచేశాను' అని తన అనుభవాలను చెప్పుకొచ్చారు.



సలోమీ సేవల్ని పరిశీలిస్తున్న అప్పటి రాష్ట్రపతి వీవీ గిరి

* * *

జీవితాంతం నర్సింగ్ వృత్తిలోనే ఉండిపోవాలి. రిటైర్డ్ అయిన తర్వాత కూడా నా సేవల్ని ఏదో ఒక రకంగా ప్రజారోగ్యానికి అందించాలి అనుకున్నాను.



ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుకు ఎంపికైన సలోమీని అభినందిస్తున్న గ్రేస్

ప్రతిభావంతులైన.. పనిమంతులైన నర్స్‌లను సమాజానికి అందించాలనే ఉద్దేశంతో 1983లో గాంధీ హాస్పిటల్‌లో నర్సింగ్ ట్యూటర్‌గా చేరి.. 2004లో వైస్ ప్రిన్సిపాల్ స్థాయికి ఎదిగారు సలోమీ. తర్వాత 2005లో వరంగల్ ఎంజీఎమ్ కాలేజీ నర్సింగ్‌కు ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. అక్కడ కొద్దికాలం పనిచేశారు. అదే సమయంలో తన సీనియర్ అయిన గ్రేస్ గాంధీ నర్సింగ్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. గ్రేస్ స్థానంలో వరంగల్ నుంచి బదిలీ అయి గాంధీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విభాగానికి ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 2005 సెప్టెంబర్‌లో అదే హాస్పిటల్‌లో ప్రిన్సిపాల్ హోదాలో వృత్తి జీవితానికి రిటైర్మెంట్ తీసుకున్నారామె. కానీ.. ప్రజారోగ్యం పట్ల తాను చేసే కార్యక్రమాలకు ఎన్నడూ దూరం కాలేదు.

'వ్యాధులు, మహిళల సమస్యలు, నర్సింగ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, అక్షరాస్యత వంటి ఎన్నో విషయాల గురించి ఇప్పటికీ పని చేస్తూనే ఉన్నాను. నాకు అలసట అంటే ఏంటో తెలియదు. నా ప్రతీ పనికి ప్రోత్సహిస్తూ అవార్డులు.. సన్మానాలు చేస్తున్నవారు చాలామంది ఉన్నారు. నేను కోరుకోకపోయినా.. వారందరూ కోరుకున్నారు కాబట్టే నన్ను 'ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు' వరించింది అనుకుంటున్నాను. ఇంటర్నేషనల్ నర్సెస్ రోజునాడే ఇవ్వాల్సి ఉండే. కానీ ఎలక్షన్ కోడ్ వల్ల ఈ నెలలో ఢిల్లీలో.. రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోబోతున్నాను. అందరికీ ధన్యవాదాలు. ఆరోగ్య తెలంగాణ సాధనకు అందరం కృషి చేయాలి' అని ముగించారు అస్కా సలోమీ.

...దాయి శ్రీశైలం 📷 రాజేశ్ నర్రె

## పేల నివారణ ఇలా..



**మహిళలు, పురుషులనే తేడాలేకుండా నెత్తిలో పేను సమస్య అందరిలో ఉన్నది. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తాయి. ఇలాంటి సమస్య రోజూ ఇబ్బందికరంగా మారుతుంది. కాబట్టి ఇంట్లోనే చిన్న చిట్కాలు పాటిస్తే ఈ సమస్య నుంచి బయట పడొచ్చు..**

**ఉప్పు :** పేన్లు నివారణకు ఉప్పు సాయపడుతుంది. అర కప్పు వెనిగర్‌లో ఐదు స్పూన్ల ఉప్పు వేసి కలుపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించాలి. రెండు గంటల తర్వాత జుట్టును దువ్వుకొని శుభ్రపరుచుకోవాలి. ఈ పద్ధతిని వారంలో రెండు సార్లు చేయడం ద్వారా అనుకూల ఫలితాలు కనిపిస్తాయి.

**వెల్లుల్లి :** వెల్లుల్లి నుంచి వచ్చే బలమైన వాసన పేను నివారణకు బాగా ఉపయోగపడుతుంది. వెల్లుల్లిని మెత్తగా చేసి అందులో కొంచెం నిమ్మరసం కలుపాలి. ఈ మిశ్రమాన్ని నెత్తికి పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత దువ్వితే చనిపోయిన పేన్లు కింద రాలుతాయి. అనంతరం వేడి నీటితో తలస్నానం చేయాలి.

**వైట్ వెనిగర్ :** రాత్రి నిద్రపోయే ముందు తలకు వైట్ వెనిగర్ పట్టించాలి. తలకు టవల్, షవర్ క్యాప్‌ను చుట్టేసి నిద్రపోవాలి. ఉదయాన్నే షాంపూతో జుట్టును శుభ్రం చేసుకోవాలి. దీంతో పేలు బయటపడతాయి.

**బేబీ అయిల్ :** పేన్ల నివారణకు బేబీ అయిల్ కూడా పని చేస్తుంది. దీన్ని కూడా తలకు రాసుకోవాలి. కొద్దిసేపటి తర్వాత లాండ్రీ డిటర్జెంట్, వేడినీటితో తల శుభ్రం చేసుకుంటే సరి.

## కన్నుగీటిన ఐఏఎస్ టాపర్!



**ఓ పాటలో కన్ను గీటి మరీ సామాజిక మాధ్యమాల్లో ఫాలోవర్లను పెంచుకున్నది ప్రియావారియర్. ఆమె బాటలోనే రాజస్థాన్‌కు చెందిన ఓ ఐఏఎస్ టాపర్ కన్ను గీటిన వీడియో ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్నది.**

2016లో ఐఏఎస్ టాపర్‌గా నిలిచిన టీనా దబీఖాన్.. ఆమె చేతికి ఉన్న మెహందీని చూపిస్తూ.. ఓ వీడియోలో సరదాగా కన్ను గీటింది. ఈ వీడియో ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్ వ్యూయర్స్‌ను అట్రాక్ట్ చేస్తున్నది. టీనా దబీ ప్రస్తుతం రాజస్థాన్‌లోని బిల్వారాలో సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్నారు. ఈమె వీడియోని ఇప్పటికే 60 వేల మంది చూశారు. మరో రెండు రోజుల్లో ఈ వ్యూస్ లక్ష దాటేలాగే ఉన్నాయి. టీనా దబీకి గతేడాది అథర్ అమీర్ ఉల్ షఫీ ఖాన్‌తో వివాహం జరిగింది. ఈ వేడుకకు రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు, ఇతర మంత్రులు హాజరయ్యారు. అంత పెద్ద హోదాలో ఉండి అలా కన్ను గీటడం ఏ మాత్రం బాగా లేదని కొందరు అంటున్నారు. కొందరేమో ఆమెను చూసి ముగ్ధులమైపోతున్నామని కామెంటు విసిరారు. ఇలా ఎవరికి నచ్చినట్లుగా వారు స్పందిస్తున్నారు.

### వంటింటి చిట్కాలు

- పచ్చిమిర్చి ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే.. తొడిమెలు తొలగించి కవర్లో, డబ్బాలో వేసి ఫ్రిజ్‌లో పెట్టాలి.
- పెరుగు తొందరగా పులిసి పోకుండా ఉండడానికి అందులో రెండు పచ్చి కొబ్బరి ముక్కలు వేయాలి.
- వంటగదిలో ఎక్కువగా పురుగులు కనిపిస్తుంటాయి. ఒక వేళ మీ వంటగదిలో ఉంటే అవి ఎక్కువ కనిపించే ప్రదేశంలో దాల్చిన చెక్క, పొడిని ఉంచడం వల్ల పురుగులు దరిదాపుల్లోకి కూడా రావు.
- ఎక్కువ మోతాదులో వెల్లుల్లిపాయల పొట్టు సులభంగా తీయాలంటే వెల్లుల్లిపాయాలతో పాటు కొంత బియ్యంపిండి, గోధుమ పిండి ఒక సంచిలో వేసి నలపాలి. పొట్టు సులభంగా తొలిగిపోతుంది.



- కోడిగుడ్లు ఉడకబెట్టేటప్పుడు ఒక్కోసారి అవి నీటిలోనే పగిలిపోతాయి. ఆ నీటిలో కొంచెం నిమ్మరసం పిండితే గుడ్లు పగులకుండా ఉంటాయి.

## వానకాలం జాగ్రత్తలు



**వానకాలం వచ్చేసింది. ఈ సీజన్‌లో రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. అందుకే ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి. తీసుకొనే ఆహారంలోనూ జాగ్రత్తగా ఉండాలి.**

వానకాలంలో నీరు ఎక్కువగా కలుషితం అవుతుంది. పైప్‌లైన్లు లీక్ అయి మురికి నీరు అందులోకి చేరే ప్రమాదం ఉంది. కాబట్టి సాధ్యమైనంత వరకూ ఇంట్లో సురక్షితమైన తాగునీటిని తయారు చేసుకొనే పద్ధతులు పాటించాలి. ఆహార విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి. అనవసరమైన ఆహారం తీసుకోవడం తగ్గించాలి. ఆవిరితో ఉడికించిన తేలికపాటి ఆహారాన్నే తీసుకోవాలి. సాధ్యమైనంత వేపుళ్లకు దూరంగా ఉండాలి. మొక్కజొన్న వంటి గ్రిల్డ్ ఆహారం తీసుకోవడం మంచిది. తాజాగా ఉండే పండ్ల రసాలు, తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవడం మంచిది. విటమిన్ సీ ఎక్కువ ఉండే దానిమ్మ, కివీ, నారింజ పండ్లు తినాలి. జలుబు, దగ్గుతో బాధపడుతున్నట్టయితే వాటి నివారణకు సి విటమిన్ పని చేస్తుంది. వేడి పాలల్లో పసుపు వేసుకొని తాగడం, నువ్వులు, బెల్లంలాంటివి ఆహారంలో భాగం చేసుకోవాలి. వేడినీటిలో ఉప్పు వేసి పుక్కిలించడం, ముఖానికి నీటి ఆవిరి పట్టించడం వల్ల సైనస్, చలి వంటి సమస్యలు దూరం అవుతాయి. ఐస్‌క్రీమ్‌లు, కూల్ డ్రింక్‌లు పూర్తిగా మానేయడం మంచిది. ముఖ్యంగా పానీ పూరీ వంటి పదార్థాలకు, రోడ్ల మీద అమ్మే ఆహారానికి దూరంగా ఉండాలి.

II.
నమస్తే తెలంగాణ
నిధి
[ కరీంనగర్ ]
శనివారం 6 జూలై 2019

కొత్త పథకం

# ఉద్యోగులకు సరికొత్త ఫండ్

మహీంద్రా హైబ్రిడ్ ఈక్విటీ నివేష్ యోజన ■ ఆవిష్కరించిన మహీంద్రా మ్యూచువల్ ఫండ్ ఎండీ
కనీస పెట్టుబడి.. రూ.1,000 ■ ఎన్ఎఫ్‌వో చివరి తేది: జులై 12

మహీంద్రా మ్యూచువల్ ఫండ్ సరికొత్త ఓపెన్ ఎండెడ్ ఫండ్‌ను ప్రకటించింది. దీనికి 'మహీంద్రా హైబ్రిడ్ ఈక్విటీ నివేష్ యోజన' అని పేరు పెట్టింది. దీర్ఘకాలంలో తమ మూలధనం వృద్ధి చెందాలని కోరుకునే పెట్టుబడిదారులు, ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత ఇన్‌స్ట్రుమెంట్స్, డెబిట్, మనీ మార్కెట్ ద్వారా ఆదాయం ఆర్జించాలనుకునే మదుపరుల కోసం ఈ ఫండ్ చక్కగా నప్పుతుందని సంస్థ చెబుతున్నది. ఈ స్కీమ్ 65 నుంచి 80 శాతం ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీలో పెట్టుబడి పెడితే, 20– 25 శాతం వరకూ డెట్, మనీ మార్కెట్ సెక్యూరిటీలలో పెట్టుబడి పెడుతుంది. 10 శాతం వరకు రీట్లు విడుదల చేసిన యూనిట్లలో పెట్టుబడి పెడుతుంది. ఈ ఫండ్ జులై 12 వరకూ అందుబాటులో ఉంటుంది.

**ఉద్యోగులు, చిన్న వ్యాపారులకు..**
మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టడానికిదీ చాలా అనుకూలమైన సమయం. ఈ స్కీములో ఎలాంటి రిస్క్ ఉండదు. గత మూడేండ్లుగా మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టేందుకు ఉద్యోగులు, చిన్న వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడిదారులు ఇప్పుడు విధానపరమైన సంస్కరణలు, ఉద్దీపన ప్యాకేజీలు వంటివి ప్రభుత్వ నుంచి కోరుకుంటున్నారు. మార్కెట్ దిశ అనేది ఆదాయాల వృద్ధి పంపిణీ, అంతర్జాతీయ అంశాలపై ఆధారపడి ఉంటుంది. దీర్ఘకాలిక లక్ష్యాలను ప్రణాళిక చేయడానికి అనువైన వృద్ధిపై దృష్టి కేంద్రీకరించి సమతుల్యమైన పోర్ట్‌ఫోలియోను అందిస్తుంది. పెట్టుబడి పెట్టాలనుకునే వారు మహీంద్రా ఈక్విటీ నివేష్ యోజన వైపు దృష్టి సారించొచ్చు.



- ఆశుతోష్ బిష్ణోయ్, ఎండీ అండ్ సీఈవో, మహీంద్రా మ్యూచువల్ ఫండ్

# రూ.లక్ష పెడితే.. 3.20 కోట్లు?




ద్రవ్యోల్బణాన్ని అధిగమించి మదుపరులకు మంచి లాభాల్ని తెచ్చి పెట్టడంలో ఈక్విటీని మించింది లేదని చెప్పొచ్చు. కాకపోతే, దీర్ఘకాలం పాటు వేచి చూస్తేనే ఇది సాధ్యమవుతుంది. పైగా, నష్టభయమూ అధికంగానే ఉంటుంది. మార్కెట్ ఒడుదొడుకులకు అనుగుణంగా పెట్టుబడుల విలువ అమాంతం పెరగొచ్చు. అంతే జోరుగా పడిపోవచ్చు. కాకపోతే, మార్కెట్‌ను క్షుణ్నంగా అర్థం చేసుకుని, ప్రణాళికాబద్ధంగా అడుగులు ముందుకేసి, దీర్ఘకాలం వేచి చూసేవారికి.. ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడి పెట్టడమే సరైన నిర్ణయమని చెప్పొచ్చు.

పెట్టుబడి సాధనం ఏదైనా.. పక్కా వ్యూహంతో అడుగు ముందుకేయాలి. అందుకు తగ్గ లక్ష్యాల్ని ఏర్పాటు చేసుకోవాలి. సమయానికి తగ్గ నిర్ణయాలు తీసుకోవాలి. దీర్ఘకాలాన్ని దృష్టిలో పెట్టుకుంటేనే అధిక లాభాల్ని ఆర్జించొచ్చు. స్వల్పకాలపు ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడానికి పొదుపు పథకాలను ఆశ్రయించాలి. దీర్ఘకాలాన్ని పరిగణనలోకి తీసుకునేవారు పెట్టుబడులపై దృష్టి సారించడం మేలు. అధిక మొత్తంలో లాభాలను అందుకోవాలని ఆశించేవారు రిస్క్ కూడా అదే స్థాయిలో తీసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా మదుపరులు తమ వయసు ప్రాతిపదికన ఈక్విటీలలో ఎంత పెట్టుబడి పెట్టాలో నిర్ణయించుకోవాలి. ఉదాహరణకు, మీ వయసు 30 అయితే, ఈక్విటీలో 70 శాతం సొమ్మును మదుపు చేయాలి. కొంత రిస్క్ ఎక్కువైనా ఫర్వాలేదనుకునేవారు.. మరో 5 నుంచి 10 శాతం దాకా సొమ్మును పెంచుకోవచ్చు. మిగతా మొత్తాన్ని నష్టభయం తక్కువున్న పొదుపు పథకాల్లో మదుపు చేయవచ్చు. వయసును బట్టి ఈ శాతాన్ని ఎవరైనా మార్చుకోవచ్చు. భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్క మదుపరి పలు అంశాలపై దృష్టి సారించాలి.

### మంచి అవకాశాల కోసం..

స్టాక్ మార్కెట్ అంటేనే అస్థిరతకు మారుపేరు. అయినప్పటికీ ఎల్లప్పుడూ మార్కెట్ అస్థిరంగా ఉంటుందని కచ్చితంగా చెప్పలేం. కాకపోతే, మార్కెట్ అస్థిరంగా ఉన్నప్పుడే స్టాక్ ధరలు అధికంగా పతనమవుతుంటాయి. ఇలాంటి సమయాల్లో కంపెనీ ఫండమెంటల్స్‌తో సంబంధం లేకుండా మంచి కంపెనీల స్టాక్స్ కూడా పడిపోతాయి. ఇదే సమయాన్ని స్టాక్ మార్కెట్లో సేల్ టైం అని చెప్పొచ్చు. అనగా, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి వాటిల్లో ఆఫర్ సేల్ ఉన్నప్పుడు తక్కువ ధరలో మనకు వస్తువులు దొరికినట్టుగానే స్టాక్ మార్కెట్‌లో కంపెనీలు డిస్కౌంట్‌లో దొరుకుతాయి. తెలివైన మదుపరులు ఇలాంటి సమయంలో దీర్ఘకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పేరెన్నిక గల కంపెనీల స్టాకులను తక్కువ రేటులో కొనుగోలు చేస్తారు. ఇలా చేయడం వల్ల అధిక రాబడిని పొందే అవకాశముంది. అలా అని పడిన ప్రతి కంపెనీ కొనడం కాకుండా మంచి కంపెనీలను గుర్తించి వాటిని కొనుగోలు చేయాలి.

- ఈక్విటీ మార్కెట్‌లో ప్రవేశించాలని కోరుకునేవారు కనీసం ఐదు నుంచి ఎనిమిదేండ్ల వరకూ వేచి చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే, స్టాక్ మార్కెట్ నాలుగు రకాలుగా వ్యవహరిస్తుంది. కూడబెట్టడం, అనూహ్యంగా పెరగడం, పంపిణీ, ఒకేసారి పడిపోవడం వంటివి సర్వసాధారణంగా జరుగుతాయి. కాకపోతే, ఈ మొత్తం జరగడానికి ఎంతలేదన్నా ఐదు నుంచి ఎనిమిదేండ్లు పడుతుంది. కాబట్టి, మదుపరులు నష్టభయాన్ని తగ్గించుకోవాలంటే, స్టాక్ మార్కెట్లో ఎక్కువ కాలం ఉండేలా ప్రణాళికలు రచించాలి. పదవీవిరమణ, చిన్నారుల ఉన్నత విద్య, వారి పెళ్లిళ్లు వంటి దీర్ఘకాలిక అవసరాలకు ఒక ప్రణాళిక ప్రకారం ఈక్విటీ మార్కెట్‌లో పెట్టుబడులు చేయాలి. అలా కాకుండా ఎవరో చెప్పారని షేర్లు అలా కొన్నామా? ఇలా అమ్మేశామా? అంటే కుదరదు. దీని వల్ల నష్ట తీవ్రత ఎక్కువుంటుంది. గత నలభై ఏండ్లలో బీఎస్ఈ సెన్సెక్స్ ను క్షుణ్నంగా గమనిస్తే.. 15.5 శాతం చొప్పున ఆదాయాన్ని అందించింది. ఇదే కాలంలో బంగారం 10.45 శాతం ఆదాయాన్నిచ్చింది. 1979లో ఎవరైనా బీఎస్ఈ సెన్సెక్స్‌లో రూ.లక్ష మదుపు చేసి ఉన్నట్లయితే, ప్రస్తుతం ఆ మొత్తం రూ.3.20 కోట్లు అయ్యిందని గుర్తుంచుకోండి. అదే బంగారంలో మదుపు చేస్తే దాన్ని ప్రస్తుత విలువ.. దాదాపు రూ.53.33 లక్షలే.

### సిప్పే సరైన రూటు..

స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలని కోరుకునేవారు వీలైనంత త్వరగా మదుపు చేయడాన్ని అలవాటు చేసుకోవాలి. అప్పుడే, భవిష్యత్తు అవసరాలకు సరిపడేటంత సొమ్మును జమ చేసుకోవచ్చు. ఒకే మదుపు సాధనంలో సొమ్ము పెట్టడం కంటే.. వివిధ మార్గాల్ని ఆశ్రయించడం అన్నివిధాల ఉత్తమం. ఇందుకోసం 'సిప్' చక్కటి విధానమని చెప్పొచ్చు. ఈ పద్ధతిలో రూ.500లతో కూడా పెట్టుబడిని ప్రారంభించవచ్చు. ఈ విధానంలో మార్కెట్‌లో హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా ప్రతి నెలా పెట్టుబడి జరుగుతుంది. దీని వల్ల మార్కెట్ అస్థిరత్వం అనే రిస్క్‌ను తగ్గించుకోవచ్చు. ఉదాహరణకు, ఫ్రాంక్లిన్ ఇండియా బ్లూచిప్ ఫండ్ ప్రారంభం నుంచి నెలకు వెయ్యి రూపాయల చొప్పున మదుపు చేస్తే.. మన మొత్తం పెట్టుబడి రూ.3.07 లక్షలైంది. దీనిపై 19 శాతం చొప్పున రాబడితో, ప్రస్తుతం రూ.62.68 లక్షలైంది.

### చక్రవడ్డీ మహత్యం..

వడ్డీపై వడ్డీ, అనగా చక్రవడ్డీని అందుకోవాలంటే, ఈక్విటీల్లో దీర్ఘకాలం పాటు మదుపు చేయాలి. నెలకు రూ.5,000 చొప్పున 15 శాతం వార్షిక వడ్డీ చొప్పున 25 ఏండ్లు మదుపు చేస్తే చేతిలో రూ.1.64 కోట్లు వచ్చి పడతాయి. అదే నెలకు వెయ్యి రూపాయలు చొప్పున 15 శాతం వార్షిక వడ్డీ పెరిగితే.. 25 ఏండ్లకు రూ.32.84 లక్షలు అవుతాయి. సుమారు రూ. లక్షను ఫ్రాంక్లిన ఇండియా ప్రైమా ఫండ్‌లో ఆరంభంలో పెట్టుబడి పెట్టాక, 25 ఏండ్లకు రూ.96 లక్షలైంది. రిలయన్స్ గ్రోత్‌ఫండ్‌లో రూ.లక్ష పెట్టుబడి పెడితే 23 ఏండ్లలో అది కాస్త రూ.1.13 కోట్లు అయ్యింది.



పెద్ది శ్రీనివాస్,
వైస్ ప్రెసిడెంట్,
జెన్ మనీ

## ఈక్విటీ ఎందుకు ఉత్తమం?

చరిత్రను క్షుణ్నంగా గమనిస్తే.. ఈక్విటీల్లో మదపు చేయడం వల్లే అధిక ఆదాయాన్ని అందుకోవచ్చు. గత చరిత్రను చూస్తే ఈ విషయం ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ఈక్విటీల నుంచి అధిక ఆదాయం రావడానికి బోలెడు కారణాలున్నాయి. మార్కెట్ స్థితిగతులు, మార్కెట్ సెంటిమెంట్, సంస్థల వార్తలు, అంతర్జాతీయ ప్రమాణాలు వంటి అంశాల ఆధారంగా రిటర్నులు ఆధారపడుతుంది. దీర్ఘకాలం వేచి చూసినట్లయితే, బంగారం, ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే స్టాక్ మార్కెట్లలో మదుపు చేస్తేనే అధిక ఆదాయాన్ని అందుకోవచ్చు. కాకపోతే, ఈక్విటీల్లో ఎంత వేగంగా సొమ్ము చేసుకుంటామో, అంతే తక్కువ కాలంలో మార్కెట్ దారుణంగా పడిపోతుందని మర్చిపోవద్దు. కాబట్టి, ఈక్విటీల్లో లాభంతో పాటు నష్టాన్ని అంతే వేగంగా అందుకోవచ్చని గుర్తుంచుకోండి. కావాలంటే, ఈ పట్టిక చూస్తే.. ఎందులో అధిక ఆదాయం లభిస్తుందనే విషయం మీకే తెలుస్తుంది. ప్రతినెలా రూ.1000 చొప్పున ఒక్కో పెట్టుబడి పథకంలో పెట్టుబడి పెడితే.. వార్షిక ఆదాయం వివిధ కాలాలకు పట్టికలో చూపిన విధంగా ఉంటుంది.

| పెట్టుబడి సాధనం | 37 ఏండ్లు | 30 ఏండ్లు | 25 ఏండ్లు | 20 ఏండ్లు | 15 ఏండ్లు | 10ఏండ్లు | 5 ఏండ్లు |
|---|---|---|---|---|---|---|---|
| పెట్టుబడి మొత్తం | 4.44 | 3.60 | 3.00 | 2.40 | 1.80 | 1.20 | 0. 60 |
| బంగారం | 36.35 | 19.02 | 12.31 | 7.69 | 3.65 | 1.52 | 0. 70 |
| సెన్సెక్స్ | 125.30 | 33.16 | 17.41 | 10.59 | 4.45 | 2.09 | 0. 79 |
| రికరింగ్ డిపాజిట్ | 31.56 | 15.94 | 9.89 | 5.70 | 3.20 | 1.82 | 0. 73 |

( 2019 జులై డేటా ప్రకారం.. విలువ లక్షల్లో, ప్రతినెలా వెయ్యి రూపాయలు చొప్పన సిప్‌లో మదుపు, యావరేజీలో ఆర్‌డీ రేట్లు)

## స్టాకులు మేలా? మ్యూచువల్ ఫండ్లా?

ఈక్విటీ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలని నిర్ణయించుకున్నాక కలిగే మొదటి సందేహం.. స్టాక్స్‌లో పెట్టాలా? లేక మ్యూచువల్ ఫండ్లలో చేయాలా? ఎవరికైతే మార్కెట్ గురించి అవగాహన ఉండి, కంపెనీల పనితీరును ఎప్పటికప్పుడు గమనించగలరో అలాంటి వారు తమ పెట్టుబడిలో అధిక భాగాన్ని నేరుగా స్టాక్స్‌లో పెట్టొచ్చు. అలా కాకుండా, మొదటిసారిగా పెట్టుబడి పెట్టేవారు మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవడం ఉత్తమం. సాధారణంగా, ఒక వ్యక్తి రిస్క్ తీసుకునే సామర్థ్యాన్ని బట్టి వారి ఈక్విటీ పోర్ట్‌ఫోలియో ఎలా ఉండాలో మీరే చూడండి.

**సంప్రదాయ మదుపరి**
- స్టాక్స్: లార్జ్ క్యాప్ 80 శాతం, మిడ్ క్యాప్ 20 శాతం
- మ్యూచువల్ ఫండ్స్: లార్జ క్యాప్ 50 శాతం, మల్టీక్యాప్ 40 శాతం, మిడ్ క్యాప్ 10 శాతం

**మధ్యస్థ మదుపరి:**
- స్టాక్స్: లార్జ్ క్యాప్ 70 శాతం, మిడ్ క్యాప్ 20 శాతం, స్మాల్ క్యాప్ 10 శాతం
- మ్యూచువల్ ఫండ్స్: లార్జ్ క్యాప్ 30 శాతం, మల్టీక్యాప్ 30 శాతం, మిడ్ క్యాప్ 30 శాతం, స్మాల్ క్యాప్ 10 శాతం

**దూకుడు మదుపరి:**
- స్టాక్స్: లార్జ్ క్యాప్ 50 శాతం, మిడ్ క్యాప్ 30 శాతం, స్మాల్ క్యాప్ 20 శాతం
- మ్యూచువల్ ఫండ్: లార్జ్‌క్యాప్ 30 శాతం, మల్టీ క్యాప్ 20 శాతం, మిడ్ క్యాప్ 35 శాతం, స్మాల్ క్యాప్ 15 శాతం (థీమెటిక్/సెక్టారల్ ఫండ్లు ఐచ్ఛికం)




## క్యాన్సర్ పాలసీకి ఖర్చు ఎంత..



**ఇంట్లో ఎవరైనా క్యాన్సర్ బారిన పడితే చాలు, ఆ కుటుంబమంతా తల్లడిల్లిపోతుంది. దీన్ని త్వరగా గుర్తించగలిగినా.. చికిత్సకు మాత్రం లక్షలు వదిలించుకోక తప్పదు. మనలో చాలామంది చేతిలో ఉన్న సొమ్మంతా ఊడ్చేసి ఖర్చు చేస్తారు. అదీ చాలకపోతే, అందినకాడికి అప్పులూ చేసేస్తారు. ఒకవేళ, ఇంటి పెద్ద క్యాన్సర్ బారిన పడితే.. ఆ కుటుంబం చితికిపోతుంది. మరి, ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైతే ఏం చేయాలి?**

క్యాన్సర్ చికిత్సకు ఎంతలేదన్నా రూ.15 లక్షలు ఖర్చవుతుందని చెప్పొచ్చు. వివిధ రకాల ఆస్పత్రులు, రోగం దశ, ద్రవ్యోల్బణం దృష్టిలో పెట్టుకుని లెక్కిస్తే ఈ ఖర్చు పెరుగుతుందే తప్ప తగ్గే ప్రసక్తే ఉండదు. అందుకే, అత్యవసర పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని, ఈ పాలసీని తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎంతలేదన్నా కనీసం రూ.15 లక్షల మొత్తం వరకూ పాలసీ తీసుకోవాలి. అయితే, ఇది ప్రస్తుత పరిస్థితుల్లో అయ్యే ఖర్చు మాత్రమే. చాలామంది దీర్ఘకాలాన్ని దృష్టిలో పెట్టుకుని, అంటే దాదాపు ఎనభై ఏండ్ల వరకూ వర్తించేలా పాలసీని ఎంచుకుంటారు. వచ్చే ఇరవై, ఇరవై ఐదేండ్లలో 5 నుంచి 6 శాతం ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుంటే, భవిష్యత్తులో ఖర్చు కనీసం రూ.40 నుంచి రూ.50 లక్షలయ్యే అవకాశమున్నది.

### ఖర్చు ఎంత?


ఈ పాలసీని తీసుకునేవారు చికిత్సకు అయ్యే ఖర్చును దృష్టిలో పెట్టుకుని ప్రీమియాన్ని ఎంచుకోవాలి. ఉదాహరణకు, సిగరెట్ తాగే అలవాటు లేని 30 ఏండ్ల పురుషులు.. ఓ రూ.15 లక్షల మొత్తానికి పాలసీ తీసుకుంటే.. ప్రీమియం రూ.1500 నుంచి 7,800 దాకా చెల్లించాల్సి ఉంటుంది. బీమా సంస్థలను బట్టి గరిష్ఠంగా 51 ఏండ్ల నుంచి 80 ఏండ్ల వయసు వరకూ పాలసీని అందజేస్తారు. దీన్ని ఎంచుకునేటప్పుడు ఏయే అంశాలకు కవరేజీ ఉంటుందనే విషయాన్ని తప్పకుండా తెలుసుకోవాలి. క్యాన్సర్ వివిధ దశలు, ప్రతి దశలో పరిహారం, ప్రీమియం వెనక్కి ఇవ్వడం, బహుళ రకాల క్యాన్సర్లు, మైనర్ లైఫ్ కవరేజీ, నెలకు కొంత మొత్తాన్ని కూడా పాలసీదారుడికి చెల్లించడం వంటి ప్రత్యేకతల గురించి కనుక్కోవాలి. అయితే, మన అవసరాల్ని బట్టి పాలసీని ఎంచుకోవాలని గుర్తుంచుకోండి.

### మొహమాటం లేకుండా అడగాలి!

ఆరోగ్య పాలసీ విషయంలో కొన్ని పదాలు గమ్మత్తుగా ఉంటాయి. నిబంధనలు విచిత్రంగా ఉంటాయి. కాబట్టి, ఈ పాలసీని ఎంచుకునేటప్పుడు మొహమాటం లేకుండా ప్రతి అంశాన్ని తప్పకుండా తెలుసుకోవాలి. ప్రస్తుతం వంద రకాల క్యాన్సర్ ప్లాన్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. కాబట్టి, ఏయే అంశాలకు పాలసీలో కవరేజీ ఉందనే విషయాన్ని తెలుసుకున్నాకే అడుగు ముందుకేయాలి. ఊపిరితిత్తులు, రొమ్ము, అండాశయ, కడుపు, వీర్యగ్రంథి, బ్రెయిన్ ట్యూమర్ తదితర వాటికి కవరేజీ ఇచ్చే పాలసీలున్నాయని గుర్తుంచుకోండి.

**కేవలం అవగాహన కోసమే ఈ కథనాలు. నిపుణుల సలహాలు తీసుకున్నాకే పొదుపు- మదుపు విషయాల్లో తుది నిర్ణయం తీసుకోవాలి.**

గృహరుణం తీసుకుంటే చాలు.. అప్పు తీరడానికి కనీసం ఇరవై,ఇరవై ఐదేండ్లు పడుతుంది. మనం ఎంచుకున్న వ్యవధిని బట్టి రుణం తీర్చాల్సి ఉంటుంది. అయితే, నెలసరి ఈఎంఐ కడుతూనే.. రుణ మొత్తంపై 0.1 శాతం సొమ్మును సిప్ (సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్)లో మదుపు చేస్తే.. గృహ రుణంపై మనం చెల్లించిన వడ్డీ కంటే అధిక సొమ్ము మన చేతికొస్తుందనే విషయం మనలో చాలామందికి తెలియదు.




## సుడోకు

డైలీ సుడోకు 82 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 7 | 4 | 9 | 1 | 2 | 8 | 5 | 3 |
| 1 | 2 | 8 | 5 | 6 | 3 | 7 | 9 | 4 |
| 9 | 5 | 3 | 8 | 7 | 4 | 1 | 6 | 2 |
| 7 | 4 | 9 | 1 | 3 | 5 | 6 | 2 | 8 |
| 2 | 8 | 1 | 4 | 9 | 6 | 3 | 7 | 5 |
| 5 | 3 | 6 | 2 | 8 | 7 | 9 | 4 | 1 |
| 3 | 9 | 2 | 7 | 4 | 1 | 5 | 8 | 6 |
| 8 | 6 | 5 | 3 | 2 | 9 | 4 | 1 | 7 |
| 4 | 1 | 7 | 6 | 5 | 8 | 2 | 3 | 9 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -83

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 7 | | | | 5 | | | |
| | 8 | 3 | 4 | 7 | | | | |
| | | 4 | | 8 | 2 | | | 7 |
| | 6 | 8 | | | | | 7 | 2 |
| | | | | | | | | |
| 2 | 5 | | | | | 8 | 1 | |
| 4 | | | 8 | 2 | | 7 | | |
| | | | | 4 | 6 | 5 | 2 | |
| | | | 9 | | | | 8 | |



# కార్మికుల కోసం ఖర్చెంత?

III.
నమస్తే తెలంగాణ
సంపద
[ కరీంనగర్ ]
శనివారం 6 జూలై 2019

నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులకు కనీస సౌకర్యాల్లేక దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్‌లో పని చేసే నిర్మాణం వద్ద తాత్కాలిక షెడ్లలో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. కార్మికులకు వచ్చే కొద్దిపాటి ఆదాయంతో సొంత ఇంటిలోనో, అద్దె ఇంటిలోనో ఉండే పరిస్థితి లేనే లేదు. భవన నిర్మాణ కార్మికులు పని ప్రదేశాల్లో ఇబ్బందులను ఎదుర్కొంటున్నా బిల్డర్లు కనీస సదుపాయాలు కల్పించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అయినా కార్మికుల సంరక్షణపై బిల్డర్లు దృష్టి సారించడం లేదని సమాచారం. ఒక్కొక్కరికీ ఇచ్చే 100 చ.అ స్థలంలోనే బతుకీడుస్తున్నారు. సరైన నీటి సదుపాయం, డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కార్మిక చట్టాల ప్రకారం భవన నిర్మాణ కార్మికులకు భద్రత, కనీస వేతనం, ఓవర్ టైం ఛార్జీలు, వారంతపు సెలవులు వంటివి అందించాలి. కానీ, కేవలం కొందరే కార్మికుల చట్టాలను పక్కాగా అమలు చేస్తున్నారు. చట్టాలను సరిగా అమలు చేయాల్సిన అధికారులూ కార్మికుల సమస్యలపై దృష్టి సారించట్లేదనే విమర్శలున్నాయి. భవన నిర్మాణ రంగంలో చాలా మంది కార్మికులు గ్రామాల నుంచి వలస వచ్చిన వారే. గ్రామాల్లో ఉపాధి లేకపోవడంతో వారు తిరిగి వెళ్లే పరిస్థితి లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని బిల్డర్లే వారికి కనీస సదుపాయాలు, కనీస వేతనం అందించాలి. రియల్ రంగం మందగించడంతో చాలా మంది బిల్డర్లు అదనపు ఖర్చులను భరించలేకపోతున్నారు. కొందరైతే సరైన సమయంలో కార్మికులకు వేతనాలూ ఇవ్వడం లేదు. కార్మిక శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి, తరచూ తనిఖీ చేస్తూ కార్మికులకు అవసరమయ్యేలా అన్ని సౌకర్యాల్ని కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

# ఇండ్ల కొనుగోళ్లకు ఊతం!

మధ్యతరగతి ప్రజానీకం సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ప్రోత్సహించేలా 2019 బడ్జెట్‌కు రూపకల్పన చేశారని నిర్మాణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రూ.45 లక్షల్లోపు ఇండ్లను కొనుక్కునేవారికి దాదాపు రూ.3.5 లక్షల దాకా ఆదాయ పన్ను రాయితీ లభించేలా కీలక నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. దీన్ని పదిహేనేండ్లకు లెక్కిస్తే దాదాపు రూ.7 లక్షల దాకా పన్ను ప్రయోజనం ఉంటుంది. అందుబాటు గృహాల్ని నిర్మించేందుకు అవసరమయ్యే స్థలాలను కేంద్రమే కేటాయిస్తుందని ప్రకటించడం పట్ల దేశీయ నిర్మాణ రంగం హర్షం వ్యక్తం చేస్తున్నది. గత కొన్నేండ్ల నుంచి నిర్మాణ సంస్థలు ఎదుర్కొంటున్న నిధుల కొరతను తీర్చేందుకు కేంద్రం ప్రయత్నించిందని అంటున్నారు. కాకపోతే, ఒక శాతం ఇన్‌ఫ్రా సర్‌ఛార్జీ విధించడం, కస్టమ్స్ సుంకం పెంచడం వల్ల నిర్మాణ సామగ్రి ధరలు పెరిగే ఆస్కారముందని చెబుతున్నారు.



దేశంలోని నగరాల్లో నిరుపేదల సొంతింటి కల సాకారం కావాలన్నదే కేంద్ర లక్ష్యం. అందుకే, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని ఐదేండ్ల క్రితం ఆవిష్కరించింది. దీని కింద నేటివరకూ దాదాపు కోటి ఇరవై ఐదు లక్షల ఇండ్లను నిర్మించామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. మరో, 1.95 కోట్ల గృహాలను 2021–22 లోపు పూర్తి చేస్తామని అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 81 లక్షల గృహాలను మంజూరు చేసినట్లు, అందులో 47 లక్షల గృహాల నిర్మాణం ప్రారంభం కాగా, 24 లక్షల గృహాలను అందజేసినట్లు వెల్లడించారు. ఇందుకోసం ఓ కీలకమైన నిర్ణయాన్ని ఆమె తీసుకున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వద్ద ఉన్న స్థలాలను తీసుకుని, వాటిని అందుబాటు గృహాల నిర్మాణం కోసం కేటాయిస్తామని అన్నారు. దీని వల్ల అందుబాటు గృహాలను నిర్మించడానికి అధిక శాతం మంది డెవలపర్లు ముందుకొస్తారని ఆమె అంచనా వేస్తున్నారు. జాతీయ స్థాయి అద్దె చట్టాన్ని మెరుగ్గా తీర్చిదిద్ది, రాష్ట్రాలకు అందజేస్తామని తెలిపారు. ఇది పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాక దేశవ్యాప్తంగా అద్దె గృహాలకు ఎక్కడ్లేని గిరాకీ పెరిగే ఆస్కారం ఉంటుంది. కాకపోతే, ఆ పథకాన్ని మళ్లీ ఎప్పుడు ప్రకటిస్తారనేది మిలియన్ డాలర్ ప్రశ్న. కస్టమ్స్ సుంకం పెరగడం వల్ల మార్బుల్ శ్లాబులు, సీసీటీవీ కెమెరాలు వంటి ధరలు అధికమవుతాయి.

## ఆర్‌బీఐదే బాధ్యత..

నిర్మాణ సంస్థలు ఎదుర్కొంటున్న నిధుల కొరతను పరిష్కరించడానికి ఆర్థిక మంత్రి నడుం బిగించారు. రీట్లు (రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్). ఇన్విట్స్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్)లలో విదేశీ పోర్ట్‌ఫోలియో (ఎఫ్‌పీఐ) ద్వారా పెట్టుబడులను పెట్టేందుకు అనుమతించారు. దీని వల్ల ఈ రంగంలో పెట్టుబడులు పెరిగేందుకు ఆస్కారమున్నది. పైగా, ఎన్‌ఆర్‌ఐ పోర్ట్‌ఫోలియోను ఎఫ్‌పీఐతో అనుసంధానం చేసేందుకు ప్రతిపాదించడం కలిసొచ్చే నిర్ణయమని డెవలపర్లు అంటున్నారు.

- కార్పొరేట్ బాండ్లలో సంస్కరణలను చేపట్టడం వల్ల డెవలపర్లకు దీర్ఘకాలానికి గాను సులువుగా నిధులు లభించే అస్కారమున్నది.
- ఇక నుంచి హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలను నియంత్రించే బాధ్యతను రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాకు అప్పగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్నది. దీని వల్ల నిర్మాణ సంస్థలకు సులువుగా రుణాలు లభించే అవకాశమున్నది.
- ఆస్తి కొనుగోలు కోసం చేసే చెల్లింపులపై టీడీఎస్ వర్తింపజేయడం తెలిసిందే. ఇక నుంచి క్లబ్ మెంబర్ షిప్ ఫీజు, కార్ పార్కింగ్, విద్యుత్తు, మంచినీరు, మెయింటనెన్స్ రుసుము వంటి చెల్లింపులపై టీడీఎస్ వర్తిస్తుంది.
- అందుబాటు గృహాల నిర్వచనాన్ని మార్చివేశారు. మెట్రో నగరాల్లో అందుబాటు గృహాలపై కార్పెట్ ఏరియా పరిమితిని 30 చదరపు మీటర్ల నుంచి 60 మీటర్లకు పెంచారు. మెట్రోయేతర నగరాల్లో 60 చదరపు మీటర్ల నుంచి 90 చదరపు మీటర్లకు పెంచారు.
- 'అందరికీ గృహాలు' పథకాన్ని ప్రోత్సహించేందుకు ఆర్థిక మంత్రి చక్కటి నిర్ణయాన్ని ప్రకటించారు. వీటిని నిర్మించే డెవలపర్లు ఆర్జించే లాభాలపై ట్యాక్స్ హాలీడేను ప్రకటించారు. దీంతో, ఈ గృహాలను చేపట్టడానికి అధిక శాతం మంది డెవలపర్లు ముందుకొచ్చే అవకాశముంది. మెట్రో నగరాల్లో వీటిని శివారు ప్రాంతాల్లో నిర్మించాల్సి ఉంటుంది. కాబట్టి, అక్కడ మౌలిక సదుపాయాల్ని అభివృద్ధి చేసే విషయంపై దృష్టి సారిస్తే మెరుగ్గా ఉంటుందని హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ సంస్థలు అంటున్నాయి.



## నిధుల కొరత దూరం!



నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న నిధుల కొరతను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. విదేశీ పెట్టుబడులను దేశీయ మార్కెట్లోకి ప్రోత్సహించడానికి ప్రత్యేక చర్యల్ని తీసుకున్నారు. అద్దె గృహాలను ప్రోత్సహించడానికి స్థలాన్ని కేటాయించడం, ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం చక్కటి నిర్ణయం. ఇంటి కొనుగోలుపై వడ్డీ రాయితీని రూ.45 లక్షలకే పరిమితం చేయాల్సిన అవసరం లేదు. మొత్తానికి, కేంద్ర బడ్జెట్ నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేలా ఉన్నది.

**- జక్సే షా, ఛైర్మన్, క్రెడాయ్ నేషనల్**

## ఆర్‌బీఐకి బాధ్యత.. మంచి నిర్ణయం



హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు రుణాల్ని మంజూరు చేయడానికి నేషనల్ హౌసింగ్ బ్యాంకు మీద ఆధారపడేవి. ఇప్పుడా బాధ్యతను ఆర్‌బీఐకి అప్పగించడం వల్ల నిర్మాణ సంస్థలకు అవసరమయ్యే నిధులు లభించడానికి ఆస్కారమున్నది. ఓవర్‌డ్రాఫ్ట్, ప్రాజెక్టు ఫైనాన్స్, మార్టిగేజ్ రుణాలు వంటివి డెవలపర్లకు లభించే ఆస్కారమున్నది. ఇక నుంచి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా సాధారణ బ్యాంకు తరహా వ్యవహరిస్తే.. నిర్మాణ రంగానికి సులభంగా నిధులు లభిస్తాయి.

**- సి.శేఖర్‌రెడ్డి, ఛైర్మన్, ఐజీబీసీ హైదరాబాద్**

## అద్దె చట్టానికి సవరణ



అద్దె చట్టాలను సవరించాలని క్రెడాయ్ కొంతకాలం నుంచి కోరుతున్నది. అందుబాటు గృహాలకు స్థలాల్ని కేటాయించాలని అభ్యర్థిస్తున్నది. ఈ రెండు అంశాలపై ఆర్థిక మంత్రి దృష్టి సారించడం స్వాగతించాల్సిన విషయం. గత ఐదేండ్లలో రియల్ ఎస్టేట్ రంగంలో అతిపెద్ద మూడు సంస్కరణల్ని చేపట్టడాన్ని ఆహ్వానిస్తున్నాం. కార్మిక చట్టాలను నాలుగు కోడ్లకే పరిమితం చేస్తున్నారు. స్వచ్ఛ భారత్‌ను ఘన వ్యర్థాల నిర్వహణ, స్కిల్ డెవలప్‌మెంట్‌కు విస్తరించడం మంచి నిర్ణయం.

**- సతీష్ మగర్, అధ్యక్షుడు, క్రెడాయ్ నేషనల్**

# స్కిల్ డెవలప్‌మెంట్ సీఎస్సార్ కీలకం

**క్రెడాయ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి వి.రాజశేఖర్‌రెడ్డి**



హైదరాబాద్ నిర్మాణ రంగం కార్మికుల కొరత తీవ్రంగా ఎదుర్కొంటున్నది. ఒకవైపు దేశంలో సాంకేతిక విప్లవం పుట్టుకొస్తున్నా.. వాటి ఫలితాలు తెలంగాణ నిర్మాణ రంగం అందుకోవడం లేదు. సకాలంలో కార్మికులు దొరక్కపోవడంతో ప్రాజెక్టులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయలేకపోతున్నారు. ఈ కొరతను అధిగమించడానికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను మెరుగ్గా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని క్రెడాయ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి వి.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. క్రెడాయ్ హైదరాబాద్ సంఘాన్ని పరిచయం చేసే సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నిర్మాణ రంగంలో పని చేస్తున్న ఇంజినీర్లు, మేస్త్రీలు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు వంటి వారికీ ఆధునిక పరిజ్ఞానంపై అవగాహన పెంచాల్సిన అవసరముందన్నారు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణా తరగతుల్ని నిర్వహిస్తామన్నారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

"హైదరాబాద్ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టేందుకు కొత్తవారిని ప్రోత్సహించాలి. వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు అవసరమయ్యే శిక్షణను అందజేయాలి. ఇలాంటి కార్యక్రమాల్ని క్రెడాయ్ హైదరాబాద్ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా చేపట్టాలని అనుకుంటున్నాం. ఇందుకోసం సంఘంలో చర్చించి తగు నిర్ణయాల్ని తీసుకుంటాం. దీని ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నగర నిర్మాణ రంగంలో కార్మికుల కొరత తగ్గుతుంది. చాలామంది క్రెడాయ్ హైదరాబాద్ సభ్యులు, ఎవరికివారే తాము తోచినట్టుగా పేద విద్యార్థులకు సాయం చేస్తుంటారు. స్కూలు, కాలేజీల ఫీజులు చెల్లించడం, పుస్తకాలు కొనిపించడం, ఇతరత్రా పనులను చేస్తుంటారు. ఎవరికి వారే వ్యక్తిగతంగా చేస్తున్న ఇలాంటి కార్యక్రమాలన్నింటినీ ఒకతాటిపైకి తీసుకొచ్చి.. క్రెడాయ్ హైదరాబాద్ ద్వారా చేపడితే మెరుగ్గా ఉంటుంది. ఈ అంశంపై కలిసికట్టుగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందనిపిస్తోంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద మరిన్ని కొత్త కార్యక్రమాల్ని చేపట్టాలి.

- రాష్ట్ర ప్రభుత్వానికి, హైదరాబాద్ నిర్మాణ రంగానికి వారధిగా క్రెడాయ్ హైదరాబాద్ పని చేస్తుంది. నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ప్రోత్సాహకరమైన నిర్ణయాలకు మేం ఎల్లప్పుడూ మద్దతిస్తాం. అదేవిధంగా, సంఘ సభ్యులు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మొత్తానికి, హైదరాబాద్‌లో రియల్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మా వంతు కృషి చేస్తాం. సంఘాన్ని మరింత పటిష్ఠపరిచేందుకు నిత్యం కృషి చేస్తూనే ఉంటాం. దీర్ఘకాలంలో నగర నిర్మాణ రంగం మరింత వృద్ధి చెందేందుకు ప్రయత్నిస్తాం."

శంకర్‌పల్లి
HMDA layout
Empire bluwood
Contact: N. మాణిక్ రెడ్డి
ఫోన్: 9399303555

PREMIUM PLOTS
VIRTUSA LIFE SPACES
VIRTUSA Tuxedo Park
@ SHADNAGAR TOWN
DTCP APPROVED
VIRTUSA CYNOSURE
Near MOKILA
HMDA APPROVED LAYOUT
Ready to Construct
Clubhouse CC Roads
100 ft Road Facing
Excellent Development
Reasonable Price
Under Ground Electrical Cable
94949 74949

# ఎక్కడ.. ఎంత రేటు?




హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లో రెసిడెన్షియల్ ప్లాట్లు కొనుగోలు చేసే వారు ధరల విషయంలో మోసపోతుంటారు. దీనికి ప్రధాన కారణం ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్లాట్ల రేట్లపై వారికి అవగాహన లేకపోవడమే. దీంతో, కొందరు ప్లాటు కొనకుండా వెనకడుగు వేస్తారు. మరి, నగరంలోని ఏయే ప్రాంతాలో ప్లాట్ల ధరలెలా ఉన్నాయో తెలుసుకుంటే ఈ సమస్యే ఉత్పన్నం కాదు. మరి, వివిధ ప్రాంతాల్లో ప్లాట్ల రేట్లు ఎలా ఉన్నాయంటే..

| ప్రాంతం | కనీస ధర | గరిష్ఠ ధర | ప్రాంతం | కనీస ధర | గరిష్ఠ ధర | ప్రాంతం | కనీస ధర | గరిష్ఠ ధర |
|---|---|---|---|---|---|---|---|---|
| అబ్దుల్లాపూర్‌మెట్ | 7000 | 13,000 | గాజుల రామారం | 25,000 | 41,000 | మియాపూర్ | 30,000 | 45,000 |
| ఆదిభట్ల | 12,000 | 19,000 | గండి మైసమ్మ | 12,000 | 22,000 | మోకిలా | 15,000 | 35,000 |
| ఆల్వాల్ | 28,000 | 45,000 | హయత్‌నగర్ | 18,000 | 25,000 | ముత్తంగి | 15,000 | 25,000 |
| అమీన్‌పూర్ | 15,000 | 21,000 | ఇబ్రహీంపట్నం | 7,000 | 12,000 | నాగోల్ | 30,000 | 50,000 |
| బండ్లగూడ | 30,000 | 50,000 | జూబ్లీహిల్స్ | 1,03,443 | 1,55,220 | నానక్‌రాంగూడ | 50,000 | 85,000 |
| బంజారాహిల్స్ | 1,10,000 | 1,50,000 | కీసర | 9,000 | 14,000 | పటాన్‌చెరు | 15,000 | 21,000 |
| బీరంగూడ | 13,000 | 28,000 | కొల్లూర్ | 15,000 | 25,000 | రాజేంద్రనగర్ | 25,000 | 47,000 |
| భానూర్ | 10,000 | 21,000 | కొంపల్లి | 25,000 | 35,000 | షామీర్‌పేట | 12,000 | 17,000 |
| బోడుప్పల్ | 25,000 | 41,000 | కొండాపూర్ | 54,000 | 87,000 | సుల్తాన్‌పూర్ | 12,000 | 20,000 |
| బొల్లారం | 20,000 | 35,000 | కూకట్‌పల్లి | 62,000 | 90,000 | తుక్కుగూడ | 13,000 | 18,000 |
| చందానగర్ | 35,000 | 60,000 | మణికొండ | 40,000 | 72,000 | తుర్కయాంజల్ | 15,000 | 30,000 |
| చర్లపల్లి | 20,000 | 35,000 | మేడ్చల్ | 15,000 | 28,000 | ఉప్పల్ | 30,000 | 48,000 |

(ధర రూ.లలో)

**గమనిక: కేవలం అవగాహన కోసమే ఈ పట్టిక. పూర్తి వివరాలు తెలుసుకున్నాకే తుది నిర్ణయం తీసుకోండి.**

# లగ్జరీ డెకరేషన్ సులువే..



మీ ఇంటిని సరికొత్త రీతిలో ముస్తాబు చేయాలని అనుకుంటున్నారా? ప్రస్తుతం మనలో చాలామంది సౌకర్యవంతమైన, విశాలమైన ఇంటిని, విలాసవంతమైన ఇంటీరియర్స్ ఉండాలని కోరుకుంటున్నారు. కొందరు ఆధునిక డిజైన్లను కోరుకుంటే, మరికొందరు క్లాసిక్ డిజైన్లను ఎంచుకుంటున్నారు.

- తమ ఇంటిని వెలుగులతో నింపాలని అనుకుంటారు. వాల్ బ్రాకెట్స్, టేబుల్ లాంప్స్, స్టాండింగ్ ల్యాంప్స్ వంటితో ఇంటిని అలంకరించుకుంటే చూడడానికి చక్కగా ఉంటుంది.
- ఇంటి అందం ప్రతిబింబించడంలో రంగులదే కీలక పాత్ర. ఇవి ఎప్పుడూ జీవితానికి కొత్తదనాన్ని తీసుకొస్తాయి. నివాసాల్లో, ఆఫీసుల్లో ఆకుపచ్చ, పసుపు, బూడిద రంగులతో డెకరేట్ చేసుకోవాలి.
- తమ ఇంటిని అత్యంత ఆకర్షణీయంగా కనిపించాలని కోరుకునేవారు.. ఆకట్టుకునే రకరకాల కళాకృతులతో అలంకరించుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. వీటితో ఇంటికి సరికొత్త అందం వస్తుంది. మొత్తం ఇంటి ఫ్లోరింగ్ విషయంలో ఆధునిక ఇంటి యజమానులు తెలుపు, నలుపు రంగులకు ప్రాధాన్యతనిస్తే ఉత్తమం.
- ఇంటి డెకరేషన్‌లో ఫ్యాబ్రిక్స్ కూడా ముఖ్యమే. ప్రస్తుతం డమాస్క్, వెల్వెట్స్ వంటి బ్రాండ్ ఫ్యాబ్రిక్స్ ఎక్కువగా వాడకంలో ఉన్నాయి.
- లివింగ్ రూమును మెటల్ కాఫీ టేబుల్, సైడ్ టేబుల్‌తో అలంకరిస్తే చూడటానికెంతో అందంగా కన్పిస్తుంది.
- ప్రతి ఒక్కరూ తమ ఇంటిలో వెచ్చగా ఉండాలని కోరుకుంటారు. అలాంటి వాతావరణంలో తమ కుటుంబాలతో హాయిగా జీవిస్తారు. దానుకనుగుణంగా ఇంటిని ముస్తాబు చేసుకోవడానికి మొగ్గుచూపుతున్నారు.
- ఇటీవల మనలో చాలామంది ఇంటిని చెక్కతో డెకరేట్ చేసుకోవడంపై ఆసక్తి చూపుతున్నారు. చెక్కతో తయారు చేసిన వస్తువులతో అలంకరించుకుంటే ఇల్లు మరింత ఆకర్షణీయంగా మారుతుంది.
- ఇంటిలో ఖాళీగా ఉన్న గోడలపై అల్లికలు, వాల్ పేపర్లను ఏర్పాటు చేసుకుంటే అద్భుతంగా ఉంటుంది.
- అతిథుల కోసం తమ ఇంటిలో చాలా సౌకర్యవంతమైన, విశాలమైన లివింగ్ రూము, డైనింగ్ ఏరియా ఉంటే ఉత్తమం. ఇందుకు తగ్గ డిజైన్ చేయాలి.

ప్రగతి రిసార్ట్స్
మెగా రెసిడెన్షియల్ వెంచర్
ప్రగతి స్ఫూర్తి సెంట్రల్ కౌంటీ
DTCP
(TLP No. 24/2016/H)
9100073539 | 7661033339

PLOTS for SALE
hmda
APPROVED OPEN PLOTS
LP. NO. 67/LO/HMDA/2008.
Revised 2019
HMDA APPROVED FLATS
@ ISNAPUR
NEAR PATANCHERVU
63003 08585, 83330 09449

COMMERCIAL SPACE FOR SALE
@ Kollur
BHEL
Cyber Colony
G+3 Floors
Each Floor 7,800 sqft.
Please Contact:
99493 50006

సిటీకి దగ్గర్లో సిద్ధంగా ప్లాట్లు
ARYAVARTHA
30Min from Secunderabad
hmda
For Site Visit, Call Us
90946 333 33
suchirindia

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
శనివారం 6 జూలై 2019

# చిరుతో మరోసారి..



నయనతార


చిరంజీవి

‘సైరా నరసింహారెడ్డి’ తర్వాత చిరంజీవి, నయనతార కలయికలో మరో సినిమా రానుందా? అంటే ఔననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. ‘సైరా’ అనంతరం కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నారు చిరంజీవి. సామాజిక ఇతివృత్తంతో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రాన్ని ఆగస్టులో సెట్స్‌పైకి తీసుకొచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నది. ఇందులో నయనతార కథానాయికగా నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గ్లామర్‌తో పాటు నటనకు ఆస్కారం ఉన్న పాత్ర ఇదని, తొలుత పలువురు దక్షిణాది అగ్ర కథానాయికల పేర్లను పరిశీలించిన దర్శకుడు కొరటాల శివ చివరకు నయనతారను హీరోయిన్‌గా ఎంపికచేసినట్లు తెలిసింది. ఆమె కూడా ఈ సినిమాలో నటించడానికి సంసిద్ధతను వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నట్లు తెలిసింది. ఇందులో చిరంజీవి నలభై ఏళ్ల వ్యక్తిగా కనిపించబోతున్నట్లు చెబుతున్నారు.

# కల్యాణ్‌రామ్ ‘ఎంత మంచివాడవురా’

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి ‘ఎంత మంచివాడవురా’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సతీష్ వేగేశ్న దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సుభాష్ గుప్తా, శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. శుక్రవారం కల్యాణ్‌రామ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని టైటిల్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాతలు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘కల్యాణ్‌రామ్ స్వతహాగా మంచి మనసున్న వ్యక్తి. ఈ సినిమాలో పాత్ర కూడా అదే విషయాన్ని ప్రతిబింబిస్తుంది. శ్రేయోభిలాషులందరూ టైటిల్ బాగుందని అభినందిస్తున్నారు. ఈ నెల 24 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం. హైదరాబాద్, రాజమండ్రి, ఊటీలో చిత్రీకరణ జరుపుతాం. వాణిజ్య అంశాల మేళవింపుతో అన్ని వర్గాలను ఆకట్టుకునే చిత్రమిది’ అన్నారు. కథానుగుణంగా ఈ టైటిల్ పెట్టామని, నిత్యజీవితంలో మనం తరచు ఉపయోగించే మాట ఇదని దర్శకుడు చెప్పారు. మెహరీన్, వి.కె.నరేష్, సుహాసిని, తనికెళ్ల భరణి, పవిత్ర లోకేష్, రాజీవ్ కనకాల, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజ్ తోట. సంగీతం: గోపీసుందర్, నిర్మాత: ఉమేష్‌గుప్తా, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సతీష్ వేగేశ్న.


‘ఎంత మంచివాడవురా’ చిత్రంలో కల్యాణ్‌రామ్

# బన్నీ వ్యానిటీ వ్యాన్!


అల్లు అర్జున్

మెగా హీరో అల్లు అర్జున్ తెలుగు చిత్ర పరిశ్రమలో అందరికి భిన్నంగా ఆలోచిస్తుంటారు. స్టైలిష్ స్టార్‌గా గుర్తింపును సొంత చేసుకున్న ఆయన ఏది చేసినా కొత్తగా, స్టైల్‌గా వుండాలని తాపత్రయ పడుతుంటారు. సినిమాలతో పాటు తను వాడే గాడ్జెట్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధను కనబరిచే ఆయన ఇటీవల తన అభిరుచికి అనుగుణంగా ఓ వ్యానిటీ వ్యాన్‌ను తయారు చేయించుకున్నారు. సకల సౌకర్యాలతో సిద్ధమైన ఈ వ్యానిటీ వ్యాన్ పేరు ‘ఫాల్కన్’. దాదాపు 6 కోట్ల వ్యయంతో దీన్ని తయారు చేయించుకున్నారాయన. దీనికి సంబంధించిన ఫొటోలని సోషల్ మీడియా ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ‘నా జీవితంలో నేను ఏదైనా కొనుక్కున్న ప్రతీసారి అభిమానులు ఎల్లప్పుడూ నాపై ప్రేమను కురిపించారు. ఆ విషయాన్ని మాత్రమే ఆలోచిస్తుంటాను. నేను ఇవన్నీ కొనుక్కోగలుగుతున్నానంటే వారికి నాపై వున్న ప్రేమలోని పవరే కారణం. మీకు ఎప్పటికీ రుణపడి వుంటాను. ఇదే నా వ్యానిటీ వ్యాన్. ‘ఫాల్కన్’’ అని అల్లు అర్జున్ ట్విట్ చేశారు.

# లక్ష్యసాధనలో గుణ

కార్తికేయ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ‘గుణ 369’. అర్జున్ జంధ్యాల దర్శకుడు. అనఘ కథానాయిక. ఆగస్ట్ 2న విడుదలకానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘మనం చేసే తప్పుల వల్ల మన జీవితానికి ఏం జరిగినా ఫర్వాలేదు. కానీ పక్కనోడి జీవితానికి ఏ హానీ జరగకూడదు’ అంటూ సాయికుమార్ సంభాషణలతో ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభిస్తున్నది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలున్న చిత్రమిది. తెలుగులో ఇప్పటివరకు రానటువంటి ఓ వైవిధ్యమైన కథాంశమిది’ అన్నారు. ‘ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే ట్రైలర్‌ను, పాటల్ని విడుదల చేస్తాం. లక్ష్యసాధనలో ఓ యువకుడికి ఎదురైన అవరోధాలు ఏమిటన్నదే చిత్ర కథాంశం’ అని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రామ్, సంగీతం: చైతన్ భరద్వాజ్, నిర్మాణ సంస్థలు: జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్, ఎస్‌జీ మూవీ మేకర్స్, నిర్మాతలు: అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సత్య కిషోర్, శివ మల్లాల.


కార్తికేయ

# ప్రియుడి కోసం పోరాటం


త్రిష

చెన్నై సోయగం త్రిష కథాంశాల ఎంపికలో నవ్యతకు ప్రాధాన్యతనిస్తున్నది. మహిళా ఇతివృత్తాల్లో తన ప్రత్యేకతను చాటుకోవాలని ప్రయత్నిస్తున్నది. తాజాగా ఈ సుందరి తమిళంలో ఓ యాక్షన్ సినిమాలో నటిస్తోంది. ఇందులో త్రిష మీద కొన్ని పోరాట ఘట్టాల్ని చిత్రీకరిస్తున్నారు. ‘గర్జనై’ పేరుతో రూపొందుతున్న ఈ చిత్రానికి సుందర్‌బాలు దర్శకత్వం వహిస్తున్నారు. సినిమాలో తన పాత్ర చిత్రణ శక్తివంతంగా ఉంటుందని, తన పరిచయ సన్నివేశం ఫైట్ సీన్‌తో మొదలవుతుందని చెప్పింది త్రిష. ఆమె మాట్లాడుతూ ‘సాధారణంగా హీరోల ఇంట్రడక్షన్ సీన్స్‌ను యాక్షన్ నేపథ్యంలో రూపొందిస్తారు. కానీ ఈ సినిమాలో నా పరిచయ సన్నివేశం భారీ యాక్షన్ హంగులతో ఉంటుంది. ఒక్క రాత్రిలో జరిగే కథతో దర్శకుడు వినూత్నంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు’ అని చెప్పింది. ఈ చిత్రంలో త్రిష పాశ్చాత్య డ్యాన్సర్ పాత్రలో నటిస్తున్నదట. ప్రియుడితో కలిసి భారతదేశ విహారానికి వచ్చిన ఆమెకు ఇక్కడ భయానక పరిస్థితులు ఎదురవుతాయి. వాటి నుంచి తన ప్రియుడిని రక్షించుకునే ధైర్యవంతురాలైన యువతిగా త్రిష పాత్ర చిత్రణ పవర్‌ఫుల్‌గా సాగుతుందని చిత్ర బృందం తెలిపింది. త్రిషపై చిత్రీకరించిన జీప్ ఛేజింగ్ సన్నివేశాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెబుతున్నారు.

# ఒకే ఒక్కడు సీక్వెల్?


శంకర్

అర్జున్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం ‘ముదల్‌వన్(తెలుగులో ‘ఒకే ఒక్కడు’) మంచి వసూళ్లను సాధించింది. ఒక రోజు ముఖ్యమంత్రి అనే పాయింట్‌తో రాజకీయ ఇతివృత్తానికి సందేశాన్ని జోడిస్తూ వినూత్నంగా ఈ సినిమాను తెరకెక్కించి విమర్శకుల ప్రశంసల్ని అందుకున్నారు శంకర్. తాజాగా ఈ చిత్రానికి సీక్వెల్‌ను రూపొందించేందుకు శంకర్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. తమిళ అగ్ర హీరో విజయ్ ఈ సీక్వెల్‌లో కథానాయకుడిగా నటించనున్నట్లు తెలిసింది. తొలి భాగం తరహాలోనే సమకాలీన రాజకీయాలు, అవినీతి ప్రధానాంశాలుగా ‘ముదల్‌వన్-2’ రూపొందనున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న ‘బిగిల్’ సినిమాతో విజయ్ బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత ‘ముదల్‌వన్-2’ సెట్స్‌పైకిరానున్నట్లు సమాచారం.

# సెలబ్రిటీ అవార్డ్స


సుమన్, రోశయ్య, గురురాజ్, జీవిత, కల్యాణ్

ప్రజాడైరీ 19వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రాత్రి హైదరాబాద్‌లో ఫిలిం సెలెబ్రిటీ అవార్డ్స కార్యక్రమాన్ని ఆ సంస్థ అధినేత సురేష్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య పలువురికి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ‘సురేష్ గత 19 ఏళ్లుగా తెలుసు. నాకు మంచి మిత్రుడు కూడా. ఆయన పట్టుదల నాకు నచ్చుతుంది. రోశయ్యతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందాన్ని కలిగించింది. ప్రజాడైరీ తరపున సురేష్ ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేయాలని కోరుకుంటున్నాను’ అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడంలో సురేష్ ఎప్పుడూ ముందుంటారని, ఆయన నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ తాను పాల్గొంటున్నానని తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి.కల్యాణ్, జీవిత, హేమ, గురురాజ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# దిల్‌రాజు ద్వారా...


రాకేష్, గార్గెయి

రాకేష్ వర్రె, గార్గెయి ఎల్లప్రగడ జంటగా నటిస్తున్న చిత్రం ‘ఎవరికీ చెప్పొద్దు’. బసవ శంకర్ దర్శకత్వంలో రాకేష్ వర్రె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత దిల్‌రాజు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా రాకేష్ వర్రె మాట్లాడుతూ ‘హృద్యమైన ప్రేమకథలకు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. అలాంటి కథతో తెరకెక్కిన రొమాంటిక్ లవ్ స్టోరీ ఇది. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. చిత్రాన్ని ఆగస్టులో విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం. ఈ చిత్ర కథ నచ్చి నిర్మాత దిల్ రాజు రిలీజ్ చేయడానికి ముందుకొచ్చారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలోనే తెలియజేస్తాం’ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ జె. ఆనంద్, సంగీతం: శంకర్‌శర్మ, ఎడిటింగ్: బసవ శంకర్, తేజు యర్రంశెట్టి, సత్యజిత్ సుగ్గు, సౌండ్ డిజైన్: సింక్ సినిమా, పాటలు: వాసు వలబోజు.

# గ్రామీణ ప్రేమకథ



మంజునాథ్, తనిష్క

మంజునాథ్ హీరోగా నటిస్తూ రూపొందిస్తున్న చిత్రం ‘మా ఊరి ప్రేమకథ’. శ్రీలక్ష్మీ మల్లికార్జునస్వామి క్రియేషన్స్ పతాకంపై లక్ష్మీదేవి, మహేంద్రనాథ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తనిష్క తివారి కథనాయిక. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాతలు మాట్లాడుతూ ‘గ్రామీణ నేపథ్యంలో సాగే చిత్రమిది. లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. మంజునాథ్ హీరోగా నటిస్తూ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. కొత్త పంథాలో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందన్న నమ్మకముంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో సెన్సార్ పూర్తి చేసి చిత్రాన్ని ఆగస్టులో విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం’ అన్నారు. యథార్థ సంఘటల నేపథ్యంలో సహజత్వానికి దగ్గరగా రూపొందిన చిత్రమిది. జయసూర్య సంగీతం ఆకట్టుకుంటుంది’ అని దర్శకుడు తెలిపారు.

# క్రైమ్ థ్రిల్లర్ ‘ధమ్కీ’


త్రిషాలాషా, రజిత్

రజిత్, త్రిషాలాషా జంటగా నటిస్తున్న చిత్రం ‘ధమ్కీ’. ఏనుగంటి దర్శకత్వం వహిస్తున్నారు. సత్యనారాయణ సుంకర నిర్మిస్తున్నారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. దర్శకుడు మాట్లాడుతూ ‘వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ ఇది. తన లక్ష్యానికి అడ్డుగా నిలిచిన వారికి ఓ యువకుడు ఎలా ధమ్కీ ఇచ్చాడన్నది ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం పతాక ఘట్టాలను చిత్రీకరిస్తున్నాం’ అని తెలిపారు. ప్రేమ, యాక్షన్, వినోదానికి వాణిజ్య హంగులను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, ఊహకందని మలుపులతో ఉత్కంఠను పంచుతుందని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు. శ్రవణ్, అజయ్, శ్రీనివాసరెడ్డి, పృథ్వీ, చిత్రం శ్రీను, వేణు, బిత్తిరి సత్తి ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.బి. ఆనంద్, ఛాయాగ్రహణం: దీపక్ భగవంత్.




## అశ్రునివాళి



## డా॥ విజయ నిర్మల.జి

కళగా పుట్టి , కళలో పెరిగి , కళతో తన జీవితాన్ని
సార్థకం చేసుకున్న కళాధరిత్రి మీరు. ప్రేమ , అనురాగం , ఆత్మీయత
అందరికి పంచి ఈ వసుధైక కుటుంబం యొక్క ఆదర్శాన్ని
నిజం చేసిన గొప్ప మాతృమూర్తి మీరు.
మీ ఆశలని మా ఆశయాలుగా మార్చుకొని
మీ ఆలోచన ని మా ఆచరణగా మలచుకొని
మీ జ్ఞాపకాల్ని మా గుండెల్లో నిలుపుకొని
సదా మిమ్మల్ని స్మరిస్తూ . . .

మీ కుటుంబం